## ఆయిల్ పామ్ కోసం
# ఏకమవుదాం

**కేంద్రంపై ఒత్తిడి పెంచుదాం రండి**

**దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయమంత్రులకు తుమ్మల లేఖ**



హైదరాబాద్ : కేంద్రంపై ఉమ్మడిగా ఒత్తిడికి దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. ఆయిల్ పామ్ రైతుల కోసం దక్షిణాది రాష్ట్రాలు ఏకమవ్వాలని కోరారు. ప్రధాని మోదీని కలిసి ఆయిల్ పామ్ రైతుల 2


TARAJYOTHI TELUGU DAILY

# తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

| ఆదివారం, జూలై 19, 2026 | సంపుటి - 20 | సంచిక 294 | వెల - 4రూ | పేజీలు - 12 |
| --- | --- | --- | --- | --- |

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.





# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

చెత్తనుంచి సంపద సృష్టించడమే మా లక్ష్యం

తడి, పొడి చెత్తను ఇంట్లోనే వేరు చేయాలి

ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు

రౌడీయిజం చేసేవారిని ఉపేక్షించబోమని హెచ్చరిక

గుడివాడ స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో చంద్రబాబు

విజయవాడ : రాష్ట్రంలో అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి చెత్తలేకుండా చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గుంటూరు, నెల్లూరు నగరాల్లో చెత్త సేకరణకు ఉపయోగించే.. ఎలక్ట్రిక్ ఆటోలను వర్చువల్‌గా ప్రారంభించారు. బాగా పని చేసిన వారికి పురస్కారాలను ప్రదానం చేశారు. ఇంట్లో ఎవరికి వారే.. తడి, పొడి చెత్తను వేరు చేసుకోవాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. మే 23 నుంచి జూన్ 20 వరకు ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమం చేపట్టాం. ఆగస్టు 26 నాటికి 1140 ఈ-ఆటోలు అందుబాటులోకి వస్తాయి. 108 సమగ్ర ఘన వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాల కోసం రూ.528 కోట్లు ఖర్చు చేస్తున్నాం. 'ప్రజారథం' కార్యక్రమం ద్వారా చెత్తను కొనుగోలు చేసి.. నిత్యావసర వస్తువులు అందజేశాం. దీనికోసం ఇప్పటి వరకు రూ.16 కోట్లు ఖర్చు చేశాం. చెత్త నుంచి సంపద సృష్టించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం అని చంద్రబాబు అన్నారు. ఎవరి ఇంటిపై వాళ్లే కరెంటు తయారు చేసుకోవాలని పిలుపునిచ్చారు. కాలుష్యం మన ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చెత్త నిర్వహణలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని సూచించారు.

తరువాయి 2లో




## పర్యాటక రంగంలో పెట్టుబడులకు
# ఏపీ అత్యంత సురక్షితం

**పర్యాటక మంత్రి కందుల దుర్గేష్**

**"ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ముఖ్య అతిథిగా మంత్రి**

**సింగిల్ విండో విధానం ద్వారా శరవేగంగా పర్యాటక అనుమతులు**

అమరావతి : భారతదేశ దేశీయ పర్యాటక రంగ అభివృద్ధిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అత్యంత కీలకమైన భూమిక పోషిస్తోందని, పర్యాటక రంగాన్ని ఒక వ్యూహాత్మక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. శనివారం న్యూఢిల్లీలోని చాణక్యపురి 'హోటల్ జింజర్' వేదికగా అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా నిర్వహించిన "ఆల్ ఇండియా చాప్టర్ ఛైర్మన్ల సమావేశం 2026"కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. "స్వదేశీ పర్యటన్ ? సశక్త్ భారత్" అనే ప్రధాన 2లో




## ఆహార కల్తీపై
# ఉక్కుపాదం

## ప్రజల ప్రాణాలతో చెలగామడితే కఠిన చర్యలు

## ఆహార కల్తీ నిరోధానికి పటిష్టమైన చట్టం

**ప్రపంచ దేశాల్లో అమలవుతున్న విధానాలపై అధ్యయనం**

**సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విచ్చలవిడిగా అమ్మకాలు**

**వాటి స్వచ్ఛతపైనా ఇకనుంచి పరిశీలిన**

**అసెంబ్లీలో చర్చించి సమగ్ర చట్టం రూపకల్పన**

**ఉన్నతస్థాయి సమీక్షలో సిఎం రేవంత్ ఆదేశం**

హైదరాబాద్ : ఎరువులు, పురుగు మందులు ఎక్కువగా వాడటంతో పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రస్తావిం చారు. మార్కెట్ లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో భారీ ధరలకు అమ్ముతున్నారని, అవి సేంద్రియ ఉత్పత్తులేనని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలకు వెళ్లి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రంగా చర్చించ డంతో పాటు.. ప్రజల అభిప్రాయాలు స్వీకరించనున్నట్లు తెలిపారు. కల్తీలకు సంబంధించి సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని చెప్పారు.

తరువాయి 2లో

**ఆహార, ఔషధాల కల్తీని నిరోధించేందుకు కఠిన చట్టం రూపొందించాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు, ఆహార పదార్థాల కల్తీ వల్ల ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆహార, ఔషధ కల్తీ నియంత్రణపై మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు.. పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండటంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు.**

## స్థానిక ఉత్పత్తులను
# ప్రజలు ఆదరించాలి




**16 నుండి 26 వరకు 'బోనాలు- చేతివృత్తుల మేళా'**

**ట్యాంక్ బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రదర్శనలు**

**మంత్రి పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్ : చేతి వృత్తి కళాకారులకు చేయూతనివ్వాలని రాష్ట్ర ప్రభుత్వ బిసి సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'బోనాలు- చేతి వృత్తుల మేళా, బిసి చేతివృత్తుల అమ్మకాలు- ప్రదర్శన'ను ఈనెల 16వ తేదీ నుండి 26 వరకు ట్యాంక్ బండ్, అంబేద్కర్ విగ్రహము ప్రక్కన గల గ్రౌండ్స్ లో నిర్వహిస్తోంది. చేతివృత్తుల కళాకారులచే తయారు చేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయము విజయవంతంగా కొనసాగుతున్నది. 2లో



## 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ
# హర్షం

**స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి ఫోన్‌లో అభినందనలు**

**ఇంజనీర్ల కృషిని ప్రశంసిస్తూ.. తనను కలవాలని సందేశం**

న్యూఢిల్లీ : భారత తొలి ప్రైవేటు అంతరిక్ష ప్రయోగం 'విక్రమ్-1' విజయవంతం కావడంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ప్రయోగం విజయవంతమైన వెంటనే హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ బృందంతో ఫోన్‌లో మాట్లాడి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు మోదీ. ఈ ప్రయోగాన్ని తాను ప్రత్యక్షంగా వీక్షించినట్టు చెప్పిన ఆయన.. ఈ ఘనత దేశానికి గొప్ప విజయమని అభివర్ణించారు. 2లో



## స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1'
# విజయవంతం

**భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం**

**తొలుత ఇంధన ప్రక్రియలో సాంకేతిక లోపం**

**అరగంటలోపే సరిదిద్ది ప్రయోగాన్ని పూర్తి చేసిన షార్**

**ప్రైవేట్ రంగంలో తొలి రాకెట్ కావడంతో సర్వత్రా హర్షం**

**ప్రయోగాన్ని వీక్షించిన లోకేశ్, ఇస్రో మాజీ శాస్త్రవేత్తలు**

శ్రీహరికోట : భారత అంతరిక్ష రంగంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైంది. శ్రీహరికోట షార్ అంతరిక్ష కేంద్రం నుంచి చేపట్టిన ప్రయోగం విజయవంతం అయ్యింది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పే 'విక్రమ్-1' రాకెట్ రూపొందించింది. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం(షార్) నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. దీంతో ప్రభుత్వ ఆధ్వర్యంలోని అంతరిక్ష కార్యక్రమాలు సహా భారత ప్రైవేటు రంగం కూడా ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపగల సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటినట్లు అయ్యింది.

తరువాయి 2లో

## భాజపా నేతల్లో ఎలాంటి
# విభేదాలు లేవు

**అందరం కలసి అధికారం కోసం కృషి చేస్తున్నాం**

**బండి సంజయ్, ఈటెల మధ్య సయోధ్యకు యత్నం**

**ఎంపి లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో అభయ్ పాటిల్ చర్చలు**

**తెలంగాణలో అధికారం బిజెపిదేనన్న ఎంపి లక్ష్మణ్** 2

## లక్షల ఉద్యోగాల హామీ
# ఏమయ్యింది

**జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏవీ**

**కొలువుల కుంభమేళా కాదు.. కుంభకోణాల కుంభమేళా**

**ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయి**

**మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోంది**

**బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ ఘాటు విమర్శలు** 2



# ఆయిల్ పామ్ కోసం ఏకమవుదాం

సమస్యలు వినిపిద్దామన్నారు. ఆయిల్ పామ్‌కు కనీస హామీ ధర రూ.25 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. లేదంటే క్రూడ్ పామ్ ఆయిల్ దిగుమతి సుంకాన్ని 44 శాతానికి పునరుద్ధరించాలన్నారు. దిగుమతి సుంకాల తగ్గింపుతో రైతులకు భారీ నష్టం వాటిల్లుతోందని మంత్రి తెలిపారు. దేశ ఆయిల్ పామ్ సాగులో 75 శాతం వాటా దక్షిణాది రాష్ట్రాలదే అని చెప్పుకొచ్చారు. రైతులకు స్థిర ఆదాయం కోసం కేంద్రం తక్షణ జోక్యం అవసరమన్నారు. వంటనూనెల స్వయం సమృద్ధి లక్ష్యానికి రైతుల రక్షణ కీలకమన్నారు. ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాల కోసం దక్షిణాది రాష్ట్రాలు కలిసిరావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు.

# స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలి

ఈ ప్రదర్శనలో కుమ్మరులు వారు తయారు చేసిన మట్టిపాత్రలు, గౌడన్నల 'నీరా' స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు,హ్యాండ్ లూమ్స్ పోచంపల్లి-ఇక్కత్, గద్వాల్ - నారాయణపేట్, పూసలవారి సామగ్రి, మహిళా స్వయం సహాయక సంఘాల స్వగృహ ఫుడ్స్, ఇతర బీసి వర్గాలచే తయారు చేయబడిన వస్తువులు, తెలంగాణ వంటకాలు, మత్స్య కారుల తయారు చేయబడే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ ప్రదర్శనలో లభించే వస్తువులు వినియోగదారులకు, సందర్శకులకు సరసమైన ధరలలో లభ్యమవుతున్నాయి. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 10:00 గంటల వరకు కొనసాగుతున్నది. ప్రభుత్వం సందర్శకులకు ప్రవేశము ఉచితంగా కల్పిస్తున్నది. ప్రదర్శనలో వివిధ రంగాలకు చెందిన 60 స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రజల నుంచి వస్తున్న విశేష ఆదరణతో స్టాల్స్ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చేనేత, హస్తకళలు, మట్టి కళలు, చెక్క బొమ్మలు వంటి సంప్రదాయ కళలను ప్రోత్సహించడ మే ఈ మేళా ప్రధాన లక్ష్యమని, గ్రామీణ కళాకారుల ప్రతిభకు మార్కెట్ కల్పిస్తూ వారి జీవనోపాధిని బలోపేతం చేయడంలో ఇటువంటి మేళాలు కీలక పాత్ర పోషిస్తాయని రాష్ట్ర బిసి సంక్షేమశాఖ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 'వోకల్ ఫర్ లోకల్' భావనకు అనుగుణంగా స్థానిక ఉత్పత్తులను ప్రజలు ఆదరించాలని, సాంప్రదాయ కళలను నేటి తరానికి పరిచయం చేసి, భావితరాలకు అందించడం మన అందరి బాధ్యత అని ఆయన తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కళాకారుల సంక్షేమం, నైపుణ్యాభివృద్ధి, మార్కెటింగ్ అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉందన్నారు. మేళాలో పాల్గొన్న ప్రతి కళాకారుడికి అభినందనలు తెలియజేస్తూ, ప్రజలు పెద్ద ఎత్తున సందర్శించి హస్తకళ ఉత్పత్తులను కొనుగోలు చేసి కళాకారులను ప్రోత్సహించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. మన కళలు, మన చేతివృత్తులు? మన సంపద అనే భావనతో ప్రతి ఒక్కరూ ఈ మేళాను విజయవంతం చేయాలన్నారు. బోనాల పండుగకు అవసరమైన బోనం కుండలతో పాటు సంప్రదాయ ఆచారాలకు ఉపయోగించే వివిధ రకాల వస్తువులను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానంలో అంతర్భాగమైన అనేక కులవృత్తులను కనుమరుగు అవ్వకుండా మరింతగా ప్రోత్సహించెందుకు ప్రభుత్వం ప్రదర్శనను ఏర్పాటు చేసింది.

# భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవు

హైదరాబాద్ : తెలంగాణ భాజపా నేతల్లో ఎలాంటి విభేదాలు లేవని, అందరం కలిసి అధికారం కోసం కృషి చేస్తున్నామని బీజేపి ఎంపి లక్ష్మణ్ అన్నారు. బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య ఉన్న విభేదాలపై ఆయన స్పందించారు. కీలక నేతల మధ్య విభేదాలపై అధిష్ఠానం దృష్టి సారించింది. కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ తో ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ భేటీ అయ్యారు. ఎంపీ లక్ష్మణ్ నివాసంలో ఇద్దరు నేతలతో గంట పాటు సమావేశం జరిగింది. పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలని అభయ్ పాటిల్ వారికి సూచించారు. కరీంనగర్ నియోజకవర్గానికి సంబంధించిన అంశాల్లో ఇద్దరూ కలిసి పని చేయాలని, ఏవైనా సమస్యలు ఉంటే.. అంతర్గతంగా పరిష్కరించుకోవాలని ఆదేశించారు. అనంతరం ఇరువురు నేతలతో కలిసి ఎంపీ లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో భాజపాను అధికారంలోకి తీసుకురావడంపై చర్చించినట్లు తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్‌పై కోపం ఉందని, అలాగే బీఆర్ఎస్‌పై నమ్మకం లేదని తెలిపారు. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, లోక్‌సభ సీట్లు పెరుగుతాయని, జమిలి ఎన్నికలు జరుగుతాయన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు. భాజపాను అధికారంలోకి తెచ్చేందుకు తామంతా కలిసి పనిచేస్తామని చెప్పారు. తెలంగాణలో అధికారంలోకి రావాలనే పట్టుదలతో ఉన్న బీజేపీ.. ఆ దిశగా అడుగులు వేస్తోందన్నారు. ఈ క్రమంలోనే నేతల మధ్య విభేదాలను తొలగించి.. అందరినీ ఒక తాటిపైకి తీసుకురావాలని ప్లాన్ చేస్తోంది. ఎంతో కాలంగా విభేదాలతో ఎడమొహం పెడమొహంగా ఉంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ మధ్య సయోధ్య కుదిర్చారు. వీరిద్దరి మధ్య రాజీ కుదిర్చేందుకు రంగంలోకి దిగిన బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్.. నేడు ఈటల రాజేందర్, బండి సంజయ్‌తో సమావేశం నిర్వహించారు. ఎంపీ లక్ష్మణ్ నివాసం వేదికగా జరిగిన ఈ సమావేశంలో ఈటల, బండి మధ్య రాజీ కుదిర్చారు. విభేదాలు పక్కనపెట్టి.. తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకువచ్చే దిశగా కృషి చేయాలని ఇద్దరు నేతలకు అభయ్ పాటిల్ దిశానిర్దేశం చేశారు. భేటీ అనంతరం మీడియా ముందుకు బీజేపీ నేతలు.. తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవన్నారు. సరిగ్గా తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ తీరుతో ప్రజలు విసిగిపోయారన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నెరవేర్చలేదని, కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఏర్పడిందంటూ ఎంపీ లక్ష్మణ్ మండిపడ్డారు. తెలంగాణ అభివృద్ధిపై మోదీ ప్రత్యేక చొరవ చూపారని, వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీదే అధికారమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# బహదూర్‌గూడాలో మరోమారు ఉద్రిక్తత

## పోలీసులపై కారం చల్లి..కుర్చీలతో దాడి

రంగారెడ్డి,జులై18 : రంగారెడ్డి జిల్లా శంషాబాద్ పరిధిలోని బహదూర్‌గూడలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఇక్కడి ప్రభుత్వ భూమికి హైడ్రా అధికారులు ఫెన్సింగ్ వేయడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. భూములు సాగు చేసుకుంటున్న తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆందోళనకారులు పోలీసులపైకి కారం చల్లి, కుర్చీలు విసిరేశారు. డీసీపీ యోగేశ్ గౌతమ్‌తో సహా పలువురు సీఐల కళ్లలో కారం పడింది. ఈ క్రమంలో రైతులకు మద్దతిస్తున్న నేతలను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులపై కారం చల్లి, కుర్చీలు విసరడం సరికాదని డీసీపీ యోగేశ్ గౌతమ్ అన్నారు. ప్రభుత్వ భూమికే ఫెన్సింగ్ వేస్తున్నామని, సాగులో ఉన్న పంటను పాడు చేయడం లేదని అన్నారు. రైతులు శాంతియుతంగా నిరసన తెలపాలని కోరారు. ఉదయం కూడా రైతులు ఇక్కడ ఆందోళన చేపట్టారు. బులెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం సేకరించిన స్థలంలో కంచె వేసేందుకు వెళ్లిన రెవెన్యూ, హైడ్రా అధికారులతో రైతులు వాగ్వాదానికి దిగారు. 650 ఎకరాల భూమికి హైడ్రా సాయంతో కంచె వేసేందుకు వచ్చిన అధికారులను అడ్డుకున్నారు. కంచె వేయడాన్ని నిరసిస్తూ ఆర్డీవో శ్రీధర్‌తో స్థానికులు వాగ్వాదానికి దిగారు. ఉదయం నుంచి నిరసనలు కొనసాగుతుండగా.. తాజాగా పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి.

# ఆహార కల్తీపై ఉక్కుపాదం

సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సీఎం దిశానిర్దేశర చేశారు.ఈ క్రమంలో తెలంగాణలో ఆహార, ఔషధ కల్తీలను పూర్తిగా అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కఠిన చట్టాన్ని తీసుకురావాలని నిర్ణయించింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో కల్తీల నియంత్రణపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కల్తీ ఆహారం, నకిలీ ఔషధాల వల్ల ప్రజల ఆరోగ్యం తీవ్ర ప్రమాదంలో పడుతోందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కల్తీకి సంబంధించిన సమాచారాన్ని ప్రజలు నేరుగా ప్రభుత్వానికి చేరవేసేలా ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్‌ను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విజిల్ బ్లోయర్ల వ్యవస్థను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ అథారిటీ చట్టంపై అసెంబ్లీలో సమగ్ర చర్చ నిర్వహించి, ప్రజల అభిప్రాయాలను సేకరించిన అనంతరం బిల్లుకు తుది రూపం ఇవ్వాలని సీఎం స్పష్టం చేశారు. కల్తీల నియంత్రణలో ప్రపంచంలోని వివిధ దేశాల్లో అమలవుతున్న చట్టాలు, విధానాలను అధ్యయనం చేసి వాటిలో ఉత్తమ పద్ధతులను తెలంగాణలో అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. తొలి దశలో 'క్యూర్' ప్రాంతంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ వ్యవస్థను అమలు చేసి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపింది. సేంద్రియ ఉత్పత్తుల ధృవీకరణకు ప్రత్యేక వ్యవస్థను రూపొందించడంపైనా ప్రభుత్వం దృష్టి సారించింది. రసాయన అవశేషాలు, కల్తీ కారణంగా వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, కల్తీలకు పాల్పడే వారిపై ఇకపై ఎలాంటి రాజీ లేకుండా కఠిన చర్యలు తీసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ సమీక్షలో డిజిపి ఆనంద్, సిఎస్ సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# స్కైరూట్ ఏరోస్పేస్ 'విక్రమ్-1' విజయవంతం

వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగానికి స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఆ తర్వాత శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టి ఇంధన పక్రియలో తలెత్తిన సమస్యను గుర్తించి సరిచేశారు. 35 నిమిషాల తర్వాత తిరిగి రాకెట్‌ను ప్రయోగించారు. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్‌లు సహా ప్రధాని నరేంద్ర మోదీ స్వహస్తాలతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది. వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్-1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్నీ నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాం వంటి ప్రముఖుల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేకాకుండా.. ఈ ప్రయోగం విజయవంతం కావాలని కాంక్షిస్తూ స్కైరూట్ టీమ్ సహా ఇస్రో మాజీ ఛైర్మన్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులనూ ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు. స్కైరూట్ సంస్థ 'మిషన్ ఆగమన్' పేరిట ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టింది. విక్రమ్-1 ద్వారా గ్రహస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమానిస్ట్రేషన్ పేలోడ్‌లు సహా స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను కూడా అంతరిక్షంలోకి పంపారు. ఈ ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి తద్వారా కీలక సమాచారం రాబట్టనున్నారు. దీంతో రానున్న కాలంలో వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవడమే లక్ష్యంగా స్కైరూట్ ముందడుగేస్తోంది.ఇక.. సుమారు ఏడంతస్తుల భవనం ఎత్తులో రూపొందిన విక్రమ్-1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణంతో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లోఎర్త్ ఆర్బిట్ లో ప్రవేశపెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంది. 2022లో విక్రమ్-ఎస్ ద్వారా తొలి ప్రైవేట్ రాకెట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్-1తో తొలి దేశీయ ప్రైవేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టింది. ఈ ప్రయోగాన్ని ఏపీ మంత్రి నారా లోకేశ్ ప్రత్యక్షంగా వీక్షించారు. కుమారుడు దేవాన్ష్‌తో కలిసి శ్రీహరికోటకు వెళ్లిన లోకేశ్.. ఇస్రో గ్యాలరీ నుంచి 'విక్రమ్-1' ప్రయోగాన్ని వీక్షించారు. ఇస్రో మాజీ ఛైర్మన్లు, సీనియర్ శాస్త్రవేత్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 'విక్రమ్-1' విజయవంతంపై ప్రధాని మోడీ హర్షం

భారత అంతరిక్ష ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. 'ప్రయోగాన్ని నేను ప్రత్యక్షంగా వీక్షించాను. దీని వెనుక ఎందరో యువ ఇంజినీర్ల శ్రమ దాగుంది. మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు. ఇది ఆరంభం మాత్రమే. ఈ ప్రయాణాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలి' అని స్కైరూట్ టీమ్‌ను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు, ఇంజినీర్ల బృందం త్వరలో తనను కలవాలని ఫోన్ ద్వారా ఆహ్వానించారు. అంతరిక్ష రంగంలో భారత్ స్వావలంబన దిశగా వేగంగా ముందుకు సాగుతోందని ఈ ప్రయోగం ప్రపంచానికి చాటిచెప్పిందని మోదీ అభిప్రాయపడ్డారు. 'అంతరిక్ష రంగంలోనూ భారత్ ఆత్మనిర్భర్‌గా ఎదగగలదని మీరు ప్రపంచానికి నిరూపించారు' అని ప్రధాని కొనియాడారు. 'విక్రమ్-1'లో తన 'వందేమాతరం' సందేశంతో కూడిన కార్డును కూడా పంపించిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన శుభాకాంక్షలు సహా ఆ సందేశం కూడా అంతరిక్షంలోకి చేరడం గర్వకారణమన్నారు. 'ఈ ప్రయోగం ద్వారా 'వందేమాతరం' సందేశం మరింత ఉన్నత స్థాయికి చేరి అంతరిక్షంలోనూ మార్మోగింది' అని మోదీ వ్యాఖ్యానించారు. శ్రీహరికోటలోని సతీష్ ధవన్ అంతరిక్ష కేంద్రం నుంచి శనివారం మధ్యాహ్నం 12:05 గంటలకు 'మిషన్ ఆగమన్' పేరిట చేపట్టిన 'విక్రమ్-1' రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. నిర్ణీత సమయం కంటే 35 నిమిషాలు ఆలస్యంగా ప్రయోగం చేపట్టినప్పటికీ.. అన్ని దశలను విజయవంతంగా పూర్తి చేయడంతో భారత ప్రైవేటు అంతరిక్ష రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికింది.

# లక్షల ఉద్యోగాల హామీ ఏమయ్యింది

హైదరాబాద్ : ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలిస్తానని రాహుల్ గాంధీ ఇచ్చిన మాట తప్పారని కేటీఆర్ తెలిపారు. రాహుల్ గాంధీకి తెలుగు రాదు.. మన బాధ తెల్వదు అని అన్నారు. అశోక్‌నగర్‌లో చాయ్‌పే చర్చా పెట్టింది అసలు రాహుల్‌గాంధీకి గుర్తుందా అని ప్రశ్నించారు. యువత తలరాత మారుస్తానని అబద్ధపు హామీలు ఇచ్చారని.. జాబ్ క్యాలెండర్, రెండు లక్షల ఉద్యోగాలు ఏమయ్యాయని నిలదీశారు. డిగ్రీ విద్యార్థినులకు స్కూటీలు ఏమయ్యాయి? విద్యా భరోసా ఏమైందని అడిగారు. ఢిల్లీలో రాహుల్ గాంధీ జేబులు నిండుతున్నాయని.. తెలంగాణలో లూటీ జరుగుతోందని కేటీఆర్ విమర్శించారు. తెలంగాణలో మొహబ్బత్‌కి దుకాణ్ కాదు.. ధోకేకా మకాన్ నడుస్తోందని ఆరోపించారు. కొలువుల కుంభమేళా అని చెప్పి.. కుంభకోణాల కుంభమేళా చేస్తున్నారని మండిడ్డారు. హైదరాబాద్ సరూర్‌నగర్‌లో బీఆర్ఎస్ తలపెట్టిన యువ సంగ్రామ సదస్సులో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఉద్యోగాలు అడిగితే ఉరికించి కొడుతున్నారని కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ మండిపడ్డారు. డిసెంబర్ 9 నుంచి ఉద్యోగ పర్వం కాదు.. ఉన్మాదపర్వం చూపిస్తున్నారని అన్నారు. నిరుద్యోగుల పట్ల దౌర్జన్య కాండ కొనసాగుతోందని తెలిపారు. రాహుల్ గాంధీకి నిరుద్యోగుల ఆక్రోశం కనబడటం లేదా అని నిలదీశారు. నిరుద్యోగ అభ్యర్థుల శోకాలు వినిపించడం లేదా అని ప్రశ్నించారు. సిటీ సెంట్రల్ లైబ్రరీలో దాడులు, ఓయూలో నిర్బంధాలు కనిపించడం లేదా అని అడిగారు. ఢిల్లీలో రాజ్యాంగం చేత పట్టుకుని రాహుల్ గాంధీ సుద్దపూస మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. హైదరాబాద్ నడిబొడ్డున ప్రజాస్వామ్యం ఖూనీ అవుతుంటే పట్టించుకునే వారే లేరని కేటీఆర్ మండిపడ్డారు. రాహుల్ గాంధీ ప్రధాని అయ్యే వరకు వదిలిపెట్టనని సీఎం రేవంత్ రెడ్డి అంటున్నాడని తెలిపారు. నవంబర్ 22న అవినీతి సొమ్ముతో జాబ్ క్యాలెండర్‌పై యాడ్‌లు వేశారని గుర్తుచేశారు. కానీ ఇవాళ జాబులు లేవు.. జవాబులు లేవని విమర్శించారు. ఉద్యోగాలు లేవు.. క్యాలెండర్ మారినా.. జాబ్ క్యాలెండర్‌కు దిక్కు లేదని అన్నారు. అసెంబ్లీలో ప్రకటించిన జాబ్ క్యాలెండర్ చిత్తు కాగితాలుగా మారిందని విమర్శించారు. చరిత్రను మరిచిపోతే భవిష్యత్ తరాలు క్షమించవని హెచ్చరించారు. చరిత్రలు, ఇతిహాసాలు, పురాణాలు చదవాలని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. తెలంగాణ ఉద్యమాల్లో చావగొట్టిన వాళ్లే మళ్లీ అధికారంలోకి వస్తారని తెలిపారు. కాంగ్రెస్ అలవిగాని హామీలు నమ్మి తెలంగాణ యువత మోసపోయింద్రు అని తెలిపారు. 1952, 1969లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ యువత గుండెల్లో గుణపాలు నింపిందని గుర్తుచేశారు. వేలమంది యువత ప్రాణాలు తీసుకున్నా కాంగ్రెస్‌కు రక్తదాహం తీరడం లేదని అన్నారు. మన రక్తం పొలాల మీద చల్లాలని చిల్లరమాటలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రైతు, యూత్, మహిళ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని తెలిపారు. ఓటు కోసం కోటి మోసాలు చేస్తున్న కాంగ్రెస్ తీరు దేశానికి తెలియాలన్నారు. రేపటి తెలంగాణ నిర్మాతలు మీరు.. భవిష్యత్ నిర్ణేతలు మీరే అని యువతను ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అలాంటి యువతను కాంగ్రెస్ సర్కార్ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. మీకు జరిగిన మోసం, వంచనను గుర్తుచేసుకుని కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. సరిగ్గా 38 నెలల కింద ఇదే సరూర్ నగర్ స్టేడియం సాక్షిగా తెలంగాణ యువత దగా పడిందని తెలిపారు. నిరుద్యోగులను వంచించిన దగాకోరులు కాంగ్రెస్ నాయకులు అని పేర్కొన్నారు. హైకమాండ్ తరలివచ్చి మాయామశ్చీంద్ర కార్యక్రమం ఇక్కడ చేశారని ఎద్దేవా చేశారు. యూత్ డిక్లరేషన్ పేరిట దుర్మార్గమైన వాగ్దానాల వరద పాటించారని మండిపడ్డారు. పాత కేటుగాళ్లు.. కొత్త డూప్లికేట్లు వచ్చి యువతపై లేని ప్రేమను కనబరిచారని తెలిపారు. యూత్‌కు ఇచ్చిన ఒక్క హామీ అయినా నెరవేర్చారా అని కేటీఆర్ ప్రశ్నించారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన రెండు లక్షల ఉద్యోగాలు ఇచ్చారా అని నిలదీశారు. ప్రైవేటు కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్ వచ్చిందా అని అడిగారు. కాలేజీ విద్యార్థినులకు స్కూటీలు వచ్చాయా? యువతకు రూ.10లక్షల రుణాలు వచ్చాయా? ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వచ్చాయా? అని ప్రశ్నించారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలు, మూడు యూనివర్సిటీలు వచ్చాయా? నెలకు రూ.4వేల భృతి వచ్చిందా? పదో తరగతిలో రూ.10వేలు, ఇంటర్ పాసైతే రూ.15వేలు వచ్చాయా? డిగ్రీ ఉత్తీర్ణులతై లక్ష వచ్చాయా? పీహెచ్‌డీ పాసైతే రూ.5లక్షలు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఇంత మోసానికి పాల్పడిన వారిని ఏమనాలో ఆలోచించాలని సూచించారు. దగుల్బాజీలా.. దోకేబాజ్‌లు అనాలో మీరే ఆలోచించాలన్నారు. జిత్తులమారి ముసలి నక్క కాంగ్రెస్ యువజనాన్ని తెలివిగా చిత్తు చేసిందని కేటీఆర్ విమర్శించారు. 60 ఏళ్లు నెత్తురు మరిగిన కాంగ్రెస్ యువతను ఎలా మోసం చేసిందో గుర్తించాలన్నారు. కాంగ్రెస్ మోసపు వలలో పడిపోయి గోసపడుతున్నారని తెలిపారు. 31 నెలలు గడిచాయి.. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఏం చేసిందని ప్రశ్నించారు. మాటతప్పి వంచించి, నమ్మించి నట్టేట ముంచి అధికారంలోకి వచ్చిందని కాంగ్రెస్‌పై మండిపడ్డారు. యువతరంతో పెట్టుకుంటే కొన్ని తరాలు పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

# 21న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణోత్సవం

## ఏర్పాట్లపై అధికారులతో తలసాని సమీక్ష


హైదరాబాద్,జూలై18 : ఈ నెల 21న నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం, 22న జరగనున్న రథోత్సవం సందర్భంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అధికారులను ఆదేశించారు. శనివారం బల్కంపేట ఎల్లమ్మ ఆలయం వద్ద వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఏర్పాట్లపై చర్చించారు. ఈ వేడుకలకు మన రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా లక్షలాది మంది భక్తులు తరలివస్తారని వెల్లడించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను చేపట్టాలని సూచించారు. ప్రజలు సంతోషంగా జరుపుకునే వేడుకకు ఆంక్షలు పెట్టి ఇబ్బందులు పెట్టొద్దని అధికారులకు స్పష్టం చేశారు. ఆలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రత్యేక అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని, నిరంతర పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. భక్తులు తోపులాటకు గురికాకుండా పటిష్టమైన బారికేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రథోత్సవం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయ పరిసరాలలో ప్రత్యేక హెల్త్ క్యాంప్ లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడి కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత బల్కంపేట ఎల్లమ్మ ఆలయాన్ని ఎంతో అభివృద్ధి చేశామని తెలిపారు. ఈ సమావేశంలో ఆలయ ఈవో వినోద్ రెడ్డి, డీసీ సుజాత, వాటర్ వర్క్స్ జీఎం సతీష్, ఎలక్ట్రికల్ డీఈ కిషోర్, ఆర్ అండ్ బి డీఈ మనోహర్, లా అండ్ ఆర్డర్ సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ జయంతి నాటికి చెత్తకు మోక్షం

ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేసుకోవాలని తెలిపారు. తడి చెత్తను కంపోస్ట్‌గా తయారు చేసుకోవాలని పేర్కొన్నారు. ఏపీలో అక్టోబర్ 2వ తేదీ నాటికి చెత్తలేకుండా చేస్తామని చెప్పారు. ఈ నెలలోనే తల్లికి వందనం కింద డబ్బులు వేస్తామని వెల్లడించారు. అంగన్ వాడీ కార్యకర్తలు, స్వచ్ఛాంధ్రప్రదేశ్‌లో పనిచేసే కార్మికులకు తల్లికి వందనం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. రౌడీయిజం చేస్తే ఎవరినీ వదిలిపెట్టనని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హెచ్చరించారు. అమృత్ 2.0 శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. స్వర్ణ పంచాయతీ ఉద్యోగులకు స్వచ్ఛ అవార్డులు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రసంగించారు. గొడ్డలి పార్టీతో పెద్ద సమస్య వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో కొందరు క్రిమినల్స్‌గా మారారని చెప్పుకొచ్చారు. మాజీ మంత్రి కొడుకు యాక్సిడెంట్ చేస్తే ఓ వ్యక్తి చనిపోయాడని తెలిపారు. పోస్టర్లు, కటౌట్‌లకు పొట్టేళ్లను బలి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ లక్ష్యం ప్రజలను దోపిడీ చేయడమేనని విమర్శించారు. తన జీవితంలో ఇలాంటి రాజకీయాలు చూడలేదని అన్నారు. ప్రజల జీవితాలతో ఆడుకుంటే తాము చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఇదిలావుంటే రాష్ట్రాభివృద్ధిలో మేము సైతం అంటూ కొందరు ఉదారతను చాటారు. గుడివాడలో జరిగిన స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబుకు తమ వంతు విరాళాలను అందించారు. అమరావతి కోసం గుడివాడకు చెందిన సాయిశ్వేత బంగారు గాజులు అందించారు. ఆమె కుమారుడు దాచుకున్న కిడ్డీ బ్యాంక్ నగదును కూడా అమరావతి అభివృద్ధికి వినియోగించాలని కోరారు. మరోవైపు గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం అన్నే నరసింహారావు, పుష్ప లీలావతి దంపతులు రూ.3 కోట్ల విరాళం ఇచ్చారు. గతంలోనూ వారు గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రికి రూ.3 కోట్లు విరాళం ఇచ్చారు.


# పర్యాటక రంగంలో పెట్టుబడులకు ఏపీ అత్యంత సురక్షితం

ఇతివృత్తంతో.. ఆంధ్రప్రదేశ్ మరియు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలపై ప్రత్యేక ఫోకస్‌తో జరిగిన సదస్సు లో మంత్రి దుర్గేష్ కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ, పర్యాటకరంగ సేవల్లో 30 ఏళ్లు పూర్తి చేసుకున్న ఎడిటిఓఐ సంస్థకు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 2,400 మందికి పైగా సభ్యులతో విస్తరించిన ఈ జాతీయ నెట్‌వర్క్, భారతీయ పర్యాటక రంగాన్ని ముందుకు నడిపించడంలో కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల దూరదృష్టితో కూడిన నాయకత్వంలో, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించామని, పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ పద్ధతిలో పెట్టుబడులను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. విశాఖపట్నం, అరకు లోయ, రాజమహేంద్రవరం, అమరావతి, శ్రీశైలం, గండికోట, తిరుపతిలను ఏడు ప్రధాన పర్యాటక హబ్‌లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆధ్యాత్మికం, తీరప్రాంతం (కోస్టల్), పర్యావరణం (ఎకో), బౌద్ధ వారసత్వం, గ్రామీణ సంస్కృతి కలగలసిన అరుదైన పర్యాటక అనుభూతి ఆంధ్రప్రదేశ్ సొంతమని పేర్కొన్నారు. తిరుపతి, శ్రీశైలం వంటి దివ్యక్షేత్రాలు నుండి అరకు లోయ అందాలు, గండికోట గ్రాండ్ క్యాన్యన్, బెలుం గుహల వరకు ఎన్నో అద్భుతాలు రాష్ట్రంలో ఉన్నాయన్నారు. పర్యాటక రంగం కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా గ్రామాలు, తీరప్రాంతాలు, గిరిజన ప్రాంతాల వరకు విస్తరించి మహిళలకు, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తుందని, స్థానిక వంటకాలు మరియు చేతివృత్తులకు ప్రాచుర్యం తెస్తుందని మంత్రి కందుల దుర్గేష్ నొక్కి చెప్పారు. అమరావతి, నాగార్జునకొండ, తొట్లకొండ, బొజ్జన్నకొండ వంటి బౌద్ధ వారసత్వ ప్రదేశాలతో పాటు విజయవాడ, శ్రీకాళహస్తి క్షేత్రాలు, కోనసీమ గ్రామీణ పర్యాటకాన్ని, మారేడుమిల్లి, కోరింగ వంటి పర్యావరణ పర్యాటక కేంద్రాల ప్రాధాన్యతను మంత్రి వివరించారు.ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక గుర్తింపు తెచ్చిన కలంకారీ కళలు, కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, ఉప్పాడ-ధర్మవరం చేనేత వస్త్రాలు మరియు అరకు కాఫీ వంటి విశిష్ట ఉత్పత్తులను టూరిజం ప్యాకేజీలలో భాగం చేయాలని కోరారు. పర్యాటకులు ఏపీని కేవలం చూడటమే కాదు... ఇక్కడి సంస్కృతిని అనుభవించేలా చేయాలన్నారు.పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసేలా, ఎక్కువ ఖర్చు పెట్టేలా సరికొత్త హోమ్‌స్టేలు, ఎకో-లాడ్జ్‌లు, కారవాన్ టూరిజం మరియు అడ్వెంచర్ టూరిజం వంటి మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఎడిటిఓఐ జాతీయ అధ్యక్షుడు వేద్ ఖన్నా, సంస్థ ముఖ్య ప్రతినిధులు, దేశంలోని వివిధ రాష్ట్రాల చాప్టర్ల ఛైర్మన్లు, పర్యాటక, హోటల్ రంగ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వారానికో బాతు గుడ్డు తినండి..!

## ఆరోగ్య ప్రయోజనాలు తెలిస్తే అస్సలు వదులుకోరు



బాతు గుడ్లు వివిధ ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటాయి. కోడి గుడ్లకు రుచికరమైన, పోషకమైన ప్రత్యామ్నాయం బాతుగుడ్లు. వాటిలో ప్రోటీన్, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అదనంగా బాతు గుడ్లు, కోడి గుడ్ల కంటే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాల సాంద్రతను కలిగి ఉంటాయి. ఇవి గుండె, మెదడుకు మేలు చేస్తాయి. బాతు గుడ్లు కొంతమందికి సులభంగా జీర్ణమవుతాయి. మీ ఆహారంలో బాతు గుడ్లను చేర్చుకోవడం వల్ల మీ మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను ఇక్కడ తెలుసుకుందాం.. కోడి గుడ్ల కంటే రెట్టింపు ప్రయోజనం బాతు గుడ్లు వల్ల



కలుగుతుంది. బాతు గుడ్లలో ప్రొటీన్లు, విటమిన్లు, విటమిన్ బి12, విటమిన్ డి, ఐరన్, సెలీనియం వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అంతే కాదు ఇందులో ఒమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా చాలా ఎక్కువ. మన గుండె, మెదడు, జ్ఞాపకశక్తికి ఈ ప్రయోజనాలన్నీ చాలా మంచివి. బాతు గుడ్లు అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేస్తాయి. ఇది బరువు నిర్వహణ, కండరాల పెరుగుదల, వ్యాయామం తర్వాత కోలుకోవడానికి సహాయపడుతుంది. బాతు గుడ్లు చాలా తేలికగా జీర్ణమవుతాయి. కోడి గుడ్ల కంటే బాతు గుడ్లు చాలా ప్రయోజనాలను కలిగి ఉన్నాయని, పరిమాణం పరంగా మరింత మెరుగ్గా ఉంటాయి. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. వారానికి ఒకసారి బాతు గుడ్డు మీ ఆహారంలో చేర్చుకోవడం మంచిది. యాంటీఆక్సిడెంట్ లక్షణాలు.. బాతు గుడ్లలో యాంటీఆక్సిడెంట్ చర్యలో గణనీయమైన పెరుగుదల గమనించబడింది. బాతు గుడ్లలో ఉండే కెరోటినాయిడ్స్, అమినో యాసిడ్స్ యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటుంది. క్యాన్సర్ నివారణకు బాతు గుడ్లను ముఖ్యమైన ఆహారంగా తీసుకోవచ్చు. కోడి గుడ్ల కంటే డీసాల్టెడ్ బాతు గుడ్డులోని తెల్లసొన మంచి కాల్షియం శోషణను కలిగి ఉంటుంది. బరువు నియంత్రణతో పాటు, బాతు గుడ్లు కండరాల ఆరోగ్యానికి, బలానికి సహాయపడతాయి. వ్యాయామం తర్వాత వారానికి ఒకసారి బాతు గుడ్లు తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. బాతు గుడ్లు కండరాల బలాన్ని పెంచుతుంది. కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి.

## ఎండు ద్రాక్ష నీరు ఇలా తాగారంటే.. కేవలం 10 రోజుల్లోనే ఆ సమస్యలన్నీ పరార్..!



ప్రస్తుత కాలంలో ఎంతో మంది ఎదుర్కొంటున్న సమస్యల్లో అధిక బరువు కూడా ఒకటి. అధిక బరువు కారణంగా చాలా మంది అనేక అనారోగ్య సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎన్నో రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. వ్యాయామం, వాకింగ్, హెల్దీ డైట్, జిమ్ ఇలా చాలానే ట్రై చేస్తున్నారు. అయితే కొన్ని రకాల సింపుల్ చిట్కాలతో కూడా వెయిట్ లాస్ అవ్వొచ్చని నిపుణులు చెబుతున్నారు. వెయిట్ లాస్ అయ్యేందుకు ఎండు ద్రాక్ష వాటర్ ఎంతగానో సహకరిస్తుంది. ప్రతిరోజూ ఎండు ద్రాక్ష నీరు తాగుతూ, మంచి డైట్ మెయిన్ టైన్ చేస్తూ.. వ్యాయామం చేస్తే మీకు కేవలం 10 రోజుల్లోనే రిజల్ట్ కనిపిస్తుంది. ఇలాంటి వాటర్ తాగడం వల్ల మీ బాడీ కూడా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉంటుంది. మరి ఇంకా ఎండు ద్రాక్ష నీటిని తీసుకుంటే ఎలాంటి లాభాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం. బాడీని డిటాక్సిఫికేషన్ చేస్తుంది: ఎండుద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరం డీటాక్సిఫై అవుతుంది. రోజు వారీ జీవితంలో మనకు తెలియకుండానే కాలుష్యం, తినే ఆహారం ఇలా రకరకాల కారణాల వల్ల శరీరంలో మలినాలు అనేవి చేరతాయి. కాబట్టి ఎండు ద్రాక్ష నీటిని తాగడం వల్ల శరీరంలో ఉండే మలినాలు బయటకు పోతాయి. శరీరం ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే శక్తి కూడా లభిస్తుంది. నిద్ర లేమి సమస్యలను దూరం చేస్తుంది: బరువు పెరిగేందుకు నిద్ర లేమి సమస్యలు కూడా ఒక కారణంగా ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. సరైన నిద్ర లేకపోతే.. తిన్నది అరగక.. పొట్టలో కొవ్వు అనేది నిల్వ ఉండిపోతుంది. అంతే కాకుండా గ్యాస్ అసిడిటీ సమస్యలు కూడా వస్తాయి. కాబట్టి మీరు ఎండు ద్రాక్ష నీటిని తాగితే నిద్ర లేమి సమస్యల్ని దూరం చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: ఎండు ద్రాక్ష నీటిలో పొటాషియం, మెగ్నీషియం వంటివి లభ్యమవుతాయి. ఇవి శరీరంలోని ద్రవాల స్థాయిల్ని కంట్రోల్‌లో ఉంచుతుంది. చెమట వల్ల కోల్పోయిన శక్తి ఈ నీళ్ల వల్ల తిరిగి వస్తుంది. నాడీ వ్యవస్థ పనితీరు, కండరాల తీరును సరి చేస్తుంది. గట్ హెల్త్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల గట్ హెల్త్ కూడా మెరుగు పడుతుంది. శరీరంలో నుంచి మలినాలన్నీ బయటకు పంపుతుంది. ఎండు ద్రాక్షలో ఉండే ఫైబర్ జీర్ణ శక్తిని, మలబద్ధకం వంటి సమస్యలు రాకుండా చేస్తుంది. వెయిట్ లాస్: ఎండు ద్రాక్ష నీరు తాగడం వల్ల తక్కువ రోజుల్లోనే బరువు తగ్గుతారు. ఎండు ద్రాక్ష నీటిలో ఫైబర్ కంటెంట్ మెండుగా ఉంటుంది. కాబట్టి ఈ నీటిని తీసుకుంటే కడుపు నిండిన భావన కలుగుతుంది. గోరు వెచ్చటి నీటిలో 3 లేదా 4 ఎండు ద్రాక్షను వేసి రాత్రంతా నానబెట్టాలి. ఉదయం లేవగానే ఆ నీటిని తాగి ఎండుద్రాక్ష తినాలి.

## క్యాన్సర్ భూతాన్ని పారదోలే అద్భుత ఫలం.. ఎక్కడ కనిపించినా వదిలిపెట్టకండీ!

ఆప్రికాట్ పండు చాలా రుచికరమైన పండు. యాంటీఆక్సిడెంట్లతో నిండిన ఈ పండులో పోషకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. రోగనిరోధక శక్తిని పెంచడంలో కీలకంగా వ్యవహరిస్తుంది. వీటిని రోజు వారీ ఆహారంలో క్రమం తప్పకుండా తింటే ఎన్నో ప్రయోజనాలు పొందుతారు. ఆప్రికాట్ పండును సూపర్ ఫుడ్ అని కూడా అంటారు. ఇందులో చాలా తక్కువ కేలరీలు ఉంటాయి. అయితే పోషకాలు మాత్రం పుష్కలంగా ఉంటాయి. ఆప్రికాట్ పండ్లలో బీటా కెరోటిన్, లుటిన్, పొటాషియం, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, జియాక్సంతిన్ అధికంగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్ పండ్లు కళ్లకు కూడా చాలా మేలు చేస్తాయని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఇందులో బీటా కెరోటిన్, విటమిన్ ఎ, జియాక్సంతిన్ ఉంటాయి. ఈ మూడు పదార్థాలు కళ్లకు ఎంతో మేలు చేస్తాయి. ఆప్రికాట్‌పండ్లు కంటిశుక్లం, రేచీకటి ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఆప్రికాట్ పండ్లలో వివిధ రకాల ఫైబర్ ఉంటుంది. కాబట్టి ఈ పండు తింటే జీర్ణం సులువుగా కడుపు క్లీన్ చేస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఈ పండు ఎంతగానో ఉపయోగపడుతుంది. బీటా-కెరోటిన్, లుటిన్, జియాక్సంతిన్, విటమిన్ ఎ, విటమిన్ సి, విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు వంటి పదార్థాలు శరీరంలోని యాంటీ-క్యాన్సర్ ఏజెంట్లుగా పనిచేస్తాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షిస్తాయి. ఆప్రికాట్ పండ్లు శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచుతాయి. ఆప్రికాట్ పండ్లలో అధికంగా పొటాషియం ఉంటుంది. కాబట్టి ఇది రక్తపోటును పెంచదు. ఆప్రికాట్ కూడా కాలేయం దెబ్బతినకుండా కాపాడుతుంది. ఈ పండు కాలేయ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఆప్రికాట్ పండ్లు శరీరంలోని ఎలక్ట్రోలైట్స్ తగ్గకుండా కాపాడుతాయి. అంటే మీరు ఎంత కష్టపడి పనిచేసినా శరీరం బలహీనపడకుండా ఉంటుంది.

## తమలపాకును నీళ్లలో మరిగించి తాగితే ఏమవుతుందో తెలుసా..? నమ్మలేని లాభాలు..





ఇందుకోసం ముందుగా పొయ్యి మీద ఒక పాత్ర పెట్టి, ఒక గ్లాసు నీళ్లు పోసి, ఒక తమలపాకును ముక్కలుగా కట్ చేసి అందులో వేయాలి. 5 నుంచి7 నిమిషాలు మరిగించి ఆ నీటిని వడకట్టి తాగాలి. మలబద్దకం సమస్య ఉన్నవారికి ఈ తమలపాకు నీరు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. పేగు కదలికలు బాగా జరిగేలా చేస్తుంది. శరీరంలో వాపులను తగ్గిస్తుంది. తమలపాకులో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ఉండటంవల్ల ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగిస్తుంది. అలాగే జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుండి ఉపశమనం కలిగిస్తుంది. మధుమేహం నియంత్రణలో కూడా తమలపాకు నీరు తోడ్పడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచటమే కాకుండా, మధుమేహం కారణంగా వచ్చే సమస్యలను కూడా తగ్గిస్తుంది. చెడు కొలెస్ట్రాల్, ట్రైగ్లిజరైడ్స్ స్థాయిలను కూడా తమలపాకు నీరు నియంత్రిస్తుంది. తద్వారా గుండె ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. తమలపాకులో యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండుటవల్ల ఆస్తమాను కూడా అదుపులో ఉంచుతుంది. అంతేగాక తమలపాకును మౌత్ ఫ్రెషనర్‌గా ఉపయోగిస్తున్నారు. ఇది నోటి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. తమలపాకు నోటిలో బ్యాక్టీరియా పెరుగుదలను నిరోధిస్తుంది. అయితే తమలపాకు నీటిని ఎప్పుపడితే అప్పుడు తాగడం కూడా మంచిదికాదు. రోజులో ఒకసారి మాత్రమే తీసుకోవాలి.

## వయసు పెరిగినా యవ్వనంగా కనిపించాలంటే.. ఈ పండ్లు తినండి! ఏంజెల్స్‌లా మెరిసిపోతారు

ప్రతి ఒక్కరూ ఎల్లప్పుడూ యవ్వనంగా, అందంగా కనిపించాలని కోరుకుంటారు. దీని కోసం అనేక రకాల చికిత్సలు కూడా తీసుకుంటూ ఉంటారు. బ్యూటీ పార్లర్లలలో రకరకాల చర్మ సంరక్షణ ఉత్పత్తులను వినియోగిస్తుంటారు. కానీ ప్రతీసారి ఆశించిన ఫలితాలు అందకపోవచ్చు. నిజానికి, చర్మం యవ్వనంగా కనిపించాలంటే కొన్ని ఆహారాలను డైట్‌లో చేర్చుకోవాలి. అలాగే చెడు జీవనశైలి కారణంగా కూడా చర్మ సంబంధిత సమస్యలు తలెత్తుతాయి. ఏది ఏమైనప్పటికీ, వేసవి కాలంలో సూర్యుని కిరణాల కారణంగా చర్మం దెబ్బతింటుంది. అటువంటి పరిస్థితిలో చర్మాన్ని జాగ్రత్తగా చూసుకోవడం చాలా ముఖ్యం. ఆహారపు అలవాట్లు సరిగా లేకపోవడం వల్ల అతి చిన్న వయసులోనే వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖంపై, ముడతలు, మచ్చలు కనిపించడం ప్రారంభిస్తాయి. చర్మం ఆరోగ్యంగా ఉండాలంటే ఏయే ఆహారాలు తీసుకోవాలో ఇక్కడ తెలుసుకుందాం.. బెర్రీ పండ్లు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు బెర్రీలలో పుష్కలంగా లభిస్తాయి. స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీస్, బ్లాక్బెర్రీస్ తినడం వల్ల చర్మం యవ్వనంగా ఉంటుంది. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మంలో వేగవంతమైన మార్పులను నెమ్మదించేలా చేస్తాయి. దీనితో పాటు బెర్రీలు ఆక్సీకరణ ఒత్తిడిని తొలగించడంలో కూడా సహాయపడతాయి. డ్రై ఫ్రూట్స్ బాదం, వాల్‌నట్, జీడిపప్పు, వాల్‌నట్, గుమ్మడికాయ గింజలు వంటి డ్రై ఫ్రూట్స్ చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. చర్మానికి మేలు చేసే డ్రై ఫ్రూట్స్ రోజూ తినడం వల్ల ఇందులో ఉండే విటమిన్-ఇ, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా చర్మానికి అందుతాయి. కొవ్వు చేప నాన్ వెజ్ ఫుడ్ ఇష్టపడే వారు చర్మాన్ని కాపాడుకోవడానికి ఫ్యాటీ ఫిష్ ను తమ డైట్ లో చేర్చుకోవచ్చు. చర్మంపై కనిపించే వృద్ధాప్య సంకేతాలను నివారించడంలో ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కొవ్వు



చేపలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని యవ్వనంగా ఉంచడంలో సహాయపడతాయి. వీటితోపాటు గ్రీన్ టీ ద్వారా కూడా చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు. గ్రీన్ టీని రెగ్యులర్ గా తీసుకోవడం వల్ల చర్మ కణాలు ఆరోగ్యంగా ఉంటాయి.

## అధిక రక్తపోటు ఎంత ప్రమాదమో తెలుసా? నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం తప్పదంటున్న నిపుణులు



హైపర్ టెన్షన్ కూడా ఓ విధమైన సైలెంట్ కిల్లర్. అధిక రక్తపోటు ప్రాణాలను నెమ్మదిగా హరిస్తుంది. మీకూ అధిక రక్తపోటు సమస్య ఉంటే ప్రతిరోజూ తప్పకుండా మెడిసిన్ తీసుకోవాలి. అధిక రక్తపోటు వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. అసలు అధిక రక్తపోటు ఎందుకు దాడి చేస్తుంది? ఈ సమస్యను ఎలా నియంత్రించవచ్చు వంటి వివరాలు నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. బిర్లా హార్ట్ హాస్పిటల్‌లోని కార్డియాలజీ విభాగం సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సబ్యసాచి పాల్ మాట్లాడుతూ.. రక్తపోటు వెనుక అనేక జీవనశైలి కారకాలను వివరించారు. వీటిలో వ్యాయామం నుంచి ఊబకాయం, ధూమపానం వరకు అనేక కారకాలు ఉన్నాయి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల రక్తపోటు అదుపులో ఉంటుందని డాక్టర్ సబ్యసాచి పాల్ అంటున్నారు. కానీ రోజువారీ ఏరోబిక్ వ్యాయామం రక్తపోటును పెంచుతుంది. ముఖ్యంగా రక్తపోటు అదుపులో లేని వారు, శరీర బరువు పెరిగినవారికి, ఊబకాయంతో బాధపడుతున్నవారికి గుండెపోటు ప్రమాదం పెరుగుతుంది. ఊబకాయం కారణంగా అబ్ట్రక్టివ్ స్లీప్ అప్నియా తరచుగా సంభవిస్తుంది. ఇది రక్తపోటు ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. ప్రిజర్వేటివ్స్, చక్కెర, ఉప్పుతో కూడిన ప్రాసెస్ చేసిన ఆహారాలు రక్తపోటుకు కారణమని డాక్టర్ సబ్యసాచి పాల్ చెబుతున్నారు. ఇందులో అధిక మొత్తంలో కేలరీలు, సోడియం ఉంటుంది. ఇవి అధిక రక్తపోటుతో పాటు కిడ్నీ సమస్యలు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతాయి. అధిక రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి ఫాస్ట్ ఫుడ్ మానుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. రక్తపోటు ప్రమాదాన్ని నివారించడానికి, ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలని డాక్టర్ పాల్ సూచిస్తున్నారు. జీవనశైలి కారకాలు మాత్రమేకాకుండా, రక్తపోటుకు మరొక కారకం కూడా ఉంది. అధిక రక్తపోటుకు ఒత్తిడి కూడా కారణం. ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం ద్వారా అధిక రక్తపోటును అదుపులో ఉంచుకోవచ్చు. మీరు హైపర్‌టెన్షన్ రోగి అయితే, ప్రతిరోజూ తప్పనిసరిగా మందులు వాడాల్సి ఉంటుంది. బిఎమ్ బిర్లా హార్ట్ హాస్పిటల్ కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ అంజన్ సియోటియా ఈ విషయాన్ని సూచిస్తున్నారు. చాలా మంది హైపర్ టెన్షన్ కు చికిత్స తీసుకోరని డాక్టర్ అంజన్ అంటున్నారు. సగం కంటే ఎక్కువ మందికి తమకు అధిక రక్తపోటు ఉందనే విషయమే తెలియదు. ఎందుకంటే వారు ఎప్పుడూ రక్తపోటును క్రమం తప్పకుండా టెస్ట్ చేయించుకోరు. అలాగే దీనిపై అవగాహన ఉన్న రోగులలో కూడా సగం మంది రోగులు రోజూ మందులు తీసుకోరు. ఈ కారణంగా మరణాల సంఖ్య పెరుగుతుంది. చికిత్స చేయకపోతే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. దీంతో పక్షవాతం, గుండెపోటు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి తరచుగా రక్తపోటు పరీక్షించుకోవాలి. అలాగే మందులు తీసుకోవాలని సిఫార్సు చేస్తున్నారు. ఇలాచేస్తే రక్తపోటును నియంత్రించడం సులభతరం అవుతుంది.

# సంపాదకీయం

## కాళేశ్వరం...ఆత్మరక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం !

దొంగలుపడ్డ ఆరు నెలలకు ...అన్న చందంగా ప్రభుత్వం ఏర్పడి మూడేళ్లు కావస్తున్న తరుణంలో ఇప్పుడు ధరణిపై విచారణకు ఓ కమిటీని వేయాలని రేవంత్ సర్కార్ తీసుకున్న నిర్ణయం నవ్వులు తెప్పించేదిగా ఉంది. కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతిపై పెద్దపెద్ద మాటలు మాట్లాడి అధికారంలోకి వచ్చిన రేవంత్ ఇప్పటి వరకు పైసా అవినీతిని నిరూపించ లేకపోయారు. కాళేశ్వరం, ధరణి, ఈ కార్ రేస్, పవర్ ప్లాంట్లు, విద్యుత్ ఒప్పందాలు తదితర అంశాలన్నీ ఇప్పుడు ప్రచార వస్తువుగా మారాయి. కేవలం బిఆర్ఎస్‌పై రాజకీయంగా పైచేయి సాధించేందుకు మాత్రమే విమర్శలు చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా కాళేశ్వరం కూలేశ్వరం అంటూ చేసిన ఆరోపణల్లో ఇంచు కూడా ముందుకు కదలలేదు. లక్షకోట్లు పెట్టిన ప్రాజెక్ట్ పడావు పడ్డది. దానిని ఎలాగైనా వినియోగంలోకి తేవడం ద్వారా ప్రజాధనాన్ని కాపాడాలన్న ముందుచూపు లేకుండా పోయింది. ఎంతసేపు రాజకీయంగా విమర్శలు తప్ప ఈ ప్రభుత్వం గత బిఆర్ఎస్ చేసిన అవినీతిపై ఎలాంటి పురోగతి సాధించలేదు. రేవంత్ రెడ్డి దీనిని కేవలం రాజకీయంగా ఉపయోగించు కుని బిఆర్ఎస్‌ను భ్రష్టు పట్టించే యోచనలో ఉన్నారా అన్న అనుమానాలు వస్తున్నాయి. ఎందుకంటే కాళేశ్వరాన్ని పక్కన పెట్టి ఇప్పుడు మళ్లీ ప్రాణహిత అంటూ పల్లవి అందుకున్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయడం, వినిగింలోకి ఎలా తేవడం అన్న ఆలోచన పక్కన పెట్టారు. అందుకే నిత్యం కాళేశ్వరం ప్రాజెక్టు వివాదం కొనసాగుతూనే ఉంది. రాజకీయ విమర్శలకు కాళేశ్వరం వేదికగా మారుతోంది. పరస్పర విమర్శలు తప్ప గోదావరి జలాలను ఎలా ఉపయోగించుకోవాలన్నది ఆలోచించడం లేదు. కాలేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల వ్యవహారం కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్లు, పరస్పర ప్రజెంటేషన్లకు కేంద్రంగా మారింది. ఎల్‌నినో ప్రభావంతో వానలు వెనక్కి పోయాయి. మరో వైపు కాళేశ్వరం నుంచి గోదావరి జలాలు తరలింపు అసాధ్యమని ప్రభుత్వం తేల్చి చెప్పింది. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని పూర్తి చేసినప్పటికీ మెడిగడ్డ వద్ద కొన్ని పిల్లర్లు కుంగడంతో ఇక అది పనికిరాదన్న రీతిలో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. మోటర్లు, కాలువలు అంతా వృధా అవుతున్నాయి. ఇదే విషయాన్ని బిజెపి ఎంపి ఈటెల రాజేందర్ ప్రస్తావిస్తే.. ఆయనను బిఆర్ఎస్ ఏజెంట్‌గా అభివర్ణించి విమర్శలతో దాడి చేశారు. నిజానికి గత 2023 శాసనసభ ఎన్నికలలో బీఆర్ఎస్ ఓటమిలో కాళేశ్వరం, ధరణి అక్రమాలు ప్రధాన భూమిక పోషించాయి. అధికారంలోకి రావడానికి అనేకానేక హామీలు, వాగ్దానాలు గుప్పించిన రేవంత్ సర్కార్ ఇప్పుడు గుడ్డెద్దు చేలో పడ్డదన్నట్లుగా సాగుతున్నారు. పదికాలాలపాటు పనికి వచ్చే పనులు చేయడం లేదు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎలాంటి విధానం అనుసరిం చాలన్న దానిమీద సరైన అవగాహన లేకుండా వ్యవహరిస్తున్నారు. కాళేశ్వరం పిల్లర్లను పునరుద్ధరించే ప్రయత్నాలు చేసి, నీటిని వినియోగంలోకి తీసుకుని వచ్చివుంటే, ఈయేడు మంచి ఫలితాలు వచ్చేవి. ప్రభుత్వానికి మంచిపేరు వచ్చేది. కానీ కాళేశ్వరం ప్రాజెక్టను ఉపయోగించరాదన్న మొండి వైఖరితో రేవంత్ ఉన్నట్లుగా కనిపిస్తోంది. ఆ ప్రాజెక్టు భద్రత ప్రమాదంలో ఉందని నేషనల్ డామ్ సేఫ్టి అథారిటి చెప్పిందని, అందువల్ల అక్కడ నీటిని వినియోగంలోకి తసీఉకుని రావడం అసాధ్యమని చెబుతున్నారు. కాళేశ్వరం ఎటిఎంగా మారిందని గతంలో బిజెపి కూడా ఆరోపించింది. రేవంత్ రెడ్డి కూడా ఇదే ప ÷–రచారం చేశారు. పోనీ అలాగని ఇందులో జరిగిన అవినీతిని వెలికితీసి కెసిఆర్ తదితరులను దోషులుగా నిలబెట్టి ఉంటే రేవంత్ ఇమేజ్ పెరిగేది. కానీ ఆరోపణలతోనే రెండున్నరేళ్లుగా కాలయాపన చేస్తున్నారు. కాళేశ్వరం కమిషన్‌ను కూడా ఏర్పాటు చేశారు. జస్టిస్ పిసి ఘోష్ కమిటీ రిపోర్టుపై హైకోర్టు స్టే విధించింది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, అప్పటి ఇరిగేషన్ మంత్రి హరీష్ రావులను అరెస్టు చేస్తారేమో అన్నంతగా ప్రచారం జరిగింది. అంతా తుస్సుమంది. ఇప్పుడు కమిషన్ రిపోర్టుకు కూడా పెద్ద విలువ లేకుండా పోయిందా అన్న అనుమానాలు వస్తున్నాయి. ప్రస్తుతం కాళేశ్వరం ప్రాజెక్టు బారేజీలైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద నీరు నిల్వచేసి పంప్‌హౌస్‌ల ద్వారా నీటిని తోడి ఆయా ప్రాంతాలలో ఉన్న రిజర్వాయిర్‌లను నింపాలని బిఆర్ఎస్ డిమాండ్ చేస్తోంది. ఇందుకు రేవంత్ ససేమిరా అనడంతో చంద్రబాబు కోసం గోదావరి జలాలను కిందికి జారవిడుస్తున్నారని బిఆర్ఎస్ నేతలు ఆరోపిస్తున్నారు. ఒక వైపు వర్షాభావ పరిస్థితులతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అందువల్ల వర్షాలు తక్కువగా ఉన్న ప్రాంతాలకు నీరు ఎలా ఇవ్వవచ్చా అన్నదానిపై ఆలోచన చేసి ఉండాల్సింది. కేసీఆర్ కట్టించినంత మాత్రాన ఆ ప్రాజెక్టు కెసిఆర్‌ది అయిపోదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇప్పుడు రాజకీయంగా రేవంత్‌ను ఏకిపారేయడంలో బిఆరెస్ మెల్లగా పైచేయి సాధిస్తోంది. మంత్రులు అవినీతిలో కూరుకు పోయారని కెటిఆర్, హరీష్ రావులు రోజూ విమర్శలు చేస్తున్నారు. కమీషన్లు లేనిదే మంత్రులు కాలు బయటపెట్టడం లేదని అంటున్నారు. ఈ ఎదురుదాడితో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఓ రకంగా ఆత్మరక్షణలో పడిపోయింది. సింగరేణి తదితర విషయాల్లో గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లు అయ్యింది. ఈ క్రమంలోనే వాదోపవాదాలు, విమర్శ, ప్రతి విమర్శలతో రాజకీయ వేడెక్కింది. అవినీతి అంటూ ఆరోపించిన రేవంత్ నిరూపించలేదు. దీనికి బదులుగా కేటీఆర్, హరీష్‌రావులే గట్టిగా బదులు ఇస్తున్నారు. దీనివల్ల కూడా రేవంత్ అసహనానికి గురి అవుతున్నారనిపిస్తోంది. ఒక వేళ నిజంగానే గోదావరి నీటిని లిఫ్ట్ చేయడంలో ఇబ్బంది ఉంటే, ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై అఖిలపక్షం నిర్వహించి చర్చ చేయాలి. బారేజీల వద్దకు, పంప్ హౌస్‌ల వద్దకు రిటైర్డ్ ఇంజనీర్లను తీసుకునివెళ్లి ఇరిగేషన్ అధికారుల ద్వారా పరిస్థితిని వివరించాలి. కానీ ఇవేవీ చేయకపోవడంతో ఇప్పుడు కాళేశ్వరమే బిఆర్ఎస్‌కు ఆక్సిజన్ నింపుతోంది.

## ఇరాన్‌కు అణ్వస్త్రం ఎందుకొద్దు?



అణుశక్తి పరిశోధనలు మొదలుపెట్టిన లిబియా, ఇరాక్‌ల పరిశోధనలు పూర్తయి ఆయుధాల ఉత్పత్తి జరిగి ఉన్నట్లయితే అక్కడ అమెరికన్ దాడులు జరిగేవి కావని, ప్రస్తుతం వెనిజులాపై దాడి చేసి క్యూబాను బెదరించగ లగటానికి కారణం అదేనన్న అభిప్రాయాలు కూడా వెలువడుతున్నాయి. గమనించదగిన విశేషం ఏమంటే, ఇట్లా అభిప్రాయపడుతున్న వారిలో అమెరికాతోపాటు యూరోపియన్ దేశాల వ్యాఖ్యతలు సైతం ఉన్నారు. ఐక్యరా జ్యసమితి నిరుపయోగంగా మారి, ట్రంప్, నెతన్యాహు వంటి వికృత ధోరణులవారు రాజ్యాల నేలుతున్నపుడు అంతకన్న గత్యంతరమేమిటన్నది వారి ప్రశ్న. ఇరాన్‌పై అమెరికా తిరిగి దాడులు మొదలుపెట్టి, 60 రోజుల యుద్ధం కోసం కాంగ్రెస్ అనుమతిని కోరిన వేళ, ఇరాన్‌కు అణ్వస్త్రాలు ఎందుకు వద్దనే ప్రశ్న తిరిగి ముందుకు వస్తున్నది. ఈ ప్రశ్న లోగడ కూడా ఉండినప్పటికీ, ఇరుపక్షాల మధ్య చర్చలు సంతృప్తికరంగా సాగుతుండగానే ఆ మధ్యలో అమెరికా, ఇజ్రాయెల్ కలిసి ఫిబ్రవరి 28న ఆకస్మిక దాడులతో ఇరాన్ అధినేత ఖమేనిని కుటుంబంతో సహా హత్య చేయటంతో మళ్లీ చర్చలోకి వచ్చింది. యుద్ధం కొన్నాళ్లు జరిగిన వెనుక జూన్ 17న 14 అంశాలతో కాల్పుల విరమణ ఒప్పందం చేసుకున్నారు. ఆ అంశాలు కొన్ని వెంటనే అమలుకు వచ్చి, తక్కిన వాటిపై రెండవ దశలో చర్చలు జరగవలసి ఉండగా, అమెరికా ఎప్పటి వలెనే తన ఎత్తుగడలు మొదలు పెట్టి, తొలి దశలోనే ఇరాన్‌ను దెబ్బతీసే చర్యలు ప్రారంభించింది. ఆ చర్యలను ఇరాన్ ప్రతిఘటిస్తుండటంతో, అమెరికా అధ్యక్షుడు కాంగ్రెస్ నుంచి పైన చెప్పిన అనుమతిని కోరారు. పునర్విభజనపై తగని తొందర ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయన్నది ఎవరూ చెప్పలేరు గాని, దీనినంతా గమనించిన మీదట, ఇరాన్‌కు ఆత్మరక్షణ కోసం అణ్వస్త్రాలు ఎందుకు వద్దనే విషయం చర్చించవలసి వస్తున్నది. ఈ చర్చల ఇటీవల తలెత్తినప్పటినుంచి పలువురు ఉత్తర కొరియాను ఉదాహరిస్తున్నారు. అది ఒక చిన్న దేశం. ఆర్థికంగా బలమైనది కాదు. దానిపై మొత్తం అమెరికన్ శిబిరం కత్తి కట్టింది. అయినా ఆ దేశంపై దండెత్తటం మాట అట్లుంచి ఒక్క తుపాకీ గుండునైనా పేల్చలేకపోతున్నది. ఎందుకు? ఉత్తర కొరియాకు రష్యా, చైనాల మద్దతు ఉండటం నిజమే. అయినప్పటికీ వారు ఏదైనా జరిగితే ఆయుధ సహాయం చేయగలరు తప్ప, స్వయంగా యుద్ధంలో పాల్గొంటారనే హామీ లేదు. అటువంటి స్థితిలో ఉత్తర కొరియాను కాపాడుతున్నది. అణ్వస్త్రాలు మాత్రమే. అమెరికన్ శిబిరం ఏదైనా చేసినట్లయితే ఉత్తర కొరియా నేరుగా అమెరికన్ భూభాగంపైకి ఎదురుదాడి చేయలేదు. అటువంటి దీర్ఘ శ్రేణి క్షిపణులపై ఇప్పుడిప్పుడే ప్రయోగాలు జరుగుతున్నాయి. అయితే, తమకు సమీపంలోనే గల అమెరికా కూటమి దేశాలు జపాన్, ఫిలిఫ్ఫీన్స్‌లను ధ్వంసం చేయగలదు. దక్షిణకొరియా కూడా పొరుగునే గల అమెరికన్ కూటమి దేశం అయినప్పటికీ అక్కడి కొరియన్ ప్రజలు తమ జాతి సోదరులే అయినందున వారికి హాని చేయరాదన్నది విధానం. నిజానికి అక్కడి ప్రజలలోనూ అటువంటి సోదర భావనలే ఉన్నాయన్నది అపుడపుడు సర్వేలు చెప్పేమాట. మరొక వైపు చూసినపుడు ఇది ఇరాన్ వంటి పరిస్థితే. వారు అమెరికా భూభాగంపైకి ఎదురుదాడి చేయలేరు. కాని, గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా మిత్ర దేశాలపై, అక్కడి అమెరికన్ స్థావరాలపై దాడులు చేయగలరు. అదే జరుగుతున్నది. ఆ విధమైన దాడుల వత్తిడితోనే అమెరికా అధ్యక్షుడు కాల్పుల విరమణలు చేస్తూ ఇరాన్ నాయకత్వంతో చర్చలకు రాజీ పడుతున్నారు. ఆసక్తికరమైనది ఒకటున్నది. ఇథనాల్ వాడకంపై గందరగోళం ట్రంప్ కూడా తన మొదటి అధ్యక్ష పదవీకాలంలో ఒకసారి (2018), ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌తో సింగపూర్‌లో శాంతి చర్చలు జరిపారు. అటువంటి చర్చలు మరొకమారు జరగవచ్చునని ట్రంప్ రెండవ హయాంలో వినవస్తున్నది. అందుకు కిమ్ సుముఖంగా ఉన్నట్లు వింటున్నాము. ఇంతకూ దీనంతటి రహస్యం ఉత్తర కొరియా అణ్వస్త్ర శక్తిలో ఉన్నదని వేరే చెప్పనక్కర లేదు. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్ వంటివి ఆగ్నేయాసియా దేశాలపై వరుస యుద్ధాలు సాగిస్తుండిన కాలంలో, కొరియాలోనూ జోక్యం చేసుకున్న అమెరికా, వారిని జయించలేక వెనుదిరిగింది. ఆ 1950 నాటి యుద్ధం తర్వాత ఉత్తర, దక్షిణ కొరియాలు వేరుపడ్డాయి. అయినప్పటికీ ఉపసంహచించుకోని అమెరికన్లు దక్షిణ కొరియాలో సైనిక స్థావరాలు నెలకొల్పుతుండగా, 2006 వచ్చే సరికి ఉత్తర కొరియా అణ్వస్త్ర పరీక్షలు నిర్వహించింది. అప్పటి నుంచి గత 20 సంవత్సరాలగా అమెరికన్లు అటు కన్నెత్తి చూస్తే సాహసం చేయలేకపోయారు. ఉత్తర కొరియా ఉదాహరణ వెనుక ఇంత కథ ఉన్నది. ఇరాన్‌తో పోల్చి చెప్పాలంటే మరొక ఆసక్తికర విషయం కూడా ఉంది. అణువ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి)పై ఇరాన్ 1968లో సంతకాలు చేయగా, ఉత్తర కొరియా 1985లో చేసింది. కాని, తమ రక్షణకు తప్పనిసరి అని భావించటంతో 2003లో ఉపసంహరించుకుని 2006లో అణ్వస్త్ర పరీక్ష జరిపింది. ఇపుడు వారి వద్ద సుమారు 90 అణ్వస్త్రాలు ఉన్నట్లు అంచనా. అవి ఉండగానే చాలదు. వాటిని వీలైనంత దూరం మోసుకుపోగల క్షిపణుల అవసరం. వాటిని తయారు చేసే పనిలో ఉన్నారు వారు! తమకు తూర్పున గల పసిఫిక్ మహా సముద్రంలో ఎక్కడికైనా ప్రయాణించ గల క్షిపణులు తమ వద్ద ఉన్నాయని, నేరుగా అమెరికాపై కూడా దాడి చేయగలమని వారు కొద్ది నెలల క్రితం ప్రకటించారు కూడా. అది ఎంత వరకు నిజమన్న ధ్రువీకరణ అయితే లేదు గాని, వారి ఆత్మరక్షణ విధానాలేమిటన్నది దానిని బట్టి గ్రహించవచ్చు. అందుకే ఇరాన్ యుద్ధ సందర్భంగా ఉత్తర కొరియా ప్రస్తావనలు తరచు వస్తున్నాయి. అంతేకాదు. అణుశక్తి పరిశోధనలు మొదలుపెట్టిన లిబియా, ఇరాక్‌ల పరిశోధనలు పూర్తయి ఆయుధాల ఉత్పత్తి జరిగి ఉన్నట్లయితే అక్కడ అమెరికన్ దాడులు జరిగేవి కావని, ప్రస్తుతం వెనిజులాపై దాడి చేసి క్యూబాను బెదరించగలగటానికి కారణం అదేనన్న అభిప్రాయాలు కూడా వెలువడుతున్నాయి. ఇట్లా అభిప్రాయపడుతున్న వారిలో అమెరికాతోపాటు యూరోపియన్ దేశాల వ్యాఖ్యతలు సైతం ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నిరుపయోగంగా మారి, ట్రంప్, నెతన్యాహు వంటి వికృత ధోరణులవారు రాజ్యాల నేలుతున్నపుడు అంతకన్న గత్యంతరమేమిటన్నది వారి ప్రశ్న. పైగా 1945లో జపాన్ పై అణ్వస్త్ర దాడి తర్వాత అమెరికా ఆ పని మళ్లీ ఎపుడూ చేయలేదుగాని, వియత్నాం, అఫ్ఘానిస్థాన్ వంటి దేశాలను బెదిరించింది. ఇరాన్ విషయంలోనూ నర్మగర్భమైన హెచ్చరికలు చేస్తున్నది. ఇజ్రాయెల్ గురించి అయితే చెప్పనక్కరలేదు. ఫ్రాన్స్, అమెరికా రహస్య సహకారంతో 1950 లలోనే అణ్వస్త్రాలు తయారు చేసిన ఆ దేశం వద్ద ఇపుడు 90 వరకు ఆయుధాలున్నట్లు అంచనా. ఇజ్రాయెల్ ఎన్‌పిటిపై సంతకమూ చేయలేదు.

## తుంగభద్ర పరివాహక రాష్ట్రాలతో భేటీ

**27 హైదవర్ కమిటీ తొలి సమావేశం**

**నీటి సమస్యలపై చర్చించనున్న కమిటీ**

అమరావతి,జూలై18 : తుంగభద్ర పరీవాహక ప్రాంతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్ర అధ్యయనం కోసం కేంద్రం ప్రభుత్వం నియమించిన హైపవర్ కమిటీ తొలిసారిగా ఈనెల 27న ఢిల్లీలో కేంద్ర జలసంఘం కార్యాలయంలో సమావేశం కానుంది. సీడబ్ల్యూసీ సభ్యుడుయోగేష్ పైథంకర్ అధ్యక్షతన ఏపీ ఈఎన్‌సీ కె.నరసింహమూర్తి, కర్ణాటక జలవనరుల శాఖ కార్యదర్శి బీఎస్ శివశంకర్, తెలంగాణ ఈఎన్‌సీ ఓవీ రమేష్ బాబు, సీడబ్ల్యూసీ సీఈలు అభిషేక్ బెనర్జీ, సంజయ్ గంగ్వార్, శరబ్‌జీత్‌సింగ్ భక్షీ, ఓంప్రకాష్ గుప్తా సభ్యులుగా ఉన్న ఈ కమిటీకి తుంగభద్ర బోర్డు కార్యదర్శి ఆస్మా ఖాతూన్ సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. గత నెల 25న తుంగభద్ర డ్యామ్ కొత్త గేట్లు ప్రారంభ కార్యక్రమానికి కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తోపాటు ఏపీ, తెలంగాణ, కర్ణాటక సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, డీకే శివకుమార్ హాజరై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తుంగభద్ర జలాల వినియోగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. వాటిపై సమగ్రంగా అధ్యయనం చేసి బచావత్ ట్రిబ్యునల్ అవార్డుకు లోబడి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక ఇచ్చేందుకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తామని కేంద్ర జల్ శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ప్రకటించారు. ఆ మేరకు హైపవర్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఈనెల 11న కేంద్ర జల్ శక్తి శాఖ జాయింట్ కమిషనర్ సంజయ్‌కుమార్‌సింగ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏడు అంశాలపై అధ్యయనం చేసి ఆర్నెల్లలోగా నివేదిక ఇవ్వాలని ఆ కమిటీని నిర్దేశిరచారు. తుంగభద్ర హైపవర్ కమిటీ అధ్యయనం చేసే అంశాలివీ.. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) కింద చారిత్రక వినివియోగం, నీటి అవసరాలు, నిర్వహణలో ఇబ్బందులు, ప్రస్తుత పరిస్థితిపై అధ్యయనం చేస్తారు. తుంగభద్ర డ్యాంలో ఏ మేరకు పూడిక చేరింది..? దాని వల్ల నీటి నిల్వ సామర్థ్యం ఎంత తవిగ్గింది..? సాగు, తాగునీటి అవసరాలు, జలవిద్యుదుత్పత్తిపై ఏ మేరకు ప్రభావం పడుతోంది..? డ్యామ్ భద్రత, వరద నియంత్రణ చర్యలపై సూచనలు చేస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడిక తీతకు సంబంధించి సాంకేతిక, ఆర్థిక అంశాలను పరిశీలించి లాభదాయక మార్గాలను సూచించడం. ఇకపై రిజర్వాయర్‌లో పూడిక చేరకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు. ?ఆర్డీఎస్‌కు నీటి లభ్యవిత భరోసా కల్పించవిచేందుకు తుంగభద్ర డ్యావిమ్ దిగువన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించాల్సిన అవసరంతోపాటు ట్రిబ్యునల్ అవార్డులు, ఒప్పందాలు, న్యాయపరమైన ఆమోదంపై అధ్యయనం వంటివి పరిశీలిస్తారు. తుంగభద్ర డ్యామ్‌లో పూడికతీత వల్ల ప్రయోజనం ఉంటుందా? సమాంతరంగా బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మించడం వల్ల మేలు జరుగుతుందా? లాంటి అంశాలపై సాంకేతిక, ఆర్థిక సాధ్యాసాధ్యాల పరిశీలన. అంతర్రాష్ట్ర అంశాలు, సామాజిక, పర్యావరణ, న్యాయపరమైన చిక్కులపై అధ్యయనం.

## బుల్లెట్ ట్రైన్ కోసం భూ సేకరణ

**బహద్దూర్ గూడ వద్ద తీవ్ర ఉద్రిక్తత**

**అధికారుల తీరుపై రైతుల మండిపాటు**


**భూముల జోలికి వస్తే ఊరుకోబోమని హెచ్చరిక**

**ఐదురోజులుగా కొనసాగుతున్న ఆందోళన**

రంగారెడ్డి,జూలై18 : శంషాబాద్ బహదూర్ గూడలో ఉద్రిక్తత నెలకొంది. బుల్లెట్ ట్రైన్ కోసం భూములు ఇచ్చేందుకు రైతులు నిరాకరిస్తున్నారు. బహదూర్ గూడా భూముల దగ్గరకు హైడ్రా అధికారులు భారీగా చేరుకున్నారు. భూముల వ్యవహారంలో ఐదు రోజులుగా రైతుల ఆందోళన కొనసాగుతోంది. స్పష్టమైన హామీ ఇచ్చాకే భూములు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో.. బహదూర్‌గూడ భూముల జోలికొస్తే ఖబర్దార్ అంటూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి హెచ్చరించారు. హైడ్రా కానీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల కోసం పనిచేస్తుందని అనుకున్నాం. కానీ మీరు బ్లాక్ మెయిలర్‌లు ప్రజలను భయపెట్టడానికి వచ్చిన హైడ్రా అంటూ విరుచుకుపడ్డారు. బహదూర్‌గూడా భూములపై స్టాటస్‌కో ఉంది కాబట్టి జిల్లా కలెక్టర్ కోర్టు అనుమతి లేకుండా భూముల జోలికి వస్తే ఊరుకునేది లేదని ప్రజాక్షేత్రంలో నిలబెడతామని అన్నారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో చేపట్టిన రైతు నిరసన ఐదో రోజుకు చేరింది. రైతులకు ఈరోజు మద్దతుగా బీఆర్ఎస్ పార్టీ రాజేందర్ నగర్ ఇంచార్జ్ పట్ల కార్తీక్ రెడ్డి నిలబడ్డారు. బహదూర్ గూడ లోని వ్యవసాయ పొలాలని తరతరాలుగా సాగు చేసుకుంటూ వస్తున్న ప్రజలకు బులెట్ ట్రైన్ పేరుతో లాక్కోవాలని చూస్తుంది.

## సతులి విజ్ఞత గృహపతు అజ్ఞత

శ్రీశుక ఉవాచ– రాజేంద్రా! రామకృష్ణులు గోపకులతో కూడి బృందావన ధామానికి దూరంలో గోవులను మేపుతున్నారు. అది మండు వేసవి. చండ కిరణుని ఎండ తాపం భరించలేక దండి చెడి– బడలిపోయి గోప కుమారులు తరుల దండ– వృక్ష సమూహాలను అండగా గైకొన్నారు. గొడుగుల వలె నీడలు ఇస్తున్న ఆ చెట్లను చూచి కడు వేడుక పడి గోప బాలకులు శ్రీకృష్ణ బలరామాదులతో ఇలా నుడివారు.. ‘మిత్రులారా! ఈ ద్రుమానులను చూడండి. ఎవ్వరికీ ఎలాంటి హాని కలిగించవు. ఒకరి జోలి– జోక్యం లేకుండా, కాని పనులకు పోకుండా ఏకాంతంగా ఉంటాయి. ఎండ వాన చలిగాలి మంచుల బారి నుండి ఆశ్రయించిన వారిని రక్షిస్తాయి. కోరువారికి భూరిగా– జోరుగా తమ పట్టలు– బెరళ్లు, గంధం, జిగురు, భస్మం, చిగురుటాకులు, తేనెలు, వేళ్లు, పూలు, పండ్లు సమంచితంగా పంచి ఇచ్చి ఎంతగానో మేలుచేస్తాయి.’ ఇలా చెప్పుకొంటూ బాలలందరూ తిన్నగా కాళిందీ తీరానికి చేరుకున్నారు. అందులో ఉన్న పెద్ద మడుగులో మెల్లగా పశువులకు చల్లని నీరు తాగించి, ఆ దగ్గరలోనే వాటికి కసవు మేపుతూ ‘అన్నా! ఆకలి వేస్తోంద’ని కన్నయ్యకు విన్నవించారు. తన భక్తురాండ్రగు ముని భార్యలను కనికరింపదలచి వనమాలి మాధవుడు ఆ యాదవ బాలురతో%ౌ% ‘వల్లవ కుమారులారా! ఈ వనంలో వేదవేత్తలైన విప్రులు స్వర్గలోక ప్రాప్తికై ఘనంగా ఆంగిరసమనే జన్నం– యజ్ఞం చేస్తున్నారు. వారి చెంతకు వెళ్లి నేను అడిగానని ఇంత అన్నం అర్థించి తెండి’ అని అన్నాడు. శుకముని ఔత్తరేయునితో– అవనీపతీ! గొల్లపిల్లలు గ్రద్దన– వేగంగా యాగశాల వద్దకు వచ్చారు. గగనం దద్దరిల్లే విధంగా నిగమ– వేదధ్వని వినిపిస్తోంది. జన్నపు పెద్దలను కని మ్రొక్కి పిన్నలు%ౌ% ‘అవనీ సురు(బ్రాహ్మణు)లారా! ఓ మహనీయులారా! బలరామకృష్ణులు వని– అడవిలో పసువులను మేపుతూ అలసి ఆగొన్నారు. దయచేసి అన్నం పెట్టండి’ అని అర్థించారు.



ఆధ్యాత్మికం

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ పథకాల అమలులో అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ● పెండింగ్ సంక్షేమ నిధుల పూర్తి వివరాలను వెంటనే సమర్పించాలి ● గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా ఉండరాదు ● ఐడీఓసీలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్







**పెద్దపల్లి ప్రతినిధి :** ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, డీసీపీ రాంరెడ్డి, అదనపు కలెక్టర్లు బి. శ్రీరాములు,జె. అరుణ శ్రీ లతో కలిసి జిల్లా అధికారులతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులు తమ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. అలాగే గురుకులాలు, సంక్షేమ, గిరిజన రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ పాఠశాలల నిర్వహణ, మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మాట్లాడుతూ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో మాట్లాడి ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారానికి సంబంధించిన 50 శాతం నిధులను విడుదల చేయించినట్లు తెలిపారు. బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, ఓవర్సీస్ విద్యా పథకం, ఎస్సీ, ఎస్టీ బాధితుల పరిహారం, గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పెండింగ్ నిధులు ఎంత ఉన్నాయో పూర్తి వివరాలను వెంటనే కమిషన్‌కు సమర్పించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ నెలాఖరులో ముఖ్యమంత్రితో సమావేశం నిర్వహించనున్నందున, పెండింగ్‌లో ఉన్న అన్ని నిధుల విడుదల అంశాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లి, మిగిలిన నిధులన్నింటినీ విడుదల చేయించేందుకు కృషి చేస్తామని తెలిపారు. జిల్లాలోని గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు (కేజీబీవీలు), మోడల్ పాఠశాలల్లో ఒక్క సీటు కూడా ఖాళీగా లేకుండా పూర్తి విద్యార్థి సామర్థ్యంతో నిర్వహించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ఉపాధి కల్పనలో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని, ఉపాధి కల్పన కార్యాలయం, వారధి సొసైటీ ద్వారా ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసే అన్ని ఉద్యోగాల్లో ఎస్సీ, ఎస్టీలకు అమలులో ఉన్న రిజర్వేషన్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. రిజర్వేషన్ విధానాన్ని పారదర్శకంగా అమలు చేసి, అర్హులైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని శాఖలు చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం కింద ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసి, నిబంధనల ప్రకారం సత్వర విచారణ నిర్వహించి ఛార్జిషీట్ దాఖలు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. నిజమైన బాధితులకు చట్టబద్ధంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, సంక్షేమ పథకాల అమలులో జాప్యం లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, జిల్లాలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. కమిషన్ సూచించిన మేరకు పెండింగ్ నిధులకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి నిర్ణీత సమయంలో కమిషన్‌కు సమర్పిస్తామని తెలిపారు. విద్య, ఉపాధి, సంక్షేమం, జీవనోపాధి, గురుకుల విద్యాసంస్థల బలోపేతం, ఎస్సీ, ఎస్టీ వర్గాల సమగ్ర అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కట్టుబడి పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు, కుస్రం నీలాదేవి, రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, రేణికుంట ప్రవీణ్, ఆర్డీవోలు, బి.గంగయ్య, సురేష్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రవీందర్, ఏసిపి రమేష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల భాగస్వామ్యంతోనే విద్యార్థుల ప్రగతి

● తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష





**పెద్దపల్లి ప్రతినిధి :** విద్యార్థుల విద్యా ప్రగతిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం అత్యంత కీలకమని, తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ప్రతిభ కనబరుస్తారని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. శనివారం పెద్దపల్లి మండలంలోని తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని పాఠశాలలో చేపడుతున్న మౌలిక వసతుల అభివృద్ధి, విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపు, తల్లిదండ్రుల బాధ్యతలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తుర్కల మద్దికుంట ఎంపీపీ ఎస్ పాఠశాలలో ప్రహరీ గోడ నిర్మాణం పూర్తయిందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతుల పనులన్నింటినీ రానున్న ఆరు నెలల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాలను పెంచడంపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ లక్ష్యం సాధించడంలో తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని, ప్రతి తల్లిదండ్రులు తప్పనిసరిగా పేరెంట్--టీచర్ సమావేశాలకు హాజరై తమ పిల్లల చదువు, ప్రగతి గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులు చూడాలని కలెక్టర్ తెలిపారు. ఏదైనా కారణంతో కొద్ది రోజులు పాఠశాలకు రాలేకపోతే వెంటనే ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని, తద్వారా వారు మిస్సైన పాఠాలను ప్రత్యేకంగా బోధించే అవకాశం ఉంటుందని అన్నారు. ప్రతి రోజు పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కొంత సమయం పిల్లలతో గడపాలని, పాఠశాలలో ఏమి నేర్చుకున్నారో, హోంవర్క్ ఇచ్చారా అని అడిగి తెలుసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ హోంవర్క్ పూర్తి చేసేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కోరారు. తల్లిదండ్రులు ఎప్పుడైనా పాఠశాలకు వచ్చి తమ పిల్లల విద్యా పురోగతి, ప్రవర్తన గురించి ఉపాధ్యాయులను సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, జిల్లా యంత్రాంగం సమిష్టిగా పనిచేస్తే ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేయడంతో పాటు విద్యార్థులను అన్ని రంగాల్లో ఉన్నత స్థాయికి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు. తల్లిదండ్రుల సంపూర్ణ సహకారం లభిస్తే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ పాఠశాలల విద్యార్థుల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తారని జిల్లా కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఈ.ఓ. శారద , జి.సి.డి.ఓ. కవిత,సర్పంచ్ రాజయ్య, ఉప సర్పంచ్ తిరుపతి,పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజు లత, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ,తదితరులు, పాల్గొన్నారు.

## పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి...

22వ వార్డులో శానిటేషన్ పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి పట్టణ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా మున్సిపల్ సిబ్బందికి ఇచ్చి సహకరించాలని మున్సిపల్ చైర్ పర్సన్ నూగిల్ల మల్లయ్య పేర్కొన్నారు. శనివారం పెద్దపల్లి పట్టణంలో 22వ వార్డును సందర్శించిన మున్సిపల్ చైర్మన్ నూగిల్ల మల్లయ్య ను కౌన్సిలర్ ఉప్పు స్వరూప – రాజు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం చైర్మన్ పాత ఎల్ఐసి క్వార్టర్ లైన్ లో శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ మల్లయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు సహకారంతో 22 వార్డ్ లో 74 లక్షల 38 వేల రూపాయలతో వార్డులో సీసీ రోడ్లు, సీసీ డ్రైనేజిల నిర్మాణం చేయడం జరుగుతుందని తెలియజేశారు. పట్టణ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. దయచేసి ప్రజలు ఇండల్లో వెళ్లే చెత్తను తడి – పొడి చెత్తగా వేరుచేసి విజిల్ వేస్తూ వచ్చే మున్సిపల్ సిబ్బందికి అందజేయాలని, రోడ్లపైన,మురికి కాలువలో, ఓపెన్ ప్లాట్లల్లలో చెత్త వేడినట్లయితే వారిని గుర్తించి వారికి మున్సిపల్ చట్ట ప్రకారం జరిమానాలు విధించడం జరుగుతుందని తెలియజేశారు.స్వచ్ఛ పెద్దపల్లికి ప్రతి ఒక్కరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉప్పు స్వరూప – రాజు,వార్డ్ ఆఫీసర్ ఏశ్వంత్,సానిటరీ ఇన్స్పెక్టర్ రామ్మోహన్ రెడ్డి,హరిత హారం ఇంచార్జ్ సదానందం,బిల్ కలెక్టర్ సింగారప్ శ్రీనివాస్,జవాన్ చిన్న,ఎలక్ట్రీషన్ అశోక్, వాటర్ సప్లై లైన్ మెన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## దళితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌కు ఆల్ సంఘాల ఐక్యవేదిక వినతి



**పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆల్ సంఘాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యను కోరింది. శుక్రవారం పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లకు పాటకుల మహేష్ నాయకత్వంలో ఆల్ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లాలో దళితులపై జరుగుతున్న దాడులు, భూ ఆక్రమణలు, ఆలయ ప్రవేశానికి అడ్డంకులు, భూ వివాదాలు, కుల బహిష్కరణలు, హత్య కేసులు, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో నిందితులపై సకాలంలో చర్యలు తీసుకోకపోవడం వంటి సమస్యలను కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కుల బహిష్కరణ, భూ వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులపై పోలీసులు, రెవెన్యూ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. జిల్లాలోని బాధిత దళిత కుటుంబాలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పరిష్కరించాలని, భూ సమస్యలు, కుల వివక్ష, దాడులకు సంబంధించి బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టాలని ఆల్ సంఘాల ఐక్యవేదిక నాయకులు కమిషన్ చైర్మన్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు మామిడిపల్లి బాపయ్య, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొంకూరి మధు, ఆది జాంబవంతు అరుంధతి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోటగిరి పాపయ్య, మాజీ ఎంపీపీ కవ్వంపల్లి లక్ష్మి, గుల్ల రాజు, కవ్వంపల్లి దుర్గయ్య, బొంకూరి సుభాష్, సలగంటి రామలక్ష్మి, ఉండింటి ప్రభాకర్, రామిల్ల శారద, బోసెల్లి మహేష్, కృష్ణ, వీరయ్య, శంకరయ్య, మల్లేశం, బోధలు, మదెల రాజన్న తదితరులు పాల్గొన్నారు.

## పచ్చునూర్ గ్రామంలో ఘనంగా కప్పల తల్లి ఆట

# వర్షాల కోసం ప్రత్యేక పూజలు





**కరీంనగర్ టౌన్, జూలై18:** మానకొండూర్ మండలం పచ్చునూర్ గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, గ్రామం పాడిపంటలతో వర్ధిల్లాలని కోరుకుంటూ శనివారం కప్పల తల్లి ఆట కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పారనంది కేశవ్ ఆధ్వర్యంలో ఈ వేడుక జరిగింది. ఈ సందర్భంగా సర్పంచ్ పారనంది కేశవ్ మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో ఆశించిన స్థాయిలో వర్షాలు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో కరవు పరిస్థితులు తొలగిపోవాలని, సమృద్ధిగా వానలు కురవాలని కోరుకుంటూ ఈ సాంప్రదాయ ఉత్సవాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో భాగంగానే గ్రామంలోని ప్రధాన దేవాలయాలలో వేద బ్రాహ్మణులు, అర్చకులచే ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామం అంతా ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని భగవంతుడిని ప్రార్థించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో దేవంపల్లి సహకార సంఘం చెర్మన్ రొంటాల లక్ష్మా రెడ్డి,ఉప సర్పంచ్ అనిల్ గౌడ్, సభ్యులు పిట్టల మల్లేశం, కొమ్మళ్ల నరేష్, పూసల సతీష్, కందీ ప్రవిత్ర, కల్వల రవి, పిన్నింటి కేశవ రెడ్డి,గ్రామ శాఖ అధ్యక్షులు రామంచ ప్రవీణ్,మాజీ సర్పంచ్ లు నర్మెట వసంత –వీరయ్య, బైకా మోహన్, కసిరెడ్డి సంపత్ రెడ్డి, సీతా కనుకయ్య, గోపు రాంరెడ్డి, కూరాకుల పోశాలుగ్రామ ప్రముఖులు, రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై ఆధారరహిత ఆరోపణలు మానుకోవాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీ (జేఏసీ) జిల్లా కన్వీనర్ మోలుమురి చంద్రశేఖర్




**పెద్దపల్లి ప్రతినిధి :** బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ (జేఏసీ) పెద్దపల్లి జిల్లా కన్వీనర్ మోలుమురి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యక్తిగత విమర్శలకు దిగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మెప్పు పొందేందుకే గువ్వల బాలరాజు చౌకబారు రాజకీయాలకు పాల్పడుతూ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గురుకుల విద్యా వ్యవస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని, నిరుపేద, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వేలాది మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేశారని తెలిపారు. ఆయన నాయకత్వంలో గురుకుల విద్యా సంస్థలు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని, అనేక మంది విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు, విదేశీ విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించి, దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడిన విషయాన్ని గుర్తు చేశారు. ఇలాంటి వ్యక్తిపై ఎలాంటి ఆధారాలు చూపకుండా గురుకులాల్లో అవినీతి జరిగిందంటూ ఆరోపణలు చేయడం బాధ్యతారాహిత్యమని చంద్రశేఖర్ అన్నారు. రాజకీయ విభేదాలు ఉంటే విధానాలపై విమర్శలు చేయాలని, వ్యక్తిత్వాన్ని దూషించే వ్యాఖ్యలు చేయడం తగదని పేర్కొన్నారు. గువ్వల బాలరాజు వెంటనే తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించి ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో అరికెల ప్రసాద్, కుమ్మరి శ్రీ వాణి, ఎనగందుల నిరంజన్, బొంకూరు నిఖిల్, మోలుమురి మధునయ్య, మోలుమురి అజయ్, మాంధ్రాతి సతీష్, మోలుమురి సన్నీ, కల్వల సదయ్య, అక్కపాక హనుమంతు, కొమ్మరాజుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్‌తోనే సత్వర న్యాయం: జడ్జి దుర్గం గణేష్



**సుల్తానాబాద్, జూలై 18 :** రాజీ మార్గమే రాజ మార్గమని, లోక్ అదాలత్‌ల ద్వారా ఇరువర్గాలకు సత్వర న్యాయం అందుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి దుర్గం గణేష్ అన్నారు. శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు ఆవరణలో ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి గణేష్ మాట్లాడుతూ.. కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృధా చేసుకోకుండా ఇరువర్గాలు రాజీ మార్గంలో కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. క్షణికావేశంలో చేసే నేరాల వల్ల విలువైన భవిష్యత్తును కోల్పోతారని, వ్యయప్రయాసలకు గురికాకుండా ఉండేందుకు లోక్ అదాలత్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ అదాలత్‌లో పలు క్రిమినల్, చెక్ బౌన్స్, కుటుంబ తగాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్, సివిల్ కేసులను సామరస్యపూర్వకంగా పరిష్కరించినట్లు కోర్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వొడ్నాల రవీందర్, ప్రధాన కార్యదర్శి అవునూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ఆవుల శివకృష్ణ, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నేరెళ్ల శంకరయ్య, లోక్ అదాలత్ సభ్యులు మాదూరి ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే న్యాయవాదులు బోయిని భూమయ్య, పెగడ శ్యాం సుందర్, మల్యాల కరుణాకర్, అంబాల నర్సయ్య, మాదూరి పృథ్వీ, వేముల స్నేహ, కోర్టు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# శిక్షలు పడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి

● రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ ● కోర్టు డ్యూటీ అధికారుల పనితీరు మెరుగుదలపై సమీక్ష

**గోదావరిఖని క్రైమ్ :** శిక్షలు పడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిషోర్ ఝూ పిలుపునిచ్చారు. శనివారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కోర్టు డ్యూటీ, కోర్టు లైజనింగ్ పోలీసు అధికారులతో సీపీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కోర్టు విధుల నిర్వహణ, కేసుల పురోగతి, శిక్షల శాతం పెంపు, సాంకేతిక సమస్యలు, సాక్షుల నిర్వహణ తదితర అంశాలపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. కోర్టు విధులకు సంబంధించిన ప్రతి పనిని నిర్దేశిత గడువులో నాణ్యతతో పూర్తి చేయాలని సూచించారు. విధుల నిర్వహణలో ఎదురయ్యే పరిపాలనా లేదా సాంకేతిక సమస్యలను దాచిపెట్టకుండా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. కోర్టు డ్యూటీ అధికారియోంల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని, ప్రతి అధికారి తన పనితీరును మరింత మెరుగుపర్చుకునే దిశగా కృషి చేయాలని సూచించారు. సమన్లు, బెయిలు మంజూరు కాని అరెస్టు వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూలు), ఇతర వారెంట్ల అమలు, కోర్టుకు సంబంధించిన అన్ని ప్రక్రియలను వేగవంతంగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. సాక్షులను కోర్టుకు సకాలంలో హాజరుపరిచే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. సాక్షులకు కోర్టు ప్రక్రియపై ముందస్తు అవగాహన కల్పించి, వారు ధైర్యంగా, స్పష్టంగా వాంగ్మూలం ఇచ్చేలా అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని తెలిపారు. విచారణ సమయంలో అనవసర గందరగోళానికి గురికాకుండా వారికి ధైర్యం చెప్పి, న్యాయ ప్రక్రియపై సరైన అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి కేసులో శిక్షలు పడేలా దర్యాప్తు అధికారులు, కోర్టు డ్యూటీ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని, సమయపాలన, నాణ్యమైన దర్యాప్తు, సమర్థవంతమైన కోర్టు నిర్వహణ ద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని సీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన అధికారియోంను ప్రతి నెల గుర్తించి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. విధి నిర్వహణలో విశేష కృషి చేసి అనంతరం బదిలీపై వెళ్లిన అధికారియోంల దర్యాప్తు చేసిన కేసుల్లో తర్వాత శిక్షలు విధించబడినా, సంబందిత అధికారుల సిఫారసు మేరకు వారికి కూడా గుర్తింపు,





ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో శిక్షల శాతాన్ని పెంచడం, ప్రతి కేసును సకాలంలో పూర్తి చేయడం ప్రధాన లక్ష్యమని పేర్కొన్న సీపీ, ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేసి ప్రజలకు సమర్థవంతమైన న్యాయ సేవలు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడడంలో కీలక పాత్ర పోషించిన కోర్టు డ్యూటీ సిబ్బందిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్లు అనిల్ కుమార్, బాబురావు, ఎసఐ వినీత, కోర్టు డ్యూటీ సిబ్బంది, కోర్టు లైజనింగ్ అధికారులు పాల్గొన్నారు.

# ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా 'మాక్ పోలింగ్'

● నిజమైన ఎన్నికలను తలపించిన హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ పదవుల ఎన్నిక ● చిన్న వయస్సు నుంచే ఓటు విలువపై అవగాహన: చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్

**సుల్తానాబాద్, జులై 18:** విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, ఓటు హక్కు ప్రాముఖ్యతను పెంపొందించే లక్ష్యంతో సుల్తానాబాద్ మండల కేంద్రంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ ఎన్నికలను నిజమైన ఎన్నికల మాదిరిగా శనివారం నిర్వహించారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల తరహాలోనే ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, గుర్తుల కేటాయింపు, రహస్య ఓటింగ్, బ్యాలెట్ బాక్స్‌ల వాడకం, ఓట్ల లెక్కింపు వరకు ప్రతి దశను ఇక్కడ అమలు చేయడం విశేషంగా నిలిచింది. ఈ ఎన్నికల్లో హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్ పదవులకు మొదట 18 మంది విద్యార్థులు నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, పత్రాల పరిశీలనలో 3 నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, అనంతరం ఇద్దరు అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో తుది పోటీలో 13 మంది అభ్యర్థులు నిలిచారు. వారికి ప్రత్యేక ఎన్నికల గుర్తులు కేటాయించి బ్యాలెట్ పత్రాల ద్వారా ఓటింగ్ నిర్వహించారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ పర్యవేక్షణలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా సాగింది. విద్యార్థులందరూ ఎంతో ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ మాట్లాడుతూ, విద్యార్థులు చిన్న వయస్సు నుంచే ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల నిర్వహణపై ఆచరణాత్మక అవగాహన పెంపొందించు కోవడం ఎంతో అవసరమన్నారు. భవిష్యత్తులో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి, వారిలో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం పెంపొందడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించి మొత్తం ప్రక్రియను విజయవంతంగా నిర్వహించగా, ఈ వినూత్న కార్యక్రమాన్ని తల్లిదండ్రులు, విద్యావేత్తలు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ఖమ్మం ప్రతి నిధి, జూలై 18:** పాలేరు నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని, ప్రజలకు వీటి ఫలాలు త్వరితగతిన అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. కూసుమంచి క్యాంపు కార్యాలయంలో శనివారం పాలేరు నియోజకవర్గ అభివృద్ధి పురోగతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి మంత్రి, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి, నియోజకవర్గంలో జరుగుతున్న వివిధ నిర్మాణ, మౌళిక వసతుల పనులను ఇంజనీరింగ్ శాఖల వారీగా సమీక్షించారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు ఎన్ని పనులు మంజూరయినది, వాటిలో ఎన్ని పనులకు టెండర్ ప్రక్రియ పూర్తయి పనులు ప్రారంభమయ్యాయి, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో ఎన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. సాంకేతిక లేదా ఇతర కారణాల వల్ల ఇంకా టెండర్ కాని పనులు ఎన్ని ఉన్నాయి అనే వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. టెండర్లు నిలిచిపోయిన పనులకు అడ్డంకులను తొలగించి వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రి మాట్లాడుతూ, అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి అయ్యేలా అధికారులు కార్యాచరణ చేయాలన్నారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ లేదన్నారు. నిర్దేశిత గడువు లోపల పనులన్నింటినీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. పెండింగ్ బిల్లుల వివరాలు సమర్పించాలని మంత్రి తెలిపారు. అభివృద్ధి పనులు వేగంగా సాగాలంటే వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం చాలా ముఖ్యమని మంత్రి అన్నారు. అధికారులు ఒకరితో ఒకరు చర్చించుకుంటూ, ఎక్కడైనా సమస్యలు ఎదురైతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పనులకు ఆటంకం కలగకుండా చూడాలన్నారు. ప్రజాదర్బార్ సందర్భంగా స్వీకరించిన దరఖాస్తులు పరిష్కరించాలన్నారు. శాఖల వారీగా ఎన్ని దరఖాస్తులు వచ్చింది, ఎన్ని పరిష్కారం అయింది, ఇంకనూ ఎన్ని పెండింగ్ లో ఉన్నది అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తుల పరిష్కారానికి నిధులు





ప్రభుత్వం మంజూరు చేస్తుందని మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలో పూర్తిగా రీ సర్వే ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని అన్నారు. పాలేరు నియోజకవర్గం రాష్ట్రానికి ఆదర్శంగా రూపుదిద్దుకోవాలని మంత్రి అన్నారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాస చారి, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, నియోజకవర్గ ఎంపీడీవోలు, తహశీల్దార్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ రాగా పాఠశాల అక్రమాలపై వెంటనే చర్యలు తీసుకోవాలి: పి డి ఎస్ యు

**ఖమ్మం ప్రతినిధి, జూలై 18:** కొత్తగూడెంలోని శ్రీ రాగా పాఠశాలలో విద్యాశాఖ నిబంధనల ఉల్లంఘనలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పిడిఎస్‌యూ, పి డి ఎస్ యు సంఘాల ప్రతినిధులు జిల్లా విద్యాశాఖ అడిషనల్ డైరెక్టర్ (ఏడీ) శంభు ప్రసాద్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షులు బి. వీరభద్రం, జిల్లా కార్యదర్శి దుర్గం ప్రణయ్ మాట్లాడుతూ, చట్టాలు, నిబంధనలు సామాన్య ప్రజలకేనా? లేక ప్రైవేట్ విద్యా వ్యాపార సంస్థలకు వర్తించవా? అనే ప్రశ్నకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత 3 సంవత్సరాలుగా చట్టబద్ధమైన షిఫ్టింగ్ అనుమతి లేకుండానే పాఠశాల కొనసాగుతోందనీ, సంబంధిత అధికారులు ఇప్పటి వరకు స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. షిఫ్టింగ్ కు కనీస అవసరమైన రిజిస్టర్డ్ లీజ్ డీడ్ బిల్డింగ్ ఓనర్ నుండి లేకుండా షిఫ్టింగ్ దరఖాస్తు ప్రాసెసింగ్ లో ఉందని అధికారులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. విద్య అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు అనీ, దానిని కొందరు ప్రైవేట్ యాజమాన్యాలు లాభాల కోసం వ్యాపారంగా మార్చి, నిబంధనలను ఉల్లంఘిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడటం అత్యంత ప్రమాదకరమని అన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు లేకపోవడం, నిబంధనలకు విరుద్ధంగా ఫీజులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు, విద్యార్థుల భద్రత మరియు విద్యా ప్రమాణాలపై నిర్లక్ష్యం వంటి అంశాలు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. అదేవిధంగా, కొంతమంది విద్యార్థులు మత్తు పదార్థాల ప్రభావానికి గురవుతున్నారనీ ఇది అత్యంత ఆందోళనకరమని, ఈ అంశంపై వాస్తవాలను వెలికితీసేలా సంబంధిత శాఖలతో కలిసి నిష్పాక్షిక విచారణ నిర్వహించాలని కోరారు. అలాగే అక్రమ పాఠ్యపుస్తకాల విక్రయాలు, యూనిఫాంల అమ్మకాలు, అనుమతులు లేకుండా హాస్టల్ నిర్వహణ జరుగుతోందనే ఆరోపణలను కూడా సమగ్రంగా



పరిశీలించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ తన బాధ్యతను నిర్వర్తించి పాఠశాల గుర్తింపు, షిఫ్టింగ్ అనుమతులు, ఉపాధ్యాయుల అర్హతలు, భద్రతా ప్రమాణాలు, ఫీజుల వసూళ్లు, హాస్టల్ నిర్వహణ తదితర అంశాలపై పారదర్శక విచారణ జరిపి నివేదికను ప్రజలకు వెల్లడించాలని సంఘాలు కోరాయి. విచారణలో ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విద్యార్థుల విద్యకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం మరియు విద్యాశాఖను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అరుణ్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర కిడ్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ - 2026

**హైదరాబాద్ (తారజ్యోతి):** వయో విభాగాలు, జనన తేదీల అర్హతలు మరియు పోటీ అంశాలు వయో విభాగం జనన తేదీల మధ్య పోటీ అంశాలు అండర్-6 (బాలురు బాలికలు) 07-08-2020 నుండి 06-08-2022 వరకు 60 మీ., 150 మీ., స్టాండింగ్ లాంగ్ జంప్ అండర్-8 (బాలురు బాలికలు) 07-08-2018 నుండి 06-08-2020 వరకు 60 మీ., 200 మీ., స్టాండింగ్ లాంగ్ జంప్ అండర్-10 (బాలురు బాలికలు) 07-08-2016 నుండి 06-08-2018 వరకు 60 మీ., 300 మీ., స్టాండింగ్ లాంగ్ జంప్ అండర్-12 (బాలురు బాలికలు) 07-08-2014 నుండి 06-08-2016 వరకు 60 మీ., 400 మీ., స్టాండింగ్ లాంగ్ జంప్, బ్యాక్ త్రో (1 కిలో షాట్‌పుట్) 5వ జాతీయ జావెలిన్ దినోత్సవ వేడుకలు వయో విభాగం జనన తేదీల మధ్య పోటీ అంశం అండర్-14 (బాలురు బాలికలు) 07-08-2012 నుండి 06-08-2014 వరకు కిడ్స్ జావెలిన్ త్రో అండర్-16 (బాలురు బాలికలు) 07-08-2010 నుండి 06-08-2012 వరకు జావెలిన్ త్రో అండర్-18 (బాలురు బాలికలు) 07-08-2008 నుండి 06-08-2010 వరకు జావెలిన్ త్రో అండర్-20 (బాలురు బాలికలు) 07-08-2006 నుండి 06-08-2008 వరకు జావెలిన్ త్రో సీనియర్ పురుషులు, మహిళలు 07-08-2026 నాటికి 20 సంవత్సరాలు పైబడిన వారు జావెలిన్ త్రో.

## ఆదర్శలో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

**మానకొండూర్, జూలై18:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పోచంపల్లి ఆదర్శ పాఠశాలడ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంలో ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 33 సీట్లు,7వ తరగతిలో 22 సీట్లు,8వ తరగతిలో 4 సీట్లు, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీలో 5 సీట్లు, బైపీసీలో 10 సీట్లు,సిఈసీలో 10 సీట్లు, ఏసిఈలో 30 సీట్లు ఖాళీ ఉన్నట్లు తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు ఈ నెల 20న సరైన ధ్రువపత్రాలతో పాఠశాలలో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందుబాటులో ఉన్న ఖాళీల ఆధారంగా సీట్ల భర్తీ ఉంటుందని పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్ ను సంప్రదించాలని ప్రకటనలో పేర్కొన్నారు.

## ఈ నెల 19వ తేదీన శుభమస్తు ఈవెంట్స్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలు



**కరీంనగర్ టౌన్, జూలై18:** మిలీనియం డాన్స్ అకాడమీ 26 వసంతాలు దిగ్విజయంగా పూర్తిచేసుకున్న సందర్భంగా, కరీంనగర్ లోని కళాభారతి వేదికగా శ్రీ శుభమస్తు ఈవెంట్స్ ఆధ్వర్యంలో కళా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మెగా ఈవెంట్ కు హాజరుకావాల్సిందిగా కోరుతూ శ్రీ శుభమస్తు ఈవెంట్స్ నిర్వాహకులు మిలీనియం శ్రీనివాస్, వారి బృందం బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా ఈవెంట్ ఆర్గనైజర్ మిలీనియం శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర స్థాయి డాన్స్ పోటీలు, ట్రెడిషనల్ ఫ్యాషన్ షో, మరియు ప్రతిష్టాత్మక 'కరీంనగర్ మెగాస్టార్ ఐకాన్ అవార్డ్స్' ప్రదానోత్సవ వేడుకలను భార్య ఎత్తున నిర్వహించనున్నారు. ఉత్సాహభరితమైన కళాకారుల నృత్య ప్రదర్శనలు ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఈ వేడుకలకు యూట్యూబ్ షార్ట్ ఫిల్మ్ యాక్టర్స్, డైరెక్టర్స్, ఫోక్ సాంగ్స్ ఇండస్ట్రీకి చెందిన కళాకారులు, ప్రముఖ పాటల రచయితలు ఈ కార్యక్రమానికి హాజరై సందడి చేయనున్నారు అని తెలిపారు.

## ఖనిలో కల్తీ ఆహారం అధికారుల ప్రత్యేక తనిఖీలు

### ఆలుచిప్స్ ను కూడా కల్తీ చేస్తున్న నిర్వాహకులు



**గోదావరిఖని టౌన్ :** పెద్దపల్లి జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి గోదావరిఖని పట్టణ పరిధిలోని పలు రెస్టారెంట్లు మరియు ఆహార తయారీ యూనిట్లలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరిఖని రాజీవ్ నగర్‌లో ఉన్న ఒక ఆహార తయారీ యూనిట్‌ను తనిఖీ చేయడం జరిగింది. సదరు యూనిట్‌లో ఆలుగడ్డ చిప్స్ మరియు ఇతర స్నాక్స్ పదార్థాల తయారీ జరుగుతున్నట్లు గుర్తించారు. తనిఖీ సందర్భంగా చిప్స్ తయారీకి ఉపయోగిస్తున్న వంటనూనెను పదేపదే వినియోగిస్తున్నట్లు గుర్తించబడింది. వంటనూనె నాణ్యతను అక్కడికక్కడే ఫుడ్ సేఫ్టీ శాఖకు చెందిన టెస్టింగ్ మీటర్ ద్వారా పరీక్షించగా, దాని రీడింగ్ నిర్దేశిత ప్రమాణాలను మించినట్లు తేలింది. దీంతో సుమారు 25 కిలోల వాడిన వంటనూనెను స్వాధీనం చేసుకుని నిర్వీర్యం చేయడంతో పాటు, ఆ నూనెతో తయారు చేస్తున్న చిప్స్‌ను కూడా అక్కడికక్కడే ధ్వంసం చేయడం జరిగింది. అంతేకాకుండా, వాడిన వంటనూనెను ఎటువంటి అనధికార సంస్థలు లేదా వ్యక్తులకు విక్రయించరాదని యాజమాన్యానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఈ తనిఖీల సందర్భంగా సంబంధిత ఆహార నమూనాలను సేకరించి, తదుపరి విశ్లేషణ నిమిత్తం రాష్ట్ర ఆహార ప్రయోగశాలకు పంపించడం జరిగింది. ప్రయోగశాల నివేదికల ఆధారంగా అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని ఫుడ్ సేఫ్టీ అధికారి తెలిపారు.

## ఆర్. కృష్ణయ్యతో జాజాల రమేష్ భేటీ



**ధర్మపురి, జూలై 18, :** హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది జాజాల రమేష్ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో ఆయన్ని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీసీలతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు మరియు ఇతర బడుగు బలహీన వర్గాల సంక్షేమం, విద్య, ఉపాధి, యువత సాధికారత, సామాజిక న్యాయం తదితర అంశాలపై ఇరువురు చర్చించారు. అనంతరం జాజాల రమేష్ మాట్లాడుతూ, గత 16 సంవత్సరాలుగా విద్యార్థుల సంక్షేమం కోసం బడుగు బలహీన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం వివిధ సామాజిక ఉద్యమాల్లో పనిచేస్తూ వస్తున్నానని తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతి కోసం తన వంతు కృషి నిరంతరం కొనసాగుతుందని రమేష్ పేర్కొన్నారు.

# కరెంటు కోతల కత్తితో రైతన్నపై మరో దెబ్బ..!

● 24 గంటల విద్యుత్ మాటల్లోనే(నా)..? ● పొలాలు మాత్రం బీళ్ళే ..! ● వానలు లేవు... కాలువ నీళ్లు రావు... కరెంటూ నిలువదు ● సాయంత్రం నుంచి తెల్లవారే దాకా త్రీఫేజ్ గల్లంతు ● ఎండిపోతున్న పంటలు... ఆగిపోయిన దుక్కులు..ఆందోళనలో అన్నదాతలు.. ● ప్రత్యేక కథనం

**బ్యూరో, హైదరాబాద్:** ఒకప్పుడు కరెంటు పోతే అది వార్తగా మారేది. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైంది. గ్రామాల్లో కేవలం పొద్దంతా నిరంతర విద్యుత్ సరఫరా కనిపిస్తే అదే ఆశ్చర్యంగా చర్చించుకునే పరిస్థితి నెలకొంది. రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ప్రభుత్వం పదేపదే ప్రకటిస్తున్నప్పటికీ, గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోంది.

రైతుల కథనం ప్రకారం..

సాయంత్రం నాలుగు గంటల నుంచి మరుసటి రోజు ఉదయం ఐదు గంటల వరకు వ్యవసాయ పంపుసెట్లకు అవసరమైన త్రీఫేజ్ విద్యుత్ పూర్తిగా నిలిపివేస్తున్నారు. ఉదయం వచ్చినా అది నాణ్యమైన విద్యుత్ కాకపోవడంతో తరచూ లైన్ ట్రిప్పింగ్‌లు, వోల్టేజ్ హెచ్చుతగ్గులు ఏర్పడి మోటార్లు సక్రమంగా పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజుకు ఐదు నుంచి ఆరు సార్లు లైన్ కట్ కావడం సాధారణ విషయంగా మారిందని రైతులు చెబుతున్నారు.

ఇలా చీటికిమాటికి త్రీఫేస్ కరెంటు కట్ కావడంతో పారిన మడులే పారడం వల్ల పొలాల దుక్కులు పూర్తిగా




నిలిచిపోతున్నాయి. నారుమడులు ముదిరిపోతుండడంతో దుక్కులు సాగక వరి సాగు ప్రశ్నార్థకంగా మారింది.

ఈ ఏడాది వర్షాలు ఆశించినంతగా కురవడం లేదు. కాలువల ద్వారా సాగునీరు అందకపోవడంతో భూగర్భ జలాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. అయితే బోర్లలో ఉన్న కొద్దిపాటి నీటిని కూడా విద్యుత్ కోతల కారణంగా సద్వినియోగం చేసుకోలేక పంటలను కాపాడుకోవడం కష్టంగా మారింది. రాత్రివేళ నిరంతరంగా విద్యుత్ అందితే కనీసం బోర్ల ద్వారా నీరు అందించి పంటలను రక్షించుకునే అవకాశం ఉండేదని రైతులు వాపోతున్నారు.

గత యాసంగి సీజన్‌లో కనిపించిన విద్యుత్ సమస్యలే ఇప్పుడు వానాకాలం సీజన్‌లోనూ కొనసాగుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వానాకాలంలో వర్షాలపై ఆధారపడాల్సిన పరిస్థితిలో కూడా బోర్లతోనే సాగు చేయాల్సి వస్తుండగా, విద్యుత్ కోతలు రైతన్నను మరింత సంక్షోభంలోకి నెట్టుతున్నాయని చెబుతున్నారు.

ఒకవైపు కాలువ నీళ్లు లేవు..మరోవైపు వర్షాలు ముఖం చాటేశాయి..ఉన్న భూగర్భ జలాలను వినియోగించుకునేందుకు అవసరమైన విద్యుత్ కూడా సక్రమంగా అందకపోవడంతో రైతన్న తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నాడు.

వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్తున్న ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా, గ్రామాల్లోని వాస్తవ పరిస్థితిని గుర్తించి రైతులకు నిరంతర త్రి ఫేస్ విద్యుత్ అందించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

# అమరుడు సోమనపల్లి లింగయ్య. నాగమ్మ జ్ఞాపకార్ధంగా శవ పేటికను వితరణ చేసిన జీవిత సహచరి సూరమ్మ. కొడుకు వెంకటేశ్వర్లు

**ఖమ్మం ప్రతినిధి, జూలై 19:** ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం దమ్మాయిగూడెం గ్రామానికి చెందిన అమరుడు సోమనపల్లి లింగయ్య, పెద్ద భార్య నాగమ్మ జ్ఞాపకార్ధంగా చిన్న భార్య సోమనపల్లి సూరమ్మ. కుమారుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు( సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్ ( ప్రజా పంథా) తిరుమలాయపాలెం మండల కార్యదర్శి) మరియు కుటుంబ సభ్యులు చర్చించుకుని దమ్మాయిగూడెం గ్రామంలో పేద ప్రజలు ఆర్థిక భారంతో ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నారని కుటుంబంలో ఒక సభ్యుడు మరణిస్తే శవాన్ని భద్రపరచడానికి ఎలాంటి రక్షణ లేకుండా ఇబ్బంది పడుతున్నారని అర్థం చేసుకున్న భార్య సూరమ్మ కుమారు వెంకటేశ్వర్లు దమ్మాయిగూడెం గ్రామానికి శవపేటికని ఈరోజు శనివారం గ్రామపంచాయతీ సర్పంచి మరియు కార్యదర్శి వితరణ చేయడం జరిగింది. గ్రామంలో ఎవరు మరణించిన ఉచితంగా శవపేటిక ( పిజ్జార్ బాక్స్) ఇవ్వాలని కుటుంబాన్ని నిర్ణయాన్ని గ్రామ ప్రజలు. దమ్మాయిగూడెం గ్రామపంచాయతీ పాలకవర్గం సూరమ్మ వెంకటేశ్వర్లను అభినందించారు. గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహాయ సహకారాలు అందించాలని గ్రామ సర్పంచ్ వీరదాసు వినోద . ఉప సర్పంచ్ రాజశేఖర్ కోరారు. ప్రతి ఒక్కరూ సోమనపల్లి వెంకటేశ్వర్లు నీ ఆదర్శంగా తీసుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమరుడు సోమనపల్లి



లింగయ్య జీవిత భాగస్వామి సోమనపల్లి సూరమ్మ,కుమారుడు సోమనపల్లి వెంకటేశ్వర్లు, బిడ్డలు అల్లుళ్ళు మాడుగుల వెంకన్న, కుసుమ, అనంతగిరి వెంకన్న, పద్మ, గట్టు ఎల్లయ్య సుశీల, సర్పంచి వీరదాసు వినోద బద్రి, ఉప సర్పంచ్ ఉన్నాం రాజశేఖర్, దమ్మాయిగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శి రమేష్, వార్డ్ మెంబర్ సేకినాబి, చామకూరి ప్రమీల, రమణ బోయిన నరసయ్య, సాయిబాబా, మాజీ సర్పంచ్ కూసు అప్పారావు, ఆలస్యం నాగేశ్వరరావు, సిపిఐ (ఎంఎల్ )మాస్ లైన్( ప్రజాపంథా) జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు, ప్రగతిశీల యువజన సంఘం పివైఎల్ మండల అధ్యక్షుడు ఉన్నం నరేష్, కూసు ప్రసాద్, లాలయ్య, జగదీష్, ఉన్నావ్ నాగేశ్వరరావు, వీరదాస్ బద్రి, వీరదాస్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో ఏకాగ్రత, ఆలోచనా శక్తిని పెంపొందించే అద్భుత సాధనం చెస్

● చెస్ పోటీల్లో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ ● క్రీడాకారులకు ప్రోత్సాహం ● నిర్వాహకులు డైరెక్టర్ అనుప్‌కు అభినందనలు





**కరీంనగర్ టౌన్, జూలై18:** కరీంనగర్‌లో విద్యార్థుల మేధో వికాసం, ఏకాగ్రత నిర్ణయ సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన చెస్ పోటీల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ, చదరంగం (చెస్) అనేది కేవలం ఒక ఆట మాత్రమే కాకుండా విద్యార్థుల ఆలోచనా శక్తిని, విశ్లేషణాత్మక దృష్టిని, ఓర్పును పెంపొందించే అద్భుతమైన మేధో క్రీడ అని పేర్కొన్నారు.విద్యార్థులను ప్రోత్సహించేందుకు డైరెక్టర్ అనుప్ ప్రతిష్టాత్మకంగా ఈ చెస్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. చెస్ ఆట విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచడమే కాకుండా క్లిష్ట పరిస్థితుల్లో సరైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందిస్తుందని తెలిపారు. జీవితంలోనూ, విద్యలోనూ విజయాలు సాధించేందుకు చెస్ వంటి మేధో క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. రాబోయే ప్రపంచ చెస్ ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొంటూ, భవిష్యత్తులో కరీంనగర్‌కు చెందిన యువ క్రీడాకారులు కూడా అంతర్జాతీయ స్థాయిలో రాణించి దేశానికి, రాష్ట్రానికి, నగరానికి పేరు ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో గెలుపు--ఓటములు సహజమని, వాటిని సమానంగా స్వీకరించి మరింత పట్టుదలతో ముందుకు సాగాలని విద్యార్థులకు సూచించారు. క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర సాధనతో ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలను అధిరోహించగలడని అన్నారు. చివరగా ఈ బృహత్తర చెస్ పోటీలను విజయవంతంగా నిర్వహించిన డైరెక్టర్ అనుప్ కి ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ, పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావ్, కార్పొరేటర్ కె ఏపీపీ చంద్ర, క్రీడా సంఘాల అధ్యక్షులు జనార్దన్ రెడ్డి, శ్రీనివాస్, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

## మానకొండూర్‌లో ఈషా గ్రామోత్సవం -2026



**మానకొండూర్, జూలై18 :** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న 18వ ఈషా గ్రామోత్సవం క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు.జిల్లా అటవీశాఖ అధికారి సిరికొండ సత్యనారాయణ, సిఐ పి.శ్రీలత ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ.... క్రీడలతో ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకుని, క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, సామాజిక బాధ్యతతో గ్రామీణ యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నిజాయితీ, నిష్పక్షపాతతో పోటీల్లో పాల్గొని విజయాలను సాధించాలని ఆకాంక్షించగా క్రీడాకారులందరూ నిష్పక్షపాతంగా పోటీల్లో పాల్గొంటామని ప్రతిజ్ఞ చేశారు.క్లస్టర్ స్థాయి పోటీలలో 21 గ్రామాల నుండి మొత్తం 22 పురుషుల వాలీబాల్ జట్లు, 6 గ్రామాల నుండి 10 మహిళల త్రోబాల్ జట్లు,మొత్తం 32 జట్లు ఉత్సాహంగా పాల్గొని క్రీడా మహోత్సవంలో తమ ప్రతిభను ప్రదర్శించేందుకు హాజరుకావడంతో క్రీడా ప్రాంగణం సందడిగా మారి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికితీసి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈషా గ్రామోత్సవానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఈషా ఫౌండేషన్ తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వాలీబాల్ అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జి.లక్ష్మణ్, జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు డి.రాదాకృష్ణ,స్థానిక సర్పంచ్ తాళ్ళపల్లి వర్షిణి గౌడ్,ప్రధానోపాధ్యాయులు దాసి శ్రీనివాస్, గ్రాఫ్టన్ మోటార్స్ పార్టనర్ సందీప్ క్రీడాకారులు పాల్గొన్నారు.

## రెండు చోట్ల ఓట్లుంటే స్వచ్ఛందంగా ఒకటి వదులుకోవాలి

### లేదంటే ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద జైలు శిక్ష తప్పదు

### స్పష్టం చేసిన కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి

**మహేశ్వరం జులై 18 :** ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు హక్కు ఉంటే ఒకదాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాలని కందుకూర్ ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం మహేశ్వరం మండలం తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్



కార్యక్రమం మహేశ్వరం నియోజకవర్గంలో ముమ్మరంగా సాగుతుందని తెలిపారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 40.శాతం ఫారాల డిజిటలైజేషన్ పూర్తయిందన్నారు. కందుకూరు మండలంలో అత్యధికంగా 76 శాతం డిజిటల్ పూర్తయిందని అత్యల్పంగా సరూర్ నగర్ సర్కిల్లో 23 శాతం పూర్తయిందన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో హెల్ప్ డిస్క్ లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఓటర్లు హెల్ప్ డిస్క్ లొ ఎనిమిరేషన్ ఫారాలు అందించవచ్చు అన్నారు. ఇప్పటికీ ఎవరైనా తీసుకొని వాళ్ళు ఉంటే ఎనిమిరేషన్ ఫామ్ లు తీసుకోవాలన్నారు. ఎనిమిరేషన్ ఫామ్ లు నింపడంలో బిఎల్వోలు సహాయం చేస్తారన్నారు. కావున ఓటర్లు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. నేడు ఆదివారమైన అన్ని పోలింగ్ కేంద్రాల్లో బిఎల్వోలు సూపర్వైజర్లు ఏఈఆర్వోలు ఉదయం నుంచి అందుబాటులో ఉంటారన్నారు. కాబట్టి ఓటర్లు అందరూ కూడా ఎనిమిరేషన్ ఫారాలు సమర్పించాలని ఆర్డిఓ కోరారు. ఒకవేళ ఒక వ్యక్తికి రెండు చోట్ల ఎక్కడైనా ఓటు హక్కులు ఉంటే ప్రజా ప్రాతినిధ్య చట్టం ప్రకారం జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఎవరైనా సరే ఎనిమిరేనేషన్ ఫారాలు సమర్పించకుంటే వారి ఓటు డ్రాఫ్ట్ నోటిఫికేషన్ లో రాదని వారి ఓటు లేనట్టేనని స్పష్టం చేశారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ మంత్రి కొప్పుల





**ధర్మపురి, జులై 18, :** ధర్మపురి మండలం పరిధిలోని నేరెల్ల గ్రామంలో ఇటీవల వివిధ కారణాలతో మరణించిన పలువురి మృతుల కుటుంబ సభ్యులను శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. గ్రామానికి చెందిన గౌరి గంగన్న, జాజాల రాజనర్సు, కోర మల్లయ్య, మదిరె గణేష్, పులిసె నరేష్, దుసమూడి దుబ్బయ్య, మంద నరేష్ ఇటీవలే కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నేరెల్ల గ్రామంలోని వారి నివాసాలకు వెళ్లి, మృతుల చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయా కుటుంబ సభ్యులను ఓదార్చుతూ వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కష్టసమయంలో కుటుంబ సభ్యులందరూ ధైర్యంగా ఉండాలని, తాను ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటానని కొప్పుల ఈశ్వర్ భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో మాజీ మంత్రితో పాటు స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్ కు సమాచారం ఇవ్వాలి

### పెద్దపల్లి షీ టీమ్ షీ టీమ్ మెంబర్ స్నేహలత



**గోదావరిఖని క్రైమ్ :** ఆన్లైన్ మోసాలకు గురైతే 1930 నంబర్ కు సమాచారం ఇవ్వాలని పెద్దపల్లి షీ టీమ్ షీ టీమ్ మెంబర్ స్నేహలత సూచించారు. శనివారం రామగుండం సిపి ఆదేశాల మేరకు జెడ్పిహెచ్ఎస్ హై స్కూల్ టిటిఎస్ ఎన్టిపిసిలో జరిగే ఉపాధ్యాయుల ట్రైనింగ్ లో షీ టీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా షీ టీమ్ మెంబర్ స్నేహలత మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ఎలా ఉండాలి, పోక్సో యాక్ట్ గురించి, సోషల్ మీడియా ప్రభావం పిల్లలపై ఎలా ఉంది అని వివరించారు. మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలు మరియు యాంటీ డ్రగ్స్ గురించి సూచనలు చేశారు. మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో, కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా నిఘా ఉంచుతుందని తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్ కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ బారిన పడుతున్నారని, వాటి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 లేదా 112 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ జయరాం, ఉపాధ్యాయులు, షీ టీమ్ సభ్యులు సురేష్ పాల్గొన్నారు.

## పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి

### ఎంపీ గడ్డం వంశీకృష్ణకి వినతి పత్రం ఇచ్చిన డివైఎఫ్ఐ జిల్లా నాయకులు




**గోదావరిఖని టౌన్ :** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయాలని శనివారం పెద్దపల్లి జిల్లా పార్లమెంటు సభ్యులు గడ్డం వంశీకృష్ణ కి డివైఎఫ్ఐ యువజన సంఘం జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ జిల్లా నాయకులు మొగిలిచర్ల సురేష్, వీర సూర్య వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ మాట్లాడుతూ రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇంటర్ డిగ్రీ మరియు మెడికల్ కళాశాలతో పాటు త్వరలో నర్సింగ్ కాలేజీ కూడా ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ పారిశ్రామిక ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలంటే ఇక్కడ ప్రధాన వనరులైన బొగ్గు నిక్షేపాలు అధికంగా ఉన్న ఈ ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల అందుబాటులోకి వస్తే ఇక్కడ ఎంతో మంది విద్యార్థులకు మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యను పూర్తి చేసి అనంతరం ఇదే ప్రాంతంలో ఎన్నో ఉద్యోగ అవకాశాలు కూడా వస్తాయని తద్వారా ఈ ప్రాంతం అభివృద్ధి మరింత ముందుకు వెళుతుందని వారు ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. అంతే కాకుండా చాలామంది విద్యార్థులు వారి ఆర్థిక ఇబ్బందుల వల్ల దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునే స్తోమత లేక ప్రత్యామ్నాయ కోర్సులను తీసుకొని చదువుకుంటు న్నారన్నారు. కాబట్టి ఇక్కడి పారిశ్రామిక ప్రాంత పరిశ్రమలను దృష్టిలో ఉంచుకొని మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాలను అందుబాటులోకి తీసుకువస్తే ఎంతోమంది ఇక్కడి విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తును కల్పించిన వారు అవుతారని ఈ అంశం పైన వచ్చే పార్లమెంటు సమావేశంలో కూడా ప్రస్తావించాలని నాయకులు ఎంపీ కి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఎంపీ కచ్చితంగా ఈ పారిశ్రామిక ప్రాంతంలో మైనింగ్ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటుకు తన వంతుగా కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.

# చలో యువ సంగ్రామ సదస్సుకు గూడెం వెంటే గులాబీ తమ్ముళ్లు

● యువ సంగ్రామ సదస్సుకు కదిలిన పటాన్ చేరు గులాబీ నాయకులు కార్యకర్తలు ● ఎమ్మెల్యే జిఎంఆర్ నాయకత్వంలో 1200 వందల వాహనాల్లో తరలిన గులాబీ శ్రేణులు ● జెండా ఊపి ర్యాలీ ప్రారంభించిన ఎమ్మెల్యే జిఎంఆర్ ● పల్లెలు, పట్టణాల నుండి కదం తొక్కిన నిరుద్యోగులు, బిఆర్ఎస్ కార్యకర్తలు ● నిరుద్యోగుల గొంతు కోసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయి ● పటాన్ చేరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి




**సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో నిరుద్యోగ యువతకు లక్షల ఉద్యోగాలు ఇస్తామంటూ యూత్ డిక్లరేషన్ ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు జాబ్ క్యాలెండర్ విడుదల చేయమంటే ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేస్తోందని, త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడంతో పాటు 2028 ఎన్నికల్లో తిరిగి గులాబీ జెండా ఎగరడం ఖాయమని పటాన్ చేరు శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) ఆధ్వర్యంలో హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియం వేదికగా ఏర్పాటు చేసిన యువ సంగ్రామ సదస్సుకు పటాన్ చేరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృతంలో 1200 వందల వాహనాల్లో గులాబీ శ్రేణులు బయలుదేరి వెళ్లాయి. శనివారం ఉదయం పటాన్ చేరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ర్యాలీని జి ఎం ఆర్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పటాన్ చేరు వీధుల గుండా ఓఆర్ఆర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని స్వయానా కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు ప్రియాంక గాంధీ 2023 లో సరూర్ నగర్ స్టేడియం వేదికగా యూత్ డిక్లరేషన్ ప్రకటించారని అన్నారు. కాంగ్రెస పార్టీ ప్రకటనను నమ్మి యువత, నిరుద్యోగులు ఓటు వేసి అధికారం అప్పగించి రెండున్నర సంవత్సరాలు గడుస్తున్న, జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఓటు కొట్టు జాబ్ పట్టు అని ప్రగల్బాలు పలికిన సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ఉద్యోగాలు ఏవని ప్రశ్నిస్తున్న నిరుద్యోగులను ఎండ్రిన్ తాగి చావాలంటూ వ్యాఖ్యలు చేయడం ప్రభుత్వ దురాహంకారానికి అర్థం పడుతుందని విమర్శించారు. జాబులు నింపడంలో విఫలమైనా రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ కి సుట్ కేసులు పంపడంలో గోల్డ్ మెడల్ సాధిస్తున్నారని అన్నారు. అరచేతిలో స్వర్గం చూపించి అందలమెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి.. ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర పడ్డాయని. 2028లో తిరిగి కెసిఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. యువత, విద్యార్థి, నిరుద్యోగులకు సువర్ణ యుగం రాబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువత, విద్యార్థి, మహిళ, కార్మిక విభాగాల ప్రతినిధులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

● గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి ● ప్రోటోకాల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి ● మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్‌ను ఖచ్చితంగా అమలు చేయాలి ● వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా పార్కింగ్ ప్రణాళిక రూపొందించాలి ● అంజనాపురంలో ముఖ్యమంత్రి పర్యటన సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం ప్రతి నిధి, జూలై 18:** గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఖమ్మం జిల్లాకు విచ్చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. వైరా నియోజకవర్గం కొణిజెర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విచ్చేయనున్న సందర్భంగా పర్యటన ఏర్పాట్లు సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, ఇతర ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శనివారం పరిశీలించి గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ, సంబంధిత శాఖల అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ కార్యక్రమంలో ప్రోటోకాల్‌కు అనుగుణంగా సీటింగ్ ఏర్పాట్లు చేయాలని ప్రతి గ్యాలరీకి స్పష్టమైన గుర్తింపు బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేయాలని వీఐపీ పాస్‌లను అవసరానికి మించి జారీ చేయరాదని స్పష్టం చేశారు. సభా వేదికను సుమారు 100 మంది బరువును తట్టుకునే విధంగా నిర్మించాలని అయితే ప్రోటోకాల్ ప్రకారం డయాస్‌పై సీట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మినిట్ టు మినిట్ కార్యక్రమ షెడ్యూల్ ను ముందుగానే సిద్ధం చేసి ప్రతి శాఖ అదే ప్రకారం బాధ్యతలు నిర్వహించేలా చూడాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పోలీసు శాఖ అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని, హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రాకపోకల మార్గాలు, పార్కింగ్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. మీడియా, అధికారులు, వీఐపీలు, వీవీఐపీలకు వేర్వేరు ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేయాలని సభా ప్రాంగణంలో అవసరమైన బారికేడింగ్‌ను పకడ్బందీగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వ వాహనాలు, వీఐపీ వాహనాలు, ఇతర వాహనాలకు వేర్వేరుగా పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేయాలని సూచించారు. గోద్రెజ్ సంస్థ తరఫున కార్యక్రమంలో ప్రసంగించే ప్రతినిధి వివరాలను ముందు గానే ఖరారు చేసి సంబంధిత అధికారులకు తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో ఆడియో, వీడియో ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ వీడియోతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన వీడియో లను కార్యక్రమంలో ప్రదర్శించే అంశాన్ని రెవెన్యూ డివిజనల్ అధికారి తుది నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ప్రారంభోత్సవ సభకు హాజరయ్యేవారందరికీ స్పష్టంగా కనిపించేలా అవసరమైన ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సభా ప్రాంగణంలో పారిశుద్ధ్య నిర్వహణను జిల్లా పంచాయతీ అధికారి నిరంతరం పర్యవేక్షించాలని ముఖ్యమంత్రి మంత్రులకు అందించే ఆహార నాణ్యతను ఆహార తనిఖీ అధికారి స్వయంగా తనిఖీ చేసి ధృవీకరించాలని ఆదేశించారు. కార్యక్రమానికి అవసరమైన సురక్షిత త్రాగునీటినీ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యనిర్వాహక ఇంజనీర్ సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రోటోకాల్‌కు అనుగుణంగా వైద్యులు, పారామెడికల్ సిబ్బంది, అత్యవసర వైద్య బృందాలు, అంబులెన్స్‌లు, అవసరమైన వైద్య పరికరాలు సిద్ధంగా ఉండేలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమం అంతటా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా తగినంత ఇంధనంతో స్టాండ్‌బై జనరేటర్లను కూడా సిద్ధంగా ఉంచాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులతో అన్ని శాఖల అధికారులు నిరంతరం సమన్వయం చేసుకుంటూ తమకు అప్పగించిన బాధ్యతలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్, పోలీసు అధికారులు, ఆర్ అండ్ బి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముహమ్మద్ ముజాహిద్, డివైఎస్ఓ సునీల్ రెడ్డి, ఫుడ్ సేఫ్టీ అధికారి, డీపీఓ రాంబాబు, ఉద్యానవన శాఖ అధికారి అనిత, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, గోద్రెజ్ అగ్రోవెట్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికలు రూపొందించాలి

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుక




**కామారెడ్డి, జూలై 18:** ఎల్ నినో కారణంగా రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ప్రణాళికల రూపకల్పనకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సూచించారు. శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, సాగునీరు, విద్యుత్ రంగాల్లో తీసుకోవలసిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ నెల 20న జిల్లా ఇంచార్జి మంత్రి నేతృత్వంలో నిర్వహించే ఉమ్మడి జిల్లా సమావేశంలో ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులపై చర్చించి, ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించాలని సూచించారు. ప్రస్తుత ప్రతికూల పరిస్థితుల్లో అవసరమైన చర్యలు తీసుకోవడానికి అన్ని శాఖలు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎక్కడా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తగిన చర్యలు తీసుకోవాలని, ప్రజలు నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించాలని, విద్యుత్ కోతలు లేకుండా నిరంతర విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, డిఎంహెచ్వో వెంకట్, డిప్యూటీ కలెక్టర్ రవితేజ, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి , జిల్లా సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## చికిత్స కోసం మూడు లక్షలు



**హైదరాబాద్ (తారజ్యోతి):** హిమాయత్ నగర్ డివిజన్‌కి చెందిన గాంధీ కుటీర్ నివాసి మంచాల అచ్చమ్మ చికిత్స కోసం మూడు లక్షల రూపాయల లెటర్ ఆఫ్ క్రెడిట్ ఖైరతాబాద్ శాసనసభ్యులు దానం నాగేందర్ మరియు హిమాయత్ నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్ గౌడ్ చొరవతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంఆర్ఎఫ్ నిధి ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి. రామన్ గౌడ్, జ్ఞానేశ్వర్, మహేష్,ఖ్గుఎఱ, తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 2026--27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులలో ప్రవేశాలు

**హైదరాబాద్ (తారజ్యోతి):** తెలంగాణ రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాలలో 2026--27 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులలో ప్రవేశాల కోసం నిర్వహించిన -2026 ప్రవేశ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక (ప్రొవిజనల్) కీని అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ౧+జూ+జు--2026 కన్వీనర్ ఆచార్య రాజేందర్ కట్ల ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ప్రాథమిక కీపై అభ్యంతరాలు లేదా సందేహాలు ఉంటే జూలై 20వ తేదీ మధ్యాహ్నం 1.40 గంటలలోపు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ప్రతి ప్రశ్నకు రూ.200/- (రెండు వందల రూపాయలు మాత్రమే) రుసుము చెల్లించి అభ్యంతరాలను సమర్పించవచ్చని, నిర్ణీత గడువు అనంతరం అందిన అభ్యంతరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ పరిగణనలోకి తీసుకోబడవని ఆయన స్పష్టం చేశారు.

## హోటళ్లపై అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు దాడులు



**కామారెడ్డి ప్రతినిధి,** కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి ముకుంద రెడ్డి, ఆదేశాల మేరకు కామారెడ్డి మున్సిపాలిట పరిధి లోని హోటళ్లపై అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా డిగ్రీ కాలేజ్ గ్రౌండ్ ఎదురుగాగల లక్ష్మీ మెస్ నందు అనుమతి లేకుండా మద్యం తాగిపిస్తూ మెస్ నడుపుతున్నటువంటి వ్యక్తి లింబయోల దిలీప్ రెడ్డి పై కేసు నమోదు చేయడం జరిగింది. అదేవిధంగా కామారెడ్డి మున్సిపాలిటీ లోని హోటల్లో, మెస్‌లలో, దాబాల యందు అనుమతి లేకుండా మద్యం విక్రయాలు జరిగినా మద్యం సేవించుటకు అనుమతించిన కేసులు నమోదు చేయబడతాయి అని ఎటువంటి సమాచారం ఉన్న మాకు తెలియజేయాలని ఎక్సైజ్ సిఐ సంపత్ కృష్ణ తెలిపారు ఈ దాడులలో సీఐ సంపత్ కృష్ణ, ఎస్సై విక్రంకుమార్, హెడ్ కానిస్టేబుల్ ఫరీద్ మరియు కానిస్టేబుల్స్ రాజు, దినేష్ లు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు సమగ్ర చర్యలు చేపట్టాలి

### పిహెచ్‌సీ వైద్యాధికారులతో డీఎంహెచ్‌ఓ డాక్టర్ జె వెంకట్ వీడియో కాన్ఫరెన్స్



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, :** కామారెడ్డి జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణ, ప్రజారోగ్య కార్యక్రమాల సమర్థవంతమైన అమలు, క్షేత్రస్థాయి ఆరోగ్య సేవలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకట్ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ, ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరం, డయేరియా మరియు ఇతర సీజనల్ వ్యాధుల కేసులను ప్రారంభ దశలోనే గుర్తించాలని ఆదేశించారు. గుర్తించిన కేసులకు వెంటనే చికిత్స అందించడంతో పాటు అవసరమైన నివారణ చర్యలు చేపట్టాలని, సీజనల్ వ్యాధుల నివారణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సినేషన్‌ను 100 శాతం పూర్తి చేయాలి, హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని 100 శాతం పూర్తి చేయాలని డీఎంహెచ్‌ఓ ఆదేశించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు మత పెద్దలు, కుల పెద్దలు ప్రజా ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. హెచ్‌పీవీ వ్యాక్సిన్ సురక్షితమైనదని, బాలికలు, మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ఇది ఎంతో ఉపయోగకరమని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రతి అర్హత కలిగిన బాలికకు వ్యాక్సినేషన్ అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి పిహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య శిబిరాలు, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన మందులు అందించడంతో పాటు వ్యాధులను గుర్తించి తగిన మెరుగైన చికిత్స అందాలని తెలిపారు.

## ఎస్ఐఆర్ పై బిజెపి నాయకులతో జోనల్ కన్వీనర్ సమీక్ష



**బెజ్జెంకి, జూలై18:** సిద్దిపేట జిల్లా బెజ్జెంకి మండలం గుగ్గిళ్ళలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై బిజేపి జోనల్ కన్వీనర్ ఆంటోనీ రెడ్డి శనివారం అధికారులు, పార్టీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇప్పటికే ఓటర్లుగా ఉన్నవాళ్ళు తమ వివరాలను పరిశీలించి సవరణలు చేసుకోవడం ప్రతీ పౌరుని బాధ్యతని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరి ఓటు అత్యంత విలువైనదని పేర్కొంటూ, ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ఎస్ఐఆర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అవగాహన కల్పించి అర్హులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. బీజేపీ మండల అధ్యక్షుడు కొలిపాక రాజు, నియోజకవర్గ బీఎల్ఏ-1 ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివేద మహిపాల్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు రంగు భాస్కరాచారి, సర్పంచ్ గుగ్గిల మల్లయ్య, బూత్ అధ్యక్షులు తుమ్మ రాజు, చాప్యల సాయి రాము, బిఎల్ఏ2 పొలావెని వెంకట్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జమలాపురం గుడికి విరాళం ఇచ్చిన సర్పంచ్

### మానవత్వాన్ని చాటుకున్న సర్పంచ్ గోవర్ధన్ రెడ్డి



**మధిర ప్రతినిధి, జూలై 18:** మధిర నియోజకవర్గ ఎర్రుపాలెం మండలం తిరుపతిగా ప్రసిద్ధి చెందిన జమలాపురం లో నిర్వహించిన, గజూస్తం కార్యక్రమానికి శనివారం నాడు లక్ష రూపాయలు విరాళం అందజేశారు, వెంకటాపురం గ్రామం ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ సంక్షేమ కార్యక్రమాలు చేపడుతూ, ఆకలి అంటే, కడుపునిండా అన్నం పెట్టటంలో కానీ, ఆపద అంటే, సహాయం చేయటంలో కానీ, ఏ అవసరం వచ్చిన నేను ఉన్నాను అంటూ ప్రతి పేదవాడికి ఎను దండుగా ఉండే వ్యక్తి, మన బొగ్గుల గోవర్ధన్ రెడ్డి ఎవరు చనిపోయిన, ఎవరు పుట్టిన, ప్రతి మానవుడికి ఎప్పుడు సహాయం అందించే గొప్ప మనసున్న మారాజు వెంకటాపురం గ్రామ సర్పంచ్ రెడ్డి అలాంటి వ్యక్తి నిండు నూరేళ్లు సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుని మనస్ఫూర్తిగా ప్రజలు కోరుకుంటున్నారు.

# వర్షాలు తక్కువ రైతులు మెట్ట పంటల వైపు దృష్టి సారించాలి

● శాస్త్రవేత్తల సూచనల ప్రకారం సాగు విధానాలు మార్చుకోవాలి ● కూసుమంచి మండల పర్యటనలో తెలంగాణ రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ● రూ.4.61 కోట్లతో ప్రగతి పనులకు శంకుస్థాపన.. చెక్కుల పంపిణీ





**ఖమ్మం ప్రతి నిధి, జూలై 18:** ఎల్ నినో ప్రభావం వల్ల ఈ ఏడాది వర్షాలు తక్కువగా నమోదవుతాయని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారని ఈ పరిస్థితుల్లో రైతాంగం సాంప్రదాయ సాగు మొండిపట్టు వీడి మారుతున్న ప్రకృతి సవాళ్లకు అనుగుణంగా అప్రమత్తం కావాలని అధిక నీటి వినియోగం ఉండే పంటల జోలికి వెళ్లకుండా తక్కువ నీటి అవసరాలతో చేతికొచ్చే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపే దృష్టి సారించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ తో కలిసి విస్తృతంగా పర్యటించారు. మండల పర్యటనలో భాగంగా మంత్రి పలు చోట్ల శంకుస్థాపనలు చేశారు. మల్లాయిగూడెంలో రూ. 2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ. 20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి భూమిపూజ చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ. 1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించే బీటీ రోడ్డు పనులకు అగ్రహారంలో రూ. 20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి శంకుస్థాపనలు చేశారు. అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు మంత్రి చేతుల మీదుగా సంక్షేమ చెక్కుల పంపిణీ జరిగింది. మండల వ్యాప్తంగా 66 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న 111 మంది బాధితులకు రూ. 35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను మంత్రి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాలను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షపాతి అని ఇప్పటికే రైతు భరోసా అందించి అన్నదాతలకు అండగా నిలిచామని స్పష్టం చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా శాస్త్రవేత్తల సూచనలను పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవడం అత్యంత ఆవశ్యకమని అన్నారు.ప్రజాప్రభుత్వం పేదవారికి అండగా పనిచేస్తున్నదని మంత్రి తెలిపారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డుల జారీ చేశామన్నారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ళు ఇచ్చామని, రెండో విడత ఇందిరమ్మ ఇళ్ళు త్వరలో ఇస్తామని, మూడో, నాలుగో విడతల ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తామని, అర్హులైన ప్రతిఒక్క కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ళు వస్తాయని మంత్రి అన్నారు. రైతు భరోసా ఎకరాకు 6 వేలు రైతుల ఖాతాల్లో జమచేశామన్నారు. రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజలకు కావాల్సిన అన్ని మౌళిక వసతుల కల్పన చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, హౌజింగ్ పిడి శ్రీనివాస్, కూసుమంచి మండల తహసీల్దార్ సైదులు, ఎంపిడివో సిలార్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ఛాత్రూన్‌కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్







**ఖమ్మం ప్రతినిధి, జూలై 18:** భారతదేశ యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర (బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా చేపట్టిన ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమంలో భాగంగా ఏ ఐ సి సి ఆదేశానుసారం టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏ ఐ సి సి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల పిలుపుమేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన నిరాహారదీక్ష కార్యక్రమం నిర్వహించనైనది.ముందుగా నిరాహార దీక్షలో కూర్చున్న నూతి సత్యనారాయణ గౌడ్ కు దండ అలంకరించి సంఘీభావం తెలిపిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, అదే విధంగా సంఘీభావంగా దీక్షలో కూర్చున్న వారికి ఖమ్మం కార్పొరేషన్ అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,శాసనమండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, శాసనసభ మాజి సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, జిల్లా ఆర్ టి ఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న లు సంఘీభావం తెలిపారు. అదే విధంగా ఈ దీక్షలో నూతి సత్యనారాయణ గౌడ్ కు సంఘీభావంగా దీక్షలో కూర్చున్న జిల్లా అనుబంధ సంఘ అధ్యక్షులు కొత్తా సీతారాములు, దొబ్బల సౌజన్య,వేజండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, సయ్యద్ హుస్సేన్, విప్లవ కుమార్, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు కర్నాటి రామారావు,కిలారు అనిల్ కుమార్, బచ్చలకూర నాగరాజు, మూడుముంతల గంగరాజు యాదవ్, దామా స్వరూప,ప్రభావతి రెడ్డి,గాదెల ఝూన్సీ, శ్రీలత,శ్రీనివాస్ యాదవ్,వేల్పుల మురళి,అన్నపూర్ణ, లక్ష్మీ తదితరులు దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ భారతదేశ యువత పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేంద్ర (బీజేపీ) ప్రభుత్వానికి వ్యతిరేకంగా లోక్ సభ పక్షనేత రాహుల్ గాంధీ అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశ వ్యాప్తంగా తీసుకున్న ఛాత్రూన్ కి గూంజ్ కార్యక్రమం, టి పి సి సి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఏ ఐ సి సి ఇంచార్జి మీనాక్షి నటరాజన్ ల పిలుపు మేరకు నిర్వహించామని అదే విధంగా నీట్ పేపర్ లో లీకేజీ లు ఇది మొదటిసారి కాదని ఇంతకు ముందు కూడా జరిగిందని ఈ లీకేజి కారణంగా ఎంతో మంది విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర మనోవేదనకు గురయ్యారని, విద్యార్థుల ఆత్మహత్య చేసుకొన్నారని అదే విధంగా కేంద్ర (బీ జె పి) ప్రభుత్వం అనేక సందర్భాలలో రాజ్యాంగాన్ని ఉల్లంఘించారని ప్రజలు గమనిస్తున్నారని రాబోవు రోజుల్లో ప్రజలు వారికి తగిన గుణపాఠం చెప్తారని అన్నారు. అనంతరం సాయంత్రం 04.00 గంటలకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ కు నిమ్మరసం ఇచ్చి విరమింపజేసిన సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్,శాసనసభ మాజీ సభ్యులు కొండబాల కోటేశ్వరరావు,పులిపాటి వెంకయ్య లు. అదే కార్యక్రమ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్. ఈ కార్యక్రమంలో వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీ కోశాధికారి పులిపాటి వెంకయ్య, సహెలా జావేద్, జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకులు రంగా జనార్ధన్, వనం ప్రదీప్త చక్రవర్తి(బాబు), మదు పల్లి భాస్కర్ గౌడ్,ప్రతిభారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, బ్లాక్ మండల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, నగర కాంగ్రెస్ కమిటి సభ్యులు ,కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల మంజూరు

**మంత్రి అడ్లూరి కి ధర్మపురి ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపిన చైర్పర్సన్ వేముల నాగలక్ష్మీ**





**ధర్మపురి, జులై 18, :** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల మంజూరు చేసిన రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కి ధర్మపురి ప్రజల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు చైర్పర్సన్ వేముల నాగలక్ష్మీ తెలిపారు. శనివారం ధర్మపురి మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిల్ముల లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ధర్మపురి ప్రాంత ప్రజల మూడు దశాబ్దాల చిరకాల ఆకాంక్ష అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక చొరవతో ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ధర్మపురిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 29 టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టుల ఏర్పాటుకు ఆమోదం లభించడం ఎంతో సంతోషకరమని పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ వేముల నాగలక్ష్మీ పేర్కొన్నారు. ఈ నిర్ణయానికి సహకరించిన రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి కి, రాష్ట్ర మంత్రివర్గానికి, ముఖ్యంగా ధర్మపురి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ధర్మపురి ప్రజల తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చైర్పర్సన్ నాగలక్ష్మీ పేర్కొన్నారు. అదేవిధంగా, ధర్మపురి ప్రాంతంలో రూ.200 కోట్ల వ్యయంతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం, తెలుగు-సంస్కృత-ఆంధ్ర కళాశాల పునప్రారంభం, ఐటీఐ కళాశాల అభివృద్ధి వంటి విద్యా రంగానికి సంబంధించిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముందుకు తీసుకెళ్తున్నారని ఆమె కొనియాడారు. విద్యాభివృద్ధికి విశేష ప్రాధాన్యత ఇస్తూ ధర్మపురి భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కృషి చేస్తున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కి ఈ ప్రాంత ప్రజలు ఎల్లప్పుడూ రుణపడి ఉంటారని నాగలక్ష్మీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ నాయకులు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 9న గచ్చిబౌలి స్టేడియంలో 'రన్ ఫర్ ఎస్ఎంఎ--2026'




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి :** స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఏ)పై అవగాహన పెంపొందించేందుకు క్యూర్ ఎస్ఎంఏ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'రన్ ఫర్ ఎస్ఎంఏ--2026' నాలుగో ఎడిషన్ ఆగస్టు 9న గచ్చిబౌలి స్టేడియంలో జరగనుంది. ఈ కార్యక్రమానికి మద్దతుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఐపీఎస్ శనివారం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో 'రన్ ఫర్ ఎస్ఎంఏ--2026' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సీనియర్ జెనెటిసిస్ట్ డాక్టర్ రాధా రమా దేవి, నిమ్స్ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ సూర్యప్రభ, సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ సీఈఓ నవేద్ ఆలం ఖాన్, క్యూర్ ఎస్ఎంఏ ఇండియా సహ వ్యవస్థాపకులు శ్రీలక్ష్మి నలం, అర్చన పాండా, మైక్రోసాఫ్ట్ ప్రతినిధి విజయ్ వావిలాలతో పాటు వైద్య, పరిశోధనా రంగ నిపుణులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్యూర్ ఎస్ఎంఏ ఇండియా సహ వ్యవస్థాపకురాలు, ట్రస్టీ శ్రీలక్ష్మి నలం మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఆగస్టును ఎస్ఎంఏ అవగాహన మాసంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ రన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. 21 కిలోమీటర్లు, 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల టైమ్డ్ రన్‌లతో పాటు 5 కిలోమీటర్ల నాన్-టైమ్డ్ రన్ కూడా నిర్వహించనున్నట్లు చెప్పారు. పాల్గొనే ప్రతి ఒక్కరికి టీ-షర్ట్, మెడల్, పాల్గొన్నట్లు ధ్రువీకరణ పత్రం అందజేస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు, కార్పొరేట్ ఉద్యోగులు, వైద్య నిపుణులు, ఎస్ఎంఏ బాధిత కుటుంబాలు, సాధారణ ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారని తెలిపారు. అరుదైన జన్యుపరమైన వ్యాధి అయిన స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీపై ప్రజల్లో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. రన్‌లో పాల్గొనదలిచిన వారు ముందస్తుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాల కోసం 8885004858 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

## విగ్రహాలకు ముసుగులు కప్పి రాజకీయం చేస్తే జైలుకు పంపుతా: ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**తిమ్మాపూర్, జూలై18:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలకేంద్రంలో నెలకొల్పిన బిఆర్ అంబేడ్కర్, బాబు జగ్జీవన్ రాం విగ్రహాలకున్న ముసుగులను ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య శనివారం ఆవిష్కరించారు.అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ...విగ్రహాల ఆవిష్కరణకై ఏడాది క్రితం మండలంలోని అన్ని పార్టీలు ఐక్యంగా ఏర్పడి నిరాహార దీక్ష చేస్తే రాష్ట్ర రవాణా శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే మాటతో దీక్షను విరమించి నేడు విగ్రహాలను ఆవిష్కరించడం జరిగిందన్నారు. ఆవిష్కరణకు అనుమతిచ్చిన ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి,మంత్రి పొన్నం, ఎమ్మెల్యే కవ్వంపల్లికి కృతజ్ఞతలు తెలుపుతూ ఎవరైనా నేటి నుంచి విగ్రహలకు ముసుగులు కప్పి రాజకీయాలు చేస్తే వాళ్ళను ఎస్సీ, ఎస్టీ కమిషన్ తరపున జైలుకు పంపిస్తానని వెంకటయ్య హెచ్చరించారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు లక్ష్మీనారాయణ, అంబేద్కర్ సంఘం నాయకులు వంతడుపుల సంపత్, ఆంజనేయులు, నాయకులు సుగుర్తి జగదీశ్వర చారి, వడ్లూరి శంకర్, సంఘపట్ల మల్లేశం, బోయిన తిరుపతి, మేకల మహేష్, కోయడం మురళి, నగునూరి వంశీ, తాళ్లపల్లి నందకిషోర్, ఎలకపల్లి పరశురాములు, పాశం అశోక్ రెడ్డి, మేకల సునీల్, సముద్రాల మల్లేష్ తదితరులు విగ్రహాల ఆవిష్కరణలో పాల్గొన్నారు.

## 22 వార్డులో శుభ్రత పై ప్రత్యేక దృష్టి కౌన్సిలర్ నాగార్జున



**మధిర ప్రతినిధి, జూలై 18:** పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మధిర 22వ వార్డు కౌన్సిలర్ దారా నాగార్జున తనదైన శైలిలో స్పందించారు. పట్టణంలోని శనివారం నాడు, రైల్వే స్టేషన్ నుండి మసీదు రోడ్డు మార్గంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగి, ప్రయాణికులకు స్థానికులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయన్న సమాచారం మేరకు ఆయన వెంటనే రంగంలోకి దిగారు.మున్సిపల్ సిబ్బందితో జవాన్ నరేష కలిసి యుద్ధ ప్రాతిపదికన ఆ ప్రాంతంలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను ఆయన తొలగింపజేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో మొక్కల తొలగింపుతో రహదారి విశాలంగా మారడమే కాకుండా, దోమల బెడద నుంచి స్థానికులకు ఉపశమనం లభించింది.ప్రజా సమస్యల పరిష్కారంలో కౌన్సిలర్ చూపిస్తున్న చొరవ,వేగం పట్ల వార్డు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనను అభినందించారు.

## మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత రామనాథన్‌కు కృతజ్ఞతలు పట్టణ ప్రజలు



**మధిర ప్రతినిధి, జూలై 18:** మధిర అభివృద్ధి పనులు భాగంగా బ్రిడ్జి నుండి మధిర టౌన్ లోకి వచ్చే రోడ్డు మార్గంలో పనులను నిర్వహించడంతో అటుగా వెళ్ళవలసిన ప్రయాణికులు భరత్ స్కూల్ రోడ్లో (చెరుకుమల్లె వారి వీధి) రాకపోకలు కొనసాగిస్తున్న నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ భరత్ స్కూల్ రోడ్లో అండర్ డ్రైనేజ్ నిర్మాణానికి తీసిన గుంతలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు అని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సుజాత రామనాథన్ దృష్టికి తీసుకు వెళ్లడంతో వారు వెంటనే స్పందించి ఆ గుంతలకు శనివారం నాడు మరమ్మత్తులను నిర్వహిస్తున్నారు. సమస్యను తెలియజేసిన వెంటనే స్పందించి మరమ్మత్తులను చేపట్టినందుకు ప్రయాణికులు, ప్రజలు మున్సిపల్ చైర్ పర్సన్ కి ప్రత్యేకమైన కృతజ్ఞతలను తెలియజేస్తున్నారు.

## జిల్లా కోర్టులో స్పెషల్ లోక్ అదాలత్ విజయవంతం.. 51 కేసుల పరిష్కారం




**మేడ్చల్, జూలై 18 :** తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్‌లో మొత్తం 51 కేసులను పరిష్కరించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. బాల భాస్కర్ రావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు లోక్ అదాలత్‌ల ద్వారా వేగవంతమైన, ఉచిత న్యాయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్పెషల్ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యాప్తంగా 48 చెక్కు బౌన్స్ కేసులు, 3 బ్యాంకు ప్రీ-లిటిగేషన్ కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తులు, న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఈ వివరాలను వెల్లడించింది.

# లింగంపల్లిలో చిన్నారి అపహరణ కేసు ఛేదించిన చందానగర్ పోలీసులు




**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి :** లింగంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో నిద్రిస్తున్న తల్లి వద్ద నుంచి అపహరణకు గురైన మూడేళ్ల చిన్నారిని చందానగర్ పోలీసులు సురక్షితంగా రక్షించారు. అక్రమ దత్తత పేరుతో చిన్నారులను కొనుగోలు, విక్రయాలకు పాల్పడుతున్న ముఠాను ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన బధేటో గోవిందమ్మ ఉపాధి కోసం హైదరాబాద్‌కు వచ్చి లింగంపల్లి రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నంబర్-6 సమీపంలోని భవాని హోటల్ ముందు తన మూడేళ్ల కుమార్తె పుష్పరాణితో కలిసి నిద్రిస్తోంది. జూలై 16 తెల్లవారుజామున నిద్రలేచి చూడగా చిన్నారి కనిపించక పోవడంతో చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలు దర్యాప్తు ప్రారంభించాయి. ఏసీపీ సీహెచ్.వై. శ్రీనివాస్ కుమార్ పర్యవేక్షణలో చందానగర్ ఇన్‌స్పెక్టర్ ఎస్. విజయ్, నర్సింగి డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ జి. రాజేష్, సీసీఎస్ శేరిలింగంపల్లి ఇన్‌స్పెక్టర్ భూపాల్ గౌడ్ నేతృత్వంలోని బృందాలు సైబరాబాద్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తృతంగా దర్యాప్తు చేపట్టాయి. సాంకేతిక ఆధారాలు, శాస్త్రీయ పరిశోధనతో చిన్నారిని గుర్తించి సురక్షితంగా రక్షించడంతో పాటు ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. అరెస్టైన వారిలో వికారాబాద్ జిల్లా పారిగికి చెందిన కోతి శ్రీనివాస్ (36), బండ్లగూడకు చెందిన డోమ రామకృష్ణ (23), మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రైవేట్ డయాగ్నస్టిక్ కేంద్రంలో స్టాఫ్ నర్స్, ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న పలాది నవనీత (31) ఉన్నారు. దర్యాప్తులో నవనీత సంతానం లేని దంపతులకు చట్టవిరుద్ధంగా పిల్లలను సమకూర్చే ముఠాను నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఆసుపత్రుల్లో పనిచేస్తూ గర్భిణులు, నవజాత శిశువుల వివరాలను సేకరించి మధ్యవర్తుల సహాయంతో అక్రమ దత్తతలు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే రెండు అక్రమ దత్తతల వ్యవహారాల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. రెండు నెలల క్రితం రాణి అనే మహిళ అక్రమంగా చిన్నారిని సమకూర్చాలని నవనీతను సంప్రదించగా, ఆమె కోతి శ్రీనివాస్‌ను సంప్రదించి డబ్బుల కోసం చిన్నారిని అపహరించాలని సూచించినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో జూలై 16 తెల్లవారుజామున లింగంపల్లి రైల్వే స్టేషన్ వద్ద నిద్రిస్తున్న చిన్నారి పుష్పరాణిని అపహరించి మహబూబ్‌నగర్‌కు తరలించారు. అక్కడ కొనుగోలుదారునికి అప్పగించే ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో పోలీసులు దాడి చేసి చిన్నారిని రక్షించి నిందితులను అరెస్టు చేశారు. ఈ ఘటనతో అక్రమ దత్తత పేరుతో పనిచేస్తున్న బాలల అక్రమ రవాణా ముఠా బట్టబయలైందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయం, ఆర్థిక లావాదేవీలు, కొనుగోలుదారుల వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని వెల్లడించారు. చిన్నారిని సురక్షితంగా రక్షించి బాలల అక్రమ రవాణా ముఠాను ఛేదించిన చందానగర్, నర్సింగి, సీసీఎస్ శేరిలింగంపల్లి పోలీసు బృందాలను సైబరాబాద్ పోలీసు కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ అభినందించారు

## పటాన్ చేరులో ఘనంగా పూరి జగన్నాథుడి రథయాత్ర

- మూడు ఎకరాల్లో బాలాజీ, శ్రీకృష్ణుడి దేవాలయం
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా పటాన్ చేరు:** భక్తుల జయ జయ ధ్వనాల మధ్య పటాన్చెరు పట్టణంలో పూరి జగన్నాథుడి రథయాత్ర అత్యంత వైభవంగా సాగింది. పటాన్ చేరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామ స్వామి దేవాలయం వద్ద హరే రామ హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ వారి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన రథయాత్రను శాసన సభ్యుడు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బంగారు చీపురుతో రథయాత్ర మార్గాన్ని ఊడ్చి, రథాన్ని లాగి ప్రారంభించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై జగన్నాథ, బలబద్ర, సుభద్రల విగ్రహాలను అందంగా అలంకరించారు. చిన్నారులు, మహిళలు, హరే రామ హరే కృష్ణ గోల్డెన్ టెంపుల్ సభ్యులు కీర్తనలు పాడుతూ పట్టణ వీధుల గుండా రథయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పూరిలో జరిగే జగన్నాథుడి రథయాత్ర ప్రపంచంలోనే అతి పురాతనమైన హిందూ ఆధ్యాత్మిక ఉత్సవమని అన్నారు. పటాన్చెరు పట్టణంలో జగన్నాథుడి రథయాత్రను ఏర్పాటు చేయడం పట్ల ఆయన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక పటాన్చెరు నియోజకవర్గమని తెలిపారు. దేశంలోని 27 రాష్ట్రాల ప్రజలు నియోజకవర్గంలో నివసిస్తున్నారని తెలిపారు. పటాన్ చేరు డివిజన్ పరిధిలోని బంగారుగడ్డ వద్ద మూడు ఎకరాల విస్తీర్ణంలో బాలాజీ దేవాలయం, శ్రీకృష్ణుని దేవాలయం నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. భక్తులందరి సహాయ సహకారాలతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. భగవంతుడి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు శంకర్ యాదవ్, సపాన దేవ్, సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, నర్ర బిక్షపతి, పృథ్వీరాజ్, అశోక్, నర్సింలు, చంద్ర శేఖర్, మల్లేష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## బూత్ స్థాయి నుండి తెలంగాణ రక్షణ సేన పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యం

- పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కవిత





**కరీంనగర్ టౌన్, జూలై18:** తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో కరీంనగర్ జిల్లా ముఖ్య నాయకులతో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కవిత సమక్షంలో ఒక ముఖ్యమైన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రక్షణ సేన పార్టీ కమిటీల నిర్మాణం ప్రతి గ్రామంలోని బూత్ స్థాయి నుండి పటిష్టంగా జరగాలని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పార్టీ శ్రేణులు ఎల్లప్పుడూ క్షేత్రస్థాయిలో ఉంటూ నిరంతరం పోరాటాలు సాగించాలని దిశా నిర్దేశం చేశారు. కరీంనగర్ జిల్లాలో ఉన్న అన్ని రాజకీయ పార్టీలకు దీటుగా తెలంగాణ రక్షణ సేన పార్టీ అత్యంత చురుగ్గా పనిచేయాలని ఆమె ఆకాంక్షించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, పార్టీని మరింత బలోపేతం చేయడం కోసం నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లి విస్తృతస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రెస్ మీట్ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గుంజపడుగు హరిప్రసాద్, రాష్ట్ర నాయకులు లింగంపల్లి నాగరాజు, మహిళా విభాగం అధ్యక్షురాలు అంకం శివరాణి, ఆదివాసి విభాగం జిల్లా అధ్యక్షులు కుతాడి శ్రీనివాస్, మానకొండూరు నియోజకవర్గ ఇంచార్జ్ చెన్నమల్ల చైతన్య పాల్గొన్నారు. వీరితో పాటు సీనియర్ నాయకులు రంగరవేణి లక్ష్మణ్, భాసవేణి రాజేందర్, నూతి సాయి చరణ్, మ్యాక వినోద్, లింగంపల్లి శ్రీనివాస్, రాకేష్, ఎండి రజి, పూసాల పవన్, ఎండి సల్మా, ఎండి అతహార్, చింతరెడ్డి జైపాల్ రెడ్డి, జంగ అపర్ణ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహితంగా చర్లపల్లి చెరువు

**స్వచ్ఛత కార్యక్రమం.. శ్రమదానం చేసిన జైళ్ల శాఖ, ఐలా సిబ్బంది**

**హాజరైన డిప్యూటీ ఐజీ డా. డి. శ్రీనివాస్**



**మేడ్చల్, జూలై 18 :** పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని హైదరాబాద్ రేంజ్ జైళ్ల శాఖ డిప్యూటీ ఇన్స్పెక్టర్ జనరల్ డా.డి. శ్రీనివాస్ తెలిపాడు. చర్లపల్లి చెరువు వద్ద నిర్వహించిన "శ్రమదానం - స్వచ్ఛత కార్యక్రమం"లో అయన పాల్గొన్నాడు. జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ అండ్ కరెక్షనల్ సర్వీసెస్ డా. సౌమ్య మిశ్రా ఆదేశాల మేరకు "ప్లాస్టిక్ రహిత స్వచ్ఛ చర్లపల్లి చెరువు" లక్ష్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ?జైళ్ల శాఖ, హైడ్రా సాంకేతిక సహకారంతో పాటు, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన చర్లపల్లి చెరువు పునరుద్ధరణ పనుల్లో భాగంగా ఈ స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. చెర్లపల్లి కేంద్ర కారాగారం, ఖైదీల వ్యవసాయ క్షేత్రం అధికారులు, సిబ్బందితో పాటు చర్లపల్లి ఐలా బృందం శ్రమదానంలో పాల్గొని చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి, చెరువు కలుషితం కాకుండా ఉండేందుకు చర్యలు చేపట్టారు. ?ఈ కార్యక్రమంలో ఖైదీల వ్యవసాయ క్షేత్రం పర్యవేక్షణాధికారి డి. భరత్, కేంద్ర కారాగార పర్యవేక్షణాధికారి ప్రమోద్, ఐలా చైర్మన్ గోవింద్ రెడ్డి, డిప్యూటీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్ రెడ్డి, వెంకటేశం, డిప్యూటీ సూపరింటెండెంట్లు, జైలర్లు శ్రీనివాస్, రాజశేఖర్ రెడ్డి, డిప్యూటీ జైలర్లు కరీం వెంకటరెడ్డి, జైలు సిబ్బంది, ఐలా ప్రతినిధులు పాల్గొన్నారు.

## కుప్పసపల్లి గ్రామంలో మైనర్ బాలికపై అత్యాచారం కేసు ఛేదన - ముగ్గురు నిందితుల అరెస్ట్



**నల్గొండ జిల్లా ప్రతినిధి : జులై 18** హాలియా పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం. 182/2026లో మైనర్ బాలికపై అత్యాచారం, బెదిరింపు, పోక్సో చట్టం కింద నమోదైన కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు.
అరెస్టు చేసిన నిందితులు:
ఆదిముల్ల అజయ్ (25), డ్రైవర్, కుప్పసపల్లి గ్రామం. బండారు అఖిల్ (19), వ్యవసాయం, గుడిపల్లి గ్రామం. పెర్ల రమణ ఏ రమణమ్మ, కుప్పసపల్లి గ్రామం. పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితుడు ఏూ1 ఆదిముల్ల అజయ్ గ్రామ శివారులో ఒంటరిగా ఉన్న సమయంలో బాధిత మైనర్ బాలికపై రెండుసార్లు అత్యాచారానికి పాల్పడి, విషయం బయటపెడితే చంపేస్తానని బెదిరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అలాగే బండారు అఖిల్, ఏూ3 పెర్ల రమణ ఏ రమణమ్మ సహకారంతో బాధితురాలిని తన ఇంటికి పిలిపించుకుని లైంగిక దాడికి పాల్పడినట్లు, ఏూ3 రమణమ్మ బాధితురాలిని ఏూ2కు పరిచయం చేసి తన ఇంట్లో నేరం జరిగేందుకు సహకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని, గౌరవ న్యాయస్థానం ముందు హాజరుపరచగా న్యాయస్థానం వారిని రిమాండ్‌కు పంపింది. ఈ కేసును హాలియా ఎస్ఐ బి. సాయి ప్రశాంత్, హాలియా సర్కిల్ ఇన్‌చార్జి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మరియు నాగార్జునసాగర్ ఏసీపీ బి. శ్రీను నాయక్ పర్యవేక్షణలో దర్యాప్తు చేసి నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలస్తంభం: వి. జగదీశ్వర్ గౌడ్



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి :** ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి. జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శనివారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని మదీనాగూడ డివిజన్ పరిధిలోని మదీనాగూడ గ్రామం, సాయికృప అపార్ట్‌మెంట్, నైమిష అపార్ట్‌మెంట్‌లలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఆయన నియోజకవర్గ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ పేరు ఓటరు జాబితాలో సరిగా నమోదైందో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. పేరు లేకపోతే కొత్తగా నమోదు చేసుకోవాలని, వివరాల్లో మార్పులు ఉంటే సవరణ చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో ప్రతి ఓటు కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరును నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యక్షుడు నల్ల సంజీవ రెడ్డి, నాయకులు బల్లింగ్ యాదగిరి గౌడ్, వీరేందర్ గౌడ్, ఆంజనేయులు యాదవ్, రాంబాబు, సాయి యాదవ్, నాగేశ్వర్ రావు, బాలకృష్ణ, కట్ల శేఖర్ రెడ్డి, యలమంచి ఉదయ్ కిరణ్, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి శ్రీహరి గౌడ్, విష్ణు, యాదగిరి, నవీన్ యాదవ్, మనోజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కొండాపూర్‌లో ఘనంగా జగన్నాథ రథయాత్ర

**రథయాత్రను ప్రారంభించిన బండారు దత్తాత్రేయ, రవికుమార్ యాదవ్**



**రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి :** గచ్చిబౌలి ఆనంద దేవస్థానం ఆధ్వర్యంలో కొండాపూర్ డివిజన్ రోలింగ్ హిల్స్‌లో జగన్నాథ స్వామి రథయాత్రను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని రథయాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ జగన్నాథ రథయాత్ర భారతీయ సంస్కృతి, ధర్మం, సమానత్వం, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. ఈ యాత్రలో భక్తులు భక్తిశ్రద్ధలతో పాల్గొనడం ద్వారా సమాజంలో ఐక్యతా భావం మరింత బలపడుతుందన్నారు. జగన్నాథ స్వామి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు భారతీయ జనతా పార్టీ కట్టుబడి ఉందని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ చరిత్ర, ఆధ్యాత్మిక వారసత్వాన్ని పరిరక్షించేందుకు అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. అయోధ్య శ్రీరామ మందిర నిర్మాణం, కాశీ విశ్వనాథ్ ఆలయ అభివృద్ధి వంటి కార్యక్రమాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశ యువత భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను తెలుసుకుని ధర్మ పరిరక్షణతో పాటు సమాజ సేవలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. జగన్నాథ స్వామి కృపతో ప్రతి ఒక్కరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, దేవస్థానం ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నాగవరం బడి.. ప్రగతికి నడిపించు బాట!

**జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తల్లిదండ్రుల సమావేశం**

**రెండేళ్లుగా కీసర మండలంలోనే ప్రథమ స్థానం**

**అదే సరళిని కొనసాగిద్దాం: హెచ్ఎం పి.సి. రాములు**




**మేడ్చల్, జులై 18:** విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణే ధ్యేయంగా నాగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.సి. రాములు ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత రెండేళ్లుగా కీసర మండలంలోనే నాగవరం హైస్కూల్ ప్రథమ స్థానంలో ఉత్తీర్ణత సాధిస్తూ రికార్డు సృష్టిస్తోందని తెలిపాడు. ఇదే విజయ పరంపరను ముమ్ముందు కూడా కొనసాగించాలన్నాడు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందరూ సమన్వయంతో కలిసి కట్టుగా కృషి చేసినప్పుడే ఆశించిన ఫలితాలు వస్తాయని అభిప్రాయపడ్డాడు. అనంతరం విద్యార్థుల చదువు, ప్రవర్తనపై తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు చర్చించారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయ బృందం అందిస్తున్న విద్యాబోధన, చేస్తున్న కృషి బాగుందని తల్లిదండ్రులు కొనియాడారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు అరవింద్ కుమార్, మాలోత్ నాయక్, ఎ. సంధ్యారాణి, వందన, అజీజ్ అహ్మద్, రఘు, సుమతి, అర్చన, సంజయ్ రాణి, కౌసల్య, పద్మ, పాండురంగారెడ్డి, సరిత, కమల, రమా సత్యశ్రీ, గాయత్రీ సుప్రజ, విద్యా వాలంటీర్ స్వప్న, అలక, పావని, పవిత్ర, విశాలి పాల్గొన్నారు.

## ఆలివ్ షాట్స్.. ఇప్పుడిదే సరికొత్త ట్రెండ్

షాట్స్ అంటే మద్యానికి సంబంధించిన గ్లాసులే గుర్తుకొస్తాయి. కానీ ఇప్పుడో సరికొత్త ట్రెండ్ మొదలైంది. అదే ఆలివ్ ఆయిల్ షాట్స్! ఓ రెండు టేబుల్ స్పూన్ల ఆలివ్ నూనెను గుటుక్కున మింగేయడమే. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. సాక్షాత్తు కర్దాషిన్, జెన్నిఫర్ లోపెజ్ మద్దతిస్తున్న ట్రెండ్. జెన్నిఫర్‌కు ఆలివ్ ఆయిల్ మీద ఎంత నమ్మకం అంటే తన తరగని అందానికి రహస్యం బొటిక్స్, సర్జరీలు కాదు, ఆలివ్ ఆయిల్ సేవనమే అని చెబుతారు. నిజంగానే ఆలివ్ ఆయిల్‌తో చాలా ఉపయోగాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇందులో ఉండే పాలిఫినాల్స్, యాంటీ ఆక్సిడెంట్స్ చర్మ సంరక్షణకు దోహదం చేస్తాయట. గుండె నుంచి కాలేయం వరకు శరీరంలోని అన్ని అవయవాలకూ ఆలివ్ ఆయిల్ మేలు చేస్తుందనేది నిపుణుల మాట. భోజనానికీ భోజనానికీ మధ్య విరామంలో ఆలివ్ షాట్స్ తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. దీనికోసం ఎలాంటి రసాయనాలూ కలవని వర్జిన్ ఆలివ్ ఆయిల్‌ని రెండు చెంచాలు వాడాలి. అయితే, ఇలా చేయడం అందరి శరీరాలకు పడకపోవచ్చునీ, వైద్యులను సంప్రదించిన తర్వాతే ఆలివ్ షాట్స్ తీసుకోవాలనీ నిపుణులు సూచిస్తున్నారు.

# పసుపు పాలా..? పసుపు నీళ్లా..?
## ఆరోగ్యానికి ఏది బెటర్.. అసలు విషయం తెలిస్తే..



పసుపులో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి. అందుకే పసుపును ఆయుర్వేదంలో కూడా ఎక్కువగా ఉపయోగిస్తారు. వాస్తాయి.. పసుపు ఒక మసాలా దినుసు.. దీనిని పురాతన కాలం నుంచి వంటలలో ఉపయోగిస్తున్నారు. పుసుపు వివిధ జీవన ప్రక్రియలకు తోడ్పడే యాంటీ బయోటిక్, కాన్సర్ నిరోధక, ఇన్‌ఫ్లమేషన్ నిరోధించేవి, ట్యూమర్ కలుగకుండా వుండే, యాంటీ ఆక్సిడెంట్ గుణాలు.. అనేక వ్యాధులతో పోరాడటానికి, మంచి ఆరోగ్యాన్ని అంటే మొత్తం ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుంది. అయితే, పసుపు ప్రయోజనాలను పొందే విషయానికి వస్తే, రెండు ప్రసిద్ధ ఎంపికలు ఉన్నాయి.. చాలా మంది పసుపు పాలు లేదా పసుపు నీరు.. తీసుకుంటూ ఉంటారు. ఇవి రెండూ కూడా ఆరోగ్యానికి మంచిదే.. రెండు పానీయాలు చాలా ప్రయోజనాలను అందిస్తాయి.. అయితే ఏది మంచిది? దేని వల్ల ఎక్కువ ప్రయోజనాలు అందుతాయి అనే విషయాలపై తరచూ సందేహం వ్యక్తమవుతుంటుంది.. పసుపును ఎలా తీసుకున్నా ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని.. అయితే.. వ్యక్తిగత అవసరాలు.. పానీయాల నుంచి మీరు పొందాలనుకుంటున్న ఆరోగ్య ప్రయోజనాలపై మీ ఎంపిక ఆధారపడి ఉంటుందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.పసుపు పాలు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు.. శోథ నిరోధక లక్షణాలు: పసుపులో కర్కుమిన్ ఉంటుంది.. ఇది యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. పసుపు పాలు తీసుకోవడం వల్ల కీళ్లనొప్పులు, కీళ్ల వాతం ఇంకా వంటి ఇన్ఫ్లమేటరీ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇమ్యూనిటీ బూస్టర్: పసుపులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి.. ఇంకా రోగనిరోధక శక్తిని పెంచే గుణాలు ఉన్నాయి. పసుపు పాలు క్రమం తప్పకుండా తాగడం వల్ల రోగనిరోధక శక్తిని బలోపేతం చేయవచ్చు. ఇది శరీరం అంటువ్యాధులు, పలు వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. మెరుగైన జీర్ణక్రియ: పసుపు పిత్త ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. ఇది జీర్ణక్రియకు సహాయపడుతుంది. పసుపు పాలు అపానవాయువు, గ్యాస్, అజీర్ణం వంటి జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి.నిద్రను మెరుగుపరుస్తుంది : వెచ్చని పాలు శాంతపరిచే ప్రభావాన్ని కలిగి ఉంటాయి. పసుపుతో కలిపినప్పుడు, ఇది విశ్రాంతిని ప్రోత్సహిస్తుంది.. ఇంకా నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది. పసుపు నీరు తాగడం వల్ల కలిగే ప్రయోజనాలు.. నిర్విషీకరణ: పసుపు కాలేయాన్ని శుభ్రపరచడానికి, శరీరంలోని మొత్తం నిర్విషీకరణ ప్రక్రియను మెరుగుపరచడంలో సహాయపడే లక్షణాలను కలిగి ఉంది.. బరువు నియంత్రణ: జీవక్రియను నియంత్రిస్తుంది. ఇంకా వాపును తగ్గించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఆరోగ్యకరమైన చర్మం: పసుపు నీరు తాగడం వల్ల దాని యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాల వల్ల క్లియర్, గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చు. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది: పసుపు పాలు వలె, పసుపు నీరు కూడా పిత్త ఉత్పత్తిని పెంచడం, జీర్ణవ్యవస్థలో మంటను తగ్గించడం ద్వారా జీర్ణక్రియకు సహాయపడుతుంది.

# నాన్‌స్టిక్ పాత్రల్లో వంట చేస్తే ఎంత డేంజరో తెలుసా? పాత తరం పద్ధతులే బెటర్



శరీరంలోని పోషకాహార లోపాలను పూరించడం నుంచి దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడం వరకు ఆహారం కీలక పాత్ర వహిస్తుంది. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవడానికి ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్' ప్రచురించిన నివేదిక ప్రకారం.. శరీరానికి వచ్చే వ్యాధుల్లో 56 శాతం తప్పుడు ఆహార అలవాట్ల వల్లే వస్తున్నాయట. సమతుల్య ఆహారంపై మార్గదర్శకాలను కూడా ప్రచురించింది. నాన్ స్టిక్ పాత్రల్లో ఆహారం వండడం వల్ల ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఆరోగ్యం కోసం మట్టి పాత్రల్లో వండాలని సిఫార్సు చేస్తోంది. అనారోగ్యకరమైన ఆహారం శరీరంలో వివిధ వ్యాధులకు కారణమవుతుంది. అయితే మనం ఏ పాత్రలు వాడుతున్నామో, ఎలా వండుతున్నామో ఓసారి గమనించుకోవాలి. నేటి కాలంలో ప్రతి ఒక్కరి ఇళ్లలో నాన్‌స్టిక్ పాత్రల వినియోగం పెరిగిపోయింది. పాతకాలం నాటి మట్టి పాత్రల వాడకం తగ్గిపోయింది. ఆరోగ్యాన్ని పాడుచేసే నాన్‌స్టిక్ వంటసామాన్లు వంటగది నిండా ఆక్రమించాయి. కానీ నాన్ స్టిక్ పాత్రలను ఉపయోగించకుండా దూరంగా ఉండాలని సూచిస్తోంది. బదులుగా పర్యావరణ అనుకూలమైనది మట్టి కుండలలో వండాలని సిఫార్సు చేస్తుంది. అలాగే ప్రోటీన్ సప్లిమెంట్లకు కూడా దూరంగా ఉండాలని చెబుతోంది. అవి నిర్జలీకరణం, పోషకాల అసమతుల్యతకు కారణమవుతాయట. వీటివల్ల మూత్రపిండాలు కూడా దెబ్బతింటాయని పేర్కొంది. సమతుల్య ఆహారంపై దృష్టి పెట్టాలని, మట్టిపాత్రల్లో వంట చేయడం ఆరోగ్యానికి శ్రేయస్కరమని చెబుతోంది. మట్టిపాత్రల్లో వంట చేయడం వల్ల ఏంటీ ప్రయోజనం? తక్కువ నూనె మట్టి పాత్రల్లో రుచిగా వంట చేయొచ్చు. అలాగే ఆహారం సహజ రుచి అలాగే ఉంటుంది. ఆహారంలోని పోషక విలువలు కూడా కోల్పోవు. బదులుగా ఆహారంలో యాసిడ్ పరిమాణం తగ్గుతుంది. మట్టి కుండల్లో వండడం వల్ల కూడా ఆహారంలోకి హానికరమైన రసాయనాలు విడుదల కావు. ఇలాంటి ఆహారం తింటే చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు కూడా తగ్గుతాయి. నిజానికి, అధిక ఉష్ణోగ్రతల వద్ద నాన్‌స్టిక్ పాన్‌లలో వండడం వల్ల విషపదార్థాలు విడుదలవుతాయి. ఇది ఊపిరితిత్తులను దెబ్బతీస్తుంది. దీర్ఘకాలిక అనారోగ్యానికి కారణం అవుతుంది. అందుకే మట్టి కుండలలో వండాలని అలాగే స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలలో ఆహారాన్ని తినాలని సిఫార్సు చేస్తోంది. అవి ఇతర లోహ పాత్రల కంటే మన్నికైనవి. పరిశుభ్రమైనవి. పైగా శుభ్రం చేయడం కూడా చాలా సులభం. వంటేకాదు మట్టి లేదా సిరామిక్ పాత్రల్లో ఆహారాన్ని భుజించవచ్చు కూడా.

## అదీ లెక్క.. ఇది తింటే రక్తం పలుచుగా అవుతుంది.. గుండె జబ్బులు పరార్



ఈ మధ్య చిన్న వయసులోనే గుండె జబ్బులు వస్తున్నాయ్.. తక్కువ ఏజ్‌లోనే బీపీ సమస్యలు వెంటాడుతున్నాయ్. ఈ కారణాలతో రక్తం చిక్కబడుతోంది. ఆ రక్తాన్ని గుండె సరిగ్గా పంప్ చేయలేకపోతుంది. దీంతో రక్త ప్రసరణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రక్తం పలుచగా ఉంటేనే..గుండె పంప్ చేసేందుకు ఈజీ అవుతుంది. అందుకే ఈ మధ్య కాలంలో కొంతమంది సమస్యలు ఉన్నా, లేకపోయినా రక్తాన్ని పలుచన చేసే మెడిసిన్ వాడుతున్నారు. గుండె సమస్యలు, హైబీపీ వంటి సమస్యలు ఉన్నవారు.. ఇవి ఒకసారి మొదలెడితే లైఫ్ లాంగ్ వాడాల్సి ఉంటుంది. మీ లైఫ్ స్టైల్ మార్చుకోకపోతే.. జీవితం కాలం ఈ మెడిసిన్ వాడాల్సి ఉంటుంది. ప్రధానంగా తక్కువ నీరు తాగడం, ఎక్కువ ఉప్పు వినియోగం.. నూనె, నెయ్యి లాంటివి ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తం చిక్కగా అవుతుంది. ఆయిల్ లేకుండా, ఉప్పు లేకుండా.. రా ఫుడ్ ఎక్కువ తీసుకోవడం వల్ల రక్తం పలుచగా అవుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మార్నింగ్, ఈవెనింగ్ ఎక్కువ ఉడకని ఆహారానికి ప్రాధాన్యత ఇస్తూ.. మధ్యాహ్నం ఉడికిన ఫుడ్ తిన్నా అందులో ఉప్పు లేకుండా చూసుకుంటే రక్తం చిక్కబడటం ఆగుతుందని చెబుతున్నారు. ఇలా ఫాలో అయితే నెలా, రెండు నెలల తర్వాత మెడిసిన్ మానిసేనా ఇబ్బంది ఉండదని ప్రకృతి వైద్యులు మంతెన చెబుతున్నారు. ఎప్పుడైనా పండక్కి, పబ్బానికి ఉప్పు ఉన్న ఆహారం తింటే పర్లేదు కానీ.. రోజూ ఉప్పు తగినంత వేసిన ఆహారం తింటే తిప్పలు తప్పవంటున్నారు. మనిషి ఆరోగ్య వ్యవస్థను పాడు చేయడానికి ఉప్పే ప్రధాన కారణమని ఆయన అంటున్నారు. మనం తినే ఆహారమే మన హెల్త్‌నుడిపెండ్ చేస్తుందని చెబుతున్నారు.

## ఇలా చేస్తే.. పాడైపోయిన లివర్ ఒక్క దెబ్బతో శుభ్రం అవుతుంది..



మన శరీరంలో అన్నింటికంటే ఎక్కువ బాధ్యతలు నిర్వర్తించే అవయవం లివర్. మనం తినే ఎరువులు, పురుగు మందులు, కార్బైడ్ దోషాలు, మనం మింగిన మందుల్లో ఉండే కెమికల్ దోషాల్ని క్లీన్ చేసేది లివర్. అలానే వాటర్ పొల్యూషన్, ఎయిర్ పొల్యూషన్‌ని క్లియర్ చేసేది లివర్. అలాగే మన శరీరంలోని వివిధ రకాల టక్సిన్లను బ్రేక్ డౌన్ చేసి బయటకు పంపేది లివర్. ఇంకా ఎన్నో పనులు చేసే లివర్‌ను ఈ మధ్య ఇబ్బంది పెడుతున్న పెద్ద సమస్య ఫ్యాటీ లివర్. అలానే లివర్ సాగిపోవడం, గట్టిపడిపోవడం వంటి కేసులు కూడా చూస్తున్నాం. అలానే లివర్ సిర్రోసిస్ సమస్యలు కూడా ఈ మధ్య ఎక్కువగా వింటున్నాం. అవసరానికి మించి నూనె పదార్థాలు, కొవ్వు పదార్థాలు ఎక్కువ తినడం వల్ల లివర్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని.. ప్రకృతి వైద్యులు మంతెన సత్యనారాయణ రాజు తెలిపారు. లివర్‌ను రక్షించిండానికి మెడిసిన్స్ కూడా పెద్దగా ఉపయోగపడవని ఆయన చెప్పారు. మంచి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవడమే లివర్‌కు మెడిసిన్ అని చెప్పారు. లివర్‌కు సూక్ష్మ పోషకాలు కావాలని.. అవి వండిన ఆహారాల్లో ఉండవని మంతెన చెబుతున్నారు. రోజులో 60 శాతం అయినా ఉడకని ఆహారం తీసుకుంటే ఈ సమస్యల నుంచి బయట పడొచ్చని చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల విటమిన్స్, మినరల్స్ అందుతాయంటున్నారు. మధ్యాహ్నం మాత్రమే ఉడికిన ఆహారం తీసుకుని.. మార్నింగ్, ఈవెనింగ్.. జ్యూసులు, మొలకెత్తిన గింజలు, పండ్లు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇవి మీ లివర్‌ను తిరిగి హెల్దీ చేయడంలో సాయపడతాయంటున్నారు. అలానే సాయత్రం 7 లోపు డిన్నర్ కంప్లీట్ చేయడం వల్ల లివర్ తనను తాను రికవర్ చేసుకుంటుందని మంతెన చెబుతున్నారు.

## ఉదయాన్నే బ్రేక్‌ఫాస్ట్ బదులుగా వైట్‌రైస్ తింటున్నారా.? ఇది తప్పక తెలుసుకోండి.!



ఈ ఉరుకుల పరుగుల జీవితంలో పొద్దున్న లేచిన మొదలు.. నైట్ నిద్రపోయేవరకు ఎవరు ఏమి చేస్తున్నారో..? ఏ టైంకి ఏది తింటున్నారో.? ఎవ్వరికీ అర్థం కావట్లేదు. సాధారణంగా అందరూ మార్నింగ్ 10 గంటలలోపు టిఫిన్ తింటుంటే.. ఈకాలం యువత దాదాపుగా 11 గంటలకు తమ బ్రేక్‌ఫాస్ట్‌ను పూర్తి చేస్తున్నారు. సరే ఇదంతా పక్కనపెట్టండి.. ఇప్పుడంటే టిఫిన్స్ అవి ఉన్నాయ్ గానీ.. కొన్ని సంవత్సరాల క్రితం మన పూర్వీకులు టిఫిన్ చేయకుండా ఉదయాన్నే వైట్ రైస్ తిని కూలీ పనులకు వెళ్తుండేవారట. ఆసమయంలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేవు. ఇన్‌ఫ్యాక్ట్ మన కంటే..వారి శారీరిక బలమే ఎక్కువ అని చెప్పొచ్చు. అయితే ఇప్పటి జనరేషన్ టిఫిన్ బదులుగా అన్నం తింటే.. అధిక బరువు పెరుగుతారని.. అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయని చెబుతుంటారు. మరి ఇంతకీ ఉదయాన్నే అన్నం తినడం మంచిదా.? కాదా.? ఉదయాన్నే అన్నం తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. కానీ వైట్ రైస్ మోతాదు తక్కువ ఉండేలా చూసుకోవాలి. మనం పొద్దునే లేచిన వెంటనే శరీరానికి చురుకుదనం కావాలి. అలాగే శక్తి కూడా చాలా అవసరం. ఈసమయంలో బరువును కంట్రోల్ చేసుకోవాలనుకునే వారు.. మధుమేహ వ్యాధిగ్రస్తులు ఉదయం పూట అన్నం తింటే.. రక్తంలోని చక్కెర స్థాయి కంట్రోల్‌లో ఉంటుంది. అయితే ఆ మార్నింగ్ సమయంలో అన్నం మోతాదు కూడా తక్కువ ఉండేలా చూసుకోవాలి. ఉదయం పూట అన్నం మోతాదు ఎక్కువగా ఉంటే.. లేనిపోని సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఏది ఏమైనా ఆహార పదార్థం ఏదైనా.. తక్కువ మోతాదులో తినడం వల్ల ఆరోగ్యానికి మంచిది. ఆరోగ్యానికి మేలు చేస్తుందని.. ఏ ఆహారమైనా.. మోతాదుకు మించి తింటే.. లేనిపోనీ ఆరోగ్య సమస్యలు చుట్టుముడతాయి. కాగా, మీరు ఏదైనా డైట్ ఫాలో అయ్యే ముందు కచ్చితంగా మీ డాక్టర్‌ను సంప్రదించండి..పైవార్త కేవలం పలు అధ్యయనాలు ఆధారంగా ప్రచురితం చేసింది మాత్రమే.


## వార్నీ వెల్లుల్లి తొక్కలకు ఇంతుందా..? తెలిస్తే.. ఇకపై భద్రంగా దాచుకోవాల్సిందే..!



వెల్లుల్లి పొట్టులో యాంటీ ఆక్సిడెంట్లలు సమృద్ధిగా ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాని తొలగించిడంలో ఎంతో మేలు చేస్తాయి. ఇవన్నీ చర్మానికి ఎంతో మేలు చేకూరుస్తాయి. ఈ పొట్టును పేస్ట్‌లా తయారు చేసి దాంట్లో కాస్త నీళ్లు కలిసి వాడుకోవాలి. దీనిని దురద, పింపుల్స్ ఉన్నచోట రాసుకుంటే మంచి ఫలితం లభిస్తుంది. అలాగే అనారోగ్య సమస్యల బారిన పడకుండా రక్షిస్తుంది. ఇతర దీర్ఘకాలిక వ్యాధులను కూడా తొలగిస్తుంది. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టండి. తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు. అంతే కాదు ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో కూడా మేలు చేస్తాయి. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టండి. తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు. అంతే కాదు ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో కూడా మేలు చేస్తాయి. జుట్టు రాలడం లేదా తెల్ల జుట్టు సమస్యతో బాధపడుతుంటే, వెల్లుల్లి తొక్క నీరు ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టి, ఆపై ఈ నీటితో మీ జుట్టును కడగాలి. లేదా స్ప్రే బాటిల్‌లో పోసుకుని జుట్టుకు, మాడుకు బాగా స్ప్రే చేసుకోవాలి. చుండ్రు, పేండ్లు వంటి సమస్యలతో బాధపడేవారు వెల్లుల్లి పేస్ట్‌లో కొంచెం నీళు కలిపి తలకు బాగా పట్టించాలి. మరొక పద్ధతి కూడా ఉంది. వెల్లుల్లి తొక్కను వేయించి పొడి చేసి కొబ్బరినూనెలో కలిపి జుట్టుకు రాసుకుంటే తెల్లజుట్టు వేరు నుండే నల్లగా మారడం ప్రారంభమవుతుంది. పాదాల వాపును తగ్గించడానికి మార్కెట్లో వివిధ రకాల నూనెలు అందుబాటులో ఉన్నప్పటికీ, మీరు వెల్లుల్లి తొక్కను ఉపయోగించడం ద్వారా ఈ నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. ఉదయం సాయంత్రం వెల్లుల్లి పొట్టులో తేనె వేసుకుని తీసుకుంటే ఆస్తమా నుంచి బయటపడొచ్చు. అలాగే కాళ్ల వాపుల నుండి కూడా వెల్లుల్లి పొట్టు రక్షిస్తుంది. ఇందుకోసం వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టాలి. బాగా మరిగిన నీరు గోరు వెచ్చగా ఉన్నప్పుడు మీ పాదాలను ఆ నీటిలో ఉంచండి. క్రమంగా, పాదాల వాపు, నొప్పి నుండి ఉపశమనం పొందుతారు.

## షుగర్ లెవల్స్ రోజురోజుకూ పెరిగిపోతున్నాయా.. ఇలాచేస్తే కంట్రోల్ అవ్వడం ఖాయం!

ప్రస్తుత కాలంలో అనారోగ్య సమస్యలు ఎక్కువై పోతున్నాయి. కొత్త కొత్త సమస్యలు కూడా వస్తున్నాయి. ప్రస్తుత కాలంలో ఎక్కువగా అందరూ ఇబ్బంది పడే సమస్యల్లో డయాబెటీస్ కూడా ఒకటి. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అందరూ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. డయాబెటీస్ ఉన్నవారు ఖచ్చితంగా కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. లేదంటే ఈ వ్యాధి రోజురోజుకూ ముదిరి.. ప్రాణాల మీదకు తీసుకొస్తుంది. డయాబెటీస్‌కు ఇంకా సరైన మెడిసిన్ రాలేదు. కేవలం కొన్ని రకాల జాగ్రత్తలతో మాత్రమే నియంత్రణ చేసుకోవాలి. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను మీ డైట్‌లో చేర్చుకుంటే.. డయాబెటీస్‌ను కంట్రోల్ చేసుకోవచ్చు. మధుమేహాన్ని కంట్రోల్ చేసే ఆహారాల్లో పెరుగు కూడా ఒకటి. పెరుగు అనేది ఎంతో ఆరోగ్యకరమైనది. సరిగ్గా వాడుకుంటే పెరుగుతో ఎన్నో రకాల సమస్యలకు చెక్ పెట్టొచ్చని పలు అధ్యయనాల్లో తేలింది. పెరుగులో ఎన్నో పోషక విలువలు దాగి ఉన్నాయి. మరి ఇంత ఆరోగ్యకరమైన పెరుగుతో డయాబెటీస్‌ను ఎలా తగ్గించుకోవాలో ఇప్పుడు తెలుసుకుందాం. పెరుగుతో షుగర్ కంట్రోల్.. పెరుగు శరీరానికి రక్షణ కవచంలా పని చేస్తుంది. చాలా మంది పెరుగును అన్నంతో కలిపి తింటారు. అలా కాకుండా.. డయాబెటీస్‌తో ఉన్నవారైనా, లేనివారైనా.. ప్రతిరోజూ ఒక కప్పు పెరుగును తినడం వల్ల డయాబెటీస్ బారిన పడకుండా ఉంటారు. ఉన్నవారు కూడా నెల రోజుల్లో తగ్గించుకోవచ్చని నిపుణులు వెల్లడించారు. ఇటీవల చేసిన కొన్ని అధ్యయనాల్లో ఈ విషయం బయట పడింది. కాబట్టి మీరు కూడా షుగర్ వ్యాధితో బాధ పడేవారు అయితే పైన చెప్పిన విధంగా ఫాలో అయి.. డయాబెటీస్‌ను కంట్రోల్ చేసుకోండి. పెరుగు తినడం వల్ల ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా చాలా ఉన్నాయి. పెరుగుతో ఇతర బెనిఫిట్స్: 1. పెరుగును తీసుకోవడం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉంటాయి. వృద్ధాప్య ఛాయలు, ముడతలు, మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా తయారవుతుంది. అలాగే జుట్టు కూడా బలంగా, దృఢంగా ఉంటుంది. 2. నిత్యం పెరుగును తీసుకుంటే రక్తపోటు కంట్రోల్ అవుతుంది. అలాగే గుండె సమస్యలు రాకుండా ఉంటాయి. 3. పెరుగును తీసుకోవడం వల్ల అన్ని రకాల పొట్ట సమస్యలు దూరం అవుతాయి. దీంతోమలబద్ధకం సమస్య కూడా తగ్గుతుంది. 4. నిత్యం పెరుగు తీసుకోవడం వల్ల వెయిట్ లాస్ అవుతారు. పెరుగులో ఫైబర్ కారణంగా.. కొద్దిగా తిన్నా కడుపు నిండిన ఫీలింగ్ ఉంటుంది. కాబట్టి ఈజీగా వెయిట్ లాస్ అవుతారు. 5. అదే విధంగా శరీరంలో రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుంది. పెరుగు తింటే తక్షణమే శక్తి అంది.అలసట, నీరసం దూరం అవుతాయి.




## ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

### ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్

రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.



## మరోమారు వార్తల్లో నటి నమిత

### స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి

ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

## వెబ్ సీరిస్‌లపై దృష్టి పెట్టిన సమంత

ఒకప్పుడు వరుస సినిమాలతో బాక్సాఫీస్ వద్ద అలరించిన సమంత ఇప్పుడు ఓటీటీ వేదికగానూ సత్తా చాటుతున్నారు. ఇప్పటికే 'ఫ్యామిలీమెన్ 2'లో ఆమె నటనకు అందరూ ఫిదా అయ్యారు. ఇప్పుడు మరో సరికొత్త సిరీస్‌లోనూ సమంత నటించడానికి సిద్ధమయ్యారు. రాజ్ అండ్ డీకే సారథ్యంలో రూపొందబోయే పీరియాడిక్ ఫాంటసీ సిరీస్‌లో సమంత నటించబోతున్నారట. ఆదిత్య రాయ్‌కపూర్, వామికా గబ్బీ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'తుంబాద్' వంటి మిస్టీరియస్ థ్రిల్లర్ తీసిన రాహి అనిల్ బార్వే దీనికి దర్శకత్వం వహించనున్నారు. త్వరలోనే ఇందుకు సంబంధించిన వివరాలను ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ వెల్లడించనుంది. ఇప్పటివరకూ భారతీయ సినిమా తెరపై రాని సరికొత్త కథాంశంతో ఈ సిరీస్‌ను తీయబోతున్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. సిరీస్ చూస్తున్న ప్రేక్షకుడిని మరో సరికొత్త ఊహా ప్రపంచంలోకి తీసుకెళ్తుందట. మోసం, నమ్మకద్రోహం, ప్రేమ, త్యాగం ఇలా అన్ని అంశాలను మేళవించిన
కథతో దీన్ని తీర్చిదిద్దుతున్నారు. తొలుత దీన్ని సినిమాగా తీయాలనుకున్నా, తెరపై ఆవిష్కరించే అంశాలు ఎక్కువగా ఉండటంతో వెబ్‌సిరీస్‌గా మలిచారు. ఆదిత్యరాయ్ కపూర్‌కు ఇది రెండో వెబ్‌సిరీస్ ఆయన నటించిన 'ది నైట్ మేనేజర్' డిస్నీ?హాట్‌స్టార్ వేదికగా మంచి టాక్‌ను సొంతం చేసుకుంది. ఇక సమంత రాజ్ డీకే దర్శకత్వంలో 'సిటాడెల్: హనీ బన్నీ'లో నటిస్తోంది. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సిరీస్ ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుపుకొంటోంది. వామీ గబ్బీకి ఇది ఐదో వెబ్‌సిరీస్. రాజ్ అండ్ డీకేల విషయానికొస్తే నెట్‌ఫ్లిక్స్ కోసం వాళ్లు చేసిన 'గన్స్ అండ్ గులాబ్స్' పర్వాలేదనిపించింది. ప్రస్తుతం 'ఫ్యామిలీమెన్ 3' చేస్తున్నారు. ఇది అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది.





## నాని ప్యారడైజ్‌కు భారీ డిమాండ్

నాచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలకు ముందే ట్రేడ్ వర్గాల్లో భారీ రికార్డ్స్ సృష్టిస్తుంది. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఆ అంచనాలకు తగ్గట్టుగానే ఈ చిత్రం థియేట్రికల్ బిజినెస్‌లో కొత్త రికార్డులు సృష్టిస్తుంది. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం.. 'ది ప్యారడైజ్' నైజాం థియేట్రికల్ హక్కులను మైత్రీ డిస్ట్రిబ్యూటర్స్ రూ.37 కోట్లకు సొంతం చేసుకుంది. నాని కెరీర్‌లో ఇప్పటివరకు ఏ చిత్రానికీ ఈ స్థాయిలో నైజాం బిజినెస్ జరగకపోవడంతో ఇది రికార్డు డీల్‌గా నిలిచింది. సినిమా విడుదలకు ఇంకా సమయం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి కూడా భారీ ఆఫర్లు వచ్చే అవకాశాలు ఉన్నాయని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



## రామ్‌చరణ్ - సుకుమార్ కాంబో

### ఆర్17 పట్టాలకెక్కనుందని ప్రచారం

ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్లు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056